# 1వ పాఠము

సంస్కార భోజనపరులారా తిండిబోతులారా! ఎందుకనగా మీరిదివరలో ఎన్నిసార్లు తిన్నారు? ఇన్నిసార్లు తిన్నందుకు తిండిపోతులు కాకపోతే మరెవరు? తిండిపోతులనే పేరు మనకున్నప్పటికిని సంస్కార భోజనము విషయములో తిండిపోతులనేది మనకు మంచి పేరే. పోయినవారము మీరు సంస్కారము ఎక్కడో ఒకచోట తీసికొన్నారు అనుకొనండి. ఎన్నిసార్లు దొరికిన అన్నిసార్లు తీసికొనండి. పోయినవారము మంచి ఆహారము తిన్నాను. ఈ వారములో ఎందుకని ఎవరు అనరు. అలాగే సంస్కార విషయములో కూడ ఎవరు అనకూడదు. మన భోజనముకన్న ఈ భోజనము విలువైనదైయున్నది. గృహములో భుజించు ఆహారము ఒక్క శరీరానికేగాని ఈ సంస్కార భోజనమైతే శరీరానికి, ఆత్మకు భోజనమైయున్నది.

ఇందులో మూడు భోజనములు గలవు. (1) గృహములో తినే భోజనము, (2) గుడిలో భుజించు సంస్కార భోజనము, (3) అంతరంగ సంస్కారము అనగా సన్నిధిలోనికి ప్రభువే రహస్యముగా వచ్చి ఇచ్చే భోజనము. అలాగే ఆయా విధములైన కూటములలో ప్రభువు తన భక్తులకిచ్చే సంస్కార భోజనమైయున్నది. ఎక్కడ విశ్వాసి సిద్ధముగా యుండిన అక్కడ ఆయన ఇచ్చును. దేవాలయములోనే కాదు, సన్నిధిలోకూడ ప్రభువు సంస్కార భోజనమిచ్చును. ఈ భోజనము గురించి బైబిలుమిషనువారు భోదించుచు, అనుభవించుచున్నందున గొప్ప అవమానము చెడ్డపేరు వచ్చుచున్నది. ఎలాగనగా మా పాదిరిగార్లు ఇచ్చింది వట్టిదేనా? మేమందరము మా సంఘములలో మానుకొనవలెనా? అని అనేకులు ఆక్షేపించుచున్నారు.

నేటి ఉదయమున నా ప్రసంగాంశమేదనగా అది ప్రభువు రాత్రి వచ్చి ఇచ్చిన వర్తమానమైయున్నది. ఈ ప్రసంగము ప్రభువు చెప్పినది గనుక అది మహా విలువైనది. పాదిరిగారిచ్చేదే విలువైనదంటే ప్రభువు ఇచ్చు రహస్యమైన సంస్కారము ఇంకా విలువైనది. అలాగే పాదిరిగారిచ్చే వర్తమానము మహా విలువైనదైయున్నది. నా ప్రసంగాంశము కొంచెమేగాని చివరకు ఎక్కువకాదు. దానికి అంతమే లేదు, ఈ సంస్కార భోజనమునకు అంతమేలేదు. పుట్టుక మొదలు అంతమువరకు భుజిస్తున్నాము. చనిపోయి బ్రతికి మోక్షానికి వెళ్ళగా అంతములేకుండ అనంతకాలము భుజించుటయే ఉండును.

1. ఇక్కడ మనకెదురుగా యున్న రొట్టె, ద్రాక్షరసము కొంచెము కొంచెమేగాని దానివలన కడుపు నిండదు. అయినను కొంచెము కొంచెమే గొప్ప భోజనమునకు గుర్తుగాన తప్పక దీనిని అనుభవించవలెను. ఇక్కడ కొంచెము రొట్టె, దాని వెనుక గొప్ప శరీరము, కొంచెము ద్రాక్షారసము దాని వెనుక గొప్ప రక్తప్రవాహమునకు ముంగుర్తైయున్నది. అయ్యో కొంచెము ద్రాక్షారసము, కొంచెము రొట్టె అని అనుకోకుండ ఇవి గొప్పవానికి ముంగుర్తు అని అనుకొనవలసియున్నది. ప్రభువు తన శిష్యులకు పంచి ఇచ్చినప్పుడు ఇది రొట్టె ద్రాక్షారసమని అనక ఇది నా శరీరము; ఇది నా రక్తమనే విచిత్రమైన మాట పలికిరి (మత్తయి 26:26-28; మార్కు 14:22; 1 కొరింథీ 11:23-29. ఆ చిన్న రొట్టె పెద్ద శరీరానికి ముంగుర్తు అని తెలియుచున్నది. రొట్టె ఆయన చేతితో వారికిచ్చుట ఎంత నిజమో నోటితో ఇది నా శరీరమని పలుకుటకూడ అంతే నిజమైయున్నది. ఈ ప్రసంగములో ఇది మొదటిమాట. దీని ప్రక్కన మరొక మాటయున్నది.

2. మత్తయి 18:20లో ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని యేసుక్రీస్తు ప్రభువు చెప్పెను. ఇద్దరు ముగ్గురు ఉండేది చిన్న సంఘముగాని పెద్ద సంఘముకాదు. వీరే పండ్రెండు మంది అయిరి. వీరే పెరిగి నూట ఇరువదిమంది అయిరి అపో. కార్య 1:15. వీరు కొన్ని గంటలలో మూడువేలమంది అయిరి అపో. కార్య 2:41. ఇప్పుడు క్రైస్తవ సంఘము కొన్ని కోట్లలోనున్నది. ఈ కోట్ల సంఘము ఇద్దరు ముగ్గురునుండి వచ్చిన భూమిమీదనున్న సంఘము మాత్రమే.

రెండవ వరుసలో పరలోకమందు చనిపోయియున్న జనాభా ఆదినుండి నేటివరకున్న వారే గొప్ప సంఖ్య. కోటానుకోట్ల భూలోకసంఖ్య ఇవియే లెక్కపెట్టుటకు వీలు లేకపోతే ఈలోగడ రక్షింపబడి భూలోకమునుండి వెళ్ళువారును, హేడెస్‌లో మారుమనస్సుపొంది పైకి వెళ్లేవారున్నారు. వారిని అసలే లెక్కింపలేము.

నేను (ఫా॥ యం. దేవదాసు అయ్యగారు) కాకానిలో ఒకమాట చెప్పినాను అదేమనగా హేడెస్‌లో మారుమనస్సు పొందేవారుగాక, భక్తులు భూలోకమునుండి వెళ్ళుటేగాక, నరకద్వారము నుండి పెద్ద గుంపు నరకములోపడును తరువాత నుండి దేవా తండ్రీ! నీ నామమున ప్రవచింపలేదా! బోధింపలేదా! అద్భుతాలు చేయలేదా! వారేనా మీ బిడ్డలు మేముకాదా! అని అనుచుండగా అక్రమము చేయువారలారా అని ప్రభువు అన్నారు.మత్తయి 7:21-24. అట్టివారిని గురించి (యం. దేవదాసు అయ్యగారు) ఏదో ఒక ఉపాయము పన్ని వారి జుట్టు పట్టిలాగి రక్షించుము తండ్రీ! అని ప్రార్థించినారు.

ఇంత భూమిని, ఇంత ఆకాశమును రక్షించుటకు నీకు శక్తియున్నదే. వీరిని రక్షించుటకు నీకు శక్తిలేదా! అని, వాగ్ధానములన్ని ఎత్తి ఎత్తి అడుగగా అందుకు ప్రభువు వారికి నరకమని వ్రాసినాను ఇవన్ని ఎత్తికొని ప్రార్ధించుట ఎందుకని అన్నారు. అప్పుడు నేను 1కొరింథీ 13వ అధ్యాయములో ప్రవచనములన్ని కొట్టివేయబడును అన్నావుకదా! ఆ మాట కొట్టివేసి రక్షించుచున్నావు. గాన ఈ మూడు గుంపులు కలిపిన ఎంతగొప్ప సమూహమో! ఇద్దరు ముగ్గురనేది అంత గొప్ప సమూహమైపోయింది. కొంచెముగా రొట్టె, ద్రాక్షరసమును గొప్ప శరీర రక్తములను తలంచండి.

3. ఈలోకములో ఎక్కువకాలము బ్రతికిన నూరేండ్లు కీర్తన 90:10. ఎక్కడో ఒకచోట ఇంకా కొందరు ఎక్కువకాలము బ్రతికినా అది లెక్కలోనిదికాదు. పరలోకములో నూరు తొమ్మిదివందల కాదుకదా లెక్కపెట్టుటకు గణితశాస్త్రము పనికిరానంత కాలము బ్రతికెదము. శరీర బ్రతుకునకు సంబంధములేదు.

**ఒకటవ గుంపు:–** రొట్టె ద్రాక్షారసము.

**రెండవ గుంపు:–** ఇద్దరు ముగ్గురనేవారు.

**మూడవ గుంపు:–** లెక్కపెట్టలేనన్ని మనిషి బ్రతికిన సంవత్సరములు.

**నాలుగవ గుంపు:–** భూలోకములో మనిషి పుట్టి చనిపోవు వరకు అన్ని కష్టములే. చెడ్డవారికి హేడెస్సులోను కష్టములే మనిషి జన్మమే కష్టము. ప్రతి మనిషికి కష్టమే. నాలుగవ గుంపువారికి కష్టమే లేదు. మనలను పరలోకమునకు ప్రభువు తీసికొనివెళ్ళిన తరువాత ఇక కష్టముండదుగాని త్రిత్వ తండ్రికి, దేవదూతలకు, పరిశుద్ధులకున్న కష్టమేమనగా భూమిమీద ఉన్న వారింకా రక్షింపబడలేదనే కష్టమే

కాబట్టి భూలోకములో కష్టములకాలము కొంచెమేగాని పరలోకములో కష్టముల వాసనయే యుండ. ఇప్పుడు అందరు రక్షింపబడలేదనియన్నా నరకములోనికి వెళ్ళేవారు తిరిగి మోక్షమునకు వచ్చుటలో మహా ఆనందముగలదు.

**ఐదవగుంపు: –** కొంతమందికి ఒకబాధ యున్నది. అదమేనగా నిన్నగాక మొన్న వచ్చినవారికి ప్రభువు కనిపించి మాట్లాడుచున్నారుగాని, మేమెంత కాలమునుండి తపస్సుచేసిన మాకేమిలేదనుచున్నారు. మనము శాశ్వతకాలము పరిశుద్ధుల యెదుటను, దూతల సమూహములోను ఏబేధములేక సహవాసములో యుందుము. ఇప్పుడు చూడలేకపోయినా పరలోకమునకు వెళ్లిన తర్వాత త్రిత్వ దేవుని ముఖాముఖిగా చూచి మాట్లాడుదుము. అప్పుడు కనబడలేదనే చింత, ప్రశ్న ఉండక మాయమైపోవును. కాబట్టి కొంచెమే పుచ్చుకొనుచున్నాము అని అనుకొనకుండ ఎక్కువ అనుభవించుచున్నామని తలంచి ఈ బల్లయొద్దకు రండి. కొంచెము, కొంచెము తీసికొనండి. ఏ విషయములోను సందేహము లేకుండ బల్లయొద్దకు వచ్చుటకు విశ్వాసము, ధైర్యము, బలము ప్రభువు అనుగ్రహించును గాక! ఆమేన్.

# 2వ పాఠము

**దా.కీర్త 23:1; మార్కు 14:22; 1కొరింథీ 11:23-29.**

**పాపశుద్ధి:–** దేవా! మా శరీరబలము కొరకు నీ శరీర రక్తములు సిద్ధపర్చినందుకు నీకు వందనములు, అయోగ్యులము, పాపులము నీశరీరాహారము పుచ్చుకొనుట మాకు నేర్పించుము, నీ వాక్య వర్తమానము అందించుము. జ్ఞానము, విశ్వాసము, ప్రత్యక్షతను, వాక్యమును అందించే దీవించుము. అయోగ్యంగా పుచ్చుకొనకుండా యోగ్యంగా పుచ్చుకొనే కృప దయచేయుము. దయ్యములను వెళ్ళగొట్టుము. దూతలను కావలి ఉంచుము మాకు నీ భోజనముయెడల అపేక్ష, శ్రద్ధ, గౌరవము, అభిమానము దయచేయుము అని జీవాహారము నేనే అని పలికిన యేసుక్రీస్తు నామమున వేడుకొంటున్నాము ఆమేన్.

సంస్కారమును జ్ఞాపకము తెచ్చుకొను విషయములు వివరముగా సువార్తలలోను, పాతనిబంధన, క్రొత్తనిబంధనలలోను ముఖ్యంగా ప్రకటన గ్రంథములోను యున్నది. వాటిని తలంచి బల్లయొద్దకు రావలెను. వాటిలో ఒకటి తలంచవలెను. కీర్తనలు 23:5 వాక్యము మనకు కంఠతయైన వాక్యం దానిని వివరించుకొందాము.

ఈ వాక్యములో రూపం ఎలాగు తలంచాలి. **"నా శత్రువులు"** అనగా బైట మన శత్రువులున్నారని తలంచండి శత్రువులు మనవైపు చూస్తున్నట్లును తలంచండి. భోజనము ఈ బల్లపై యున్నవని తలంచండి. శత్రువులు మనవైపు చూస్తున్నట్లును భోజనము ఈ బల్ల పై యున్నవని తలంచండి, ప్రభువు బల్ల వద్ద నిలువబడియున్నారు. ప్రభువు బల్లవద్ద నిలువబడి నాకు భోజనము సిద్ధపరచియున్నాడు

అని తలంచండి. ఇక్కడ పుచ్చుకొనువారు బల్లయొద్ద కూర్చుండి యుందురు. సిద్ధపర్చిన ప్రభువు, పుచ్చుకొను విశ్వాసి, శత్రువులైన సైతాను ఈ ముగ్గురున్నారు. ప్రభువు బల్ల, భోజనము, సైతాను, విశ్వాసి, భోజనము ఎన్ని సం॥ల నుండి సిద్ధపర్చుచున్నారో ఆ కళలన్నీ ఉన్నవి. దేనికళ దానిదే. అన్నిటిలో కష్టమైనది. ప్రభువు మన నిమిత్తమై ఈ భోజనము సిద్ధపరచుట కష్టమైన పని.

**మన భోజనము:-** వడ్లు దంచి, బియ్యంచేసి, బజారుకు వెళ్ళి కూరలు తెచ్చి సిద్ధపర్చుట కష్టమని స్వంత అనుభవమువల్ల ఈలోక భోజనంవల్ల తెలిసికొంటున్నాము. ఇది అశాశ్వత భోజనము ప్రభువిచ్చే శాశ్వత భోజనము. 1) సిద్ధపర్చుట, 2) నాకు, 3) భోజనం, 4) ప్రభువు బల్లయొద్ద ఉండుట, 5) ఆయనే సిద్ధపరచియున్నారు, 6) ఆయనే వడ్డించుచున్నారు. పాపి, బీదవాడు, అయోగ్యుడైన లోకస్తుని మార్చి సిద్ధపర్చి బల్లకు చేర్చే యింతగొప్ప పని నమ్మటకు వీలులేదు. జ్ఞానం ఒప్పుకోదు. మనస్సాక్షికి వీలులేదు. అయినను నమ్మే విశ్వాసము ప్రభువు మనకు ఇచ్చినాడు. ఇది ఆయన కృప. సిద్ధపరచుట, నిలువబడుట యొక కృప. మనలను రానిచ్చుట రెండవ కృప. ఆయన అన్నియు సిద్ధపర్చినను మనము యోగ్యులముగా పుచ్చుకోకపోతే లాభమేమిటి? మేము అయోగ్యులముగాను, గౌరవములేనివానిగాను, శ్రద్ధలేనివానిగాను వచ్చియున్నామని ఒప్పుకొని బల్లయొద్దకు పోవలెను. ఆయన నాకు శత్రువుల ఎదుట భోజనము సిద్ధపర్చుట, కీర్తన 23:10 ఆ భోజనమునకు నన్ను విధిగా సిద్ధపర్చి నన్ను పిలుచుచున్నాడు. కాబట్టి ఆ విందుకు నేను వెళ్ళకపోతే ప్రయోజనమేమి? మోక్షం చాలా విశాలమైనది. ఇంకా స్థలమున్నది నన్ను పిలుచుచున్నాడు.

1. భోజనము ఉంది, 2. ఖాళీ ఉంది, 3. ఆహ్వానమున్నది గనుక వాటిని తినకపోతే ప్రయోజనమేమి? మీరు నమ్మినా, నమ్మకపోయినా గౌరవించినా, గౌరవించకపోయినా ఆయన పిలుచుచున్నాడు. పై రెండు గుణములతో ప్రభువు బల్లయొద్దకు రండి. అంతా సర్దుకొని బల్లయొద్ద కూర్చున్న ప్రభువు దయారస ముఖము, ఆయన పడిన శ్రమ అంతా చూచి సంతోషిస్తూ మనము భోజనమునకు రావలెను.

(1) ప్రభు భోజనము మనకని నమ్మండి, (2) ప్రభు భోజనము ప్రభువుది గనుక ఘనపర్చండి, (3) ప్రభు భోజనము యెడల గౌరవము గలవారే వచ్చి పుచ్చుకొనండి. ఈ భోజనము పుచ్చుకొను వారికి విశ్వాసము, గౌరవము రెండు కుదరాలి.

**జ్ఞానం:-** కుదరకపోయినా పరవాలేదు. ప్రభువు నాకెందుకివ్వాలనే మనస్సు వస్తే ఎంత చెప్పిన అర్ధముకాదు, నమ్మండి. "నీకును నీ సంఘమునకు నిత్యమును జయము జయము". పేతురు నీకు, యోహాను నీకు ప్రభువు ఎందుకీలాగిచ్చెను తెలుసునా, యాకోబు నీ మాట మరెందుకు పుచ్చుకోవడం ప్రభువు యిస్తున్నాడు గాన పుచ్చుకుంటున్నాము. విశ్వాసం వల్ల అంత గ్రహిస్తాము జ్ఞానంవల్ల కొంత గ్రహిస్తాము విశ్వాసము గొప్పది.

**సాదృశ్యము:-** ఒత డొంక ఉన్నది, ఒక పొద ఉన్నది, అక్కడ కొన్ని చెట్లున్నవి, మొక్కలు, ముండ్ల కుప్పలున్నవి. దూరంగా పెద్దపులి, ఎలుగు బంటు, నక్కకూడా ఉన్నది. ఇక్కడ గొర్రెపిల్ల, ఇక్కడ గొల్లబోయవాడు చేతిలో డొంకి కర్ర ఉంది. గొల్లబోయవాడు పొద యొద్దకు వెళ్ళి తన కర్రతో చెట్లు వంచి గొర్రెపిల్లకు ఆహారం పెట్టెను.

క్రూర జంతువులన్నిటికి గొర్రెపిల్ల కనిపిస్తుంది. వాటి కండ్లు గొర్రెపిల్లను చూస్తున్నవి. గొల్లబోయవాడు గొర్రెపిల్లలకు మెత్తని మేతవేయగా వాటివైపు చూస్తు గొర్రెపిల్ల తినగలదా? తినకుండ అవి చేయగలవా? మేత తిన్న తరువాత గొర్రెపిల్లను క్రూర జంతువులు తినగలవా?

**దుడ్డు కర్ర:–** శత్రువులను కొట్టుటకు వచ్చేవు సుమా నా చేతిలో కర్ర ఉన్నదనగలడు.

**దండము:–** గొర్రెపిల్లను వెనుకకు లాగుటకు ఏ భయము లేకుండా గొర్రెపిల్ల బాగా చూస్తు మేస్తూ ఆకలి తీర్చుకొనును, గొల్లవాడు మేపుచున్నాడు గాన క్రూర జంతువులు ఏమి చేయలేవు. గొర్రెపిల్ల సంతుష్టి పొందవలెను. నేను గొర్రెపిల్లకు ఉత్తమ కాపరిని యోహాను 10:11 నా గొర్రెలు నా శబ్ధము వినును యోహాను 10:27 అనగా 1) విశ్వసించండి, 2) గౌరవించండి, 3) నాయొద్దకు రండి అను ఆహ్వానము యిట్టి విశ్వాసులే ఈ బల్లయొద్దకు రండి. విశ్వాసం కుదుర్చుకొండి. సైతాను, దయ్యాలు అంత్యక్రీస్తు, అబద్ధ బోధకులు, మన శత్రువులు, స్వంత ఇంటిలోనే శత్రువులుందురు. మత్తయి 10:36 ఎక్కడబడితే అక్కడే శత్రువులు ఈ కాలంలో ఉన్నారు గాన శత్రువులయెదట మనకు భోజనం సిద్ధపర్చియున్నాడు. శత్రువులు, సైతాను, దయ్యాలు, జబ్బులు పాపములు, నరకము, హేడెస్సు 7 సం॥ల పరిపాలనవైపు నీకేమి పని? నావైపు, నా భోజనం వైపు చూచి కడుపునిండా భోజనంచేయుము. అది ప్రభువుయొక్క దయారస రూపకళ "నీకును నీ సంఘమునకు నిత్యమును జయము జయము".

బైబిలులో ఏదెను తోట కథ, హేబెలు కథ, నోవహు కథ, అబ్రాహాము కథ, ఐగుప్తులో ఉన్న యోసేపు కథ, పాలెస్తీనా కథ,

షద్రకు, మేషాకు, అబెద్నెగోలు రాజగృహములో భోజనము చేసిన కథలన్నియు ప్రభువు భోజనమును జ్ఞాపకము చేయుచున్నది. పై కథలన్నిటిలో యీ భోజనముయొక్క మూలములు దొరకకమానవు. ఐగుప్తులో యున్నవారు ఇశ్రాయేలీయులైన దేవుని జనులకు శత్రువులై యున్నారు. ఐగుప్తులో ఇశ్రాయేలీయులు అనేక హింసలు పొందిరి. అయినప్పటికినీ తిండికి వారికేమి కష్టములేదు. వీరు ఫలవంతమైన గోషెనులో యున్నారు. ఐగుప్త శత్రువుల యెదుట ఎన్నిక జనమునకు భోజనం సిద్ధపర్చెను. వారి ప్రయాణములో నదులు, నీళ్ళు, వీధులు, వ్యాపారులు లేకపోయినను 40 సం॥లు సమృద్ధిగా భోజనమును తిన్నారు అనగా వారక్కడ ఉన్నప్పుడు "నా గిన్నె నిండి పొర్లుచున్న" అనుభవము కనబడుచున్నది.

1) గిన్నె, 2) నిండుట, 3) పొర్లుట. విశ్వాసికి ఎంత రాజభోగము, ఎంత పాపియైన అయోగ్యుడైన దేవలోక భోగము ఎంత ధన్యత ఇశ్రాయేలీయులు 40సం॥లైన తరువాత అరణ్యందాటి పాలస్తీనా వెళ్ళండి. కట్టని ఇండ్లు, వేయని తోటలు ఉన్నవి. అనుభవించండి. అరణ్యములో ఎదిరించి ఐగుప్తులో 400సం॥లు చెరలో ఉన్నవారికి ఎంత రాజభోగము ఈ కథ మనకు ఆదరణ కలుగజేయుచున్నది. ఇశ్రాయేలీయులు ఐగుప్త దేశ శత్రువుల యెదుట నుండి గోషెను దేశమును విడిచి వచ్చెను. దేవుడు వారికి అరణ్యములో 40 సం॥లు శత్రువుల యెదుట భోజనపు బల్లవేసెను. ఎంత ఆశ్చర్యము ఏనాడో పుణ్యం చేసుకున్నారు. గాని హిందువులందరు ఏనాడో పాపము చేసుకొన్నారు. గలిలయ ప్రక్కన పచ్చిక బయళ్ళు, గలిలయులు, సమరయులు అంతా విరోధులే కాని అక్కడ యేసుప్రభువు 5వేల మందికి భోజనము పెట్టినాడు. మనము అందరమును నూతన

యెరూషలేముకు వెళ్ళితే పెండ్లి కుమారుడు ఎవరిని పిలుచునో వారికిని పెండ్లి కుమార్తెకును దేవదూతలయెదుట విందు జరుగును. అన్నిటికంటే మహా గొప్పది నూతన యెరూషలేములో జరిగే విందు.

**పాతాళములో:-** అంతెక్రీస్తు, అబద్ధ ప్రవక్త, సైతాను చూస్తుండగానే భోజనమును సిద్ధపరచియున్నాడు. ఈ విందు శక్తి పరలోకము వరకును. అనంతకాలం వరకును విందుయొక్క శక్తి అక్కడక్కడ వరకు వస్తూనే యుండును.

**ప్రార్థన:-** దయగల ప్రభువా! శరీరమునకు లోకాహారం, ఆత్మకు శరీరానికి సంస్కారవిందున్నూ, నూతన యెరూషలేములోను మహాగొప్ప పెండ్లి విందు సిద్ధపర్చినావు. ఈ మూడు బల్లలను గూర్చి, మూడు విందులనుబట్టి నీకు స్తోత్రములు ఆమేన్.

# 3వ పాఠము

**మత్తయి 26:26; మార్కు 14:22; లూకా 22:14; 1కొరి. 11:17-31.**

**ధ్యానవాక్యము:- మత్తయి 5:6.**

**ప్రార్థన:-** దయగల ప్రభువా! నేను మరలా నీ సన్నిధిలో సమావేశము కాగల తరుణమిచ్చినందుకు స్తోత్రము. ప్రభువు భోజన సంస్కారమును వివరించుకోగల సహాయము అనుగ్రహించుము. రావలసిన వారిని రప్పించుము. దూతలను కావలి యుంచి దయ్యాలను వెళ్ళగొట్టుము. జ్ఞానం, మనస్సాక్షి, విశ్వాసము, ప్రత్యక్షత, ధైర్యమును వెలిగించుమని వేడుకొంటున్నాము ఆమేన్.

**మత్తయి 5:6లో మొదటి నీతి:-** ఆ నీతి కొరకు మనకు ఆకలి దప్పులు కలిగియుండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే బైబిలులో వ్రాయబడిన ప్రకారము నడుచు నీతి, రెండు ఉన్నవి. 1) చెడును విసర్జించుట, 2) మంచిని చేయుట. ఆ మంచి బైబిలులో యున్నది అది కావాలని కోరుకోవాలి. నీతి అనగా బైబిలు చదివి, ప్రార్థించి, ధ్యానించి, సహించి, సువార్త ప్రకటించి భక్తిగాయుండుట నీతి. బాప్తీస్మము పొందుటయు నీతిలో ఒక భాగమే. ప్రభువు బాప్తిస్మమప్పుడు నీతి యావత్తు ఈలాగు జరుగునని నమ్మెను. కొండ ప్రసంగములో సెలవిచ్చినదంతా నీతే. ఇతర ప్రసంగాలలో సెలవిచ్చింది నీతే. ప్రవక్తల గ్రంథములలో ప్రకటించిందియు నీతే, మనము కోరవలసినదియు నీతే. మోక్షానికి వెళ్లుట. రక్షణ కోరుటయు నీతే, శరీర జీవనములో ఆకలిదప్పులు మనకు తెలియును. అలాగే ఆత్మ జీవనములో ఆకలి దప్పికయున్నది. శరీర జీవనంలోని ఆకలి మనకు తెలుసు. ఇది వస్తువు కాదు దప్పికయు వస్తువుకాదు. ఆకలి + దప్పిక ఇవి అనుభవములు.

ఆకలి తీర్చేది ఆహారము. ఇది వస్తువు. దప్పిక తీర్చేది నీళ్ళు ఇది వస్తువు. అవి అనుభవాలు ఇవి వస్తువులు, ఆకలి వేయడము, ఆకలి తెలియడము ఆకలి దీరడము ఈ మూడును అనుభవములు.

**ఆహారము:– నీళ్ళు చూపించగలముగాని, ఆకలి చూపించలేము** ఇది అనుదినము మనిషి జీవిత కాలములో అనుభవములును, వస్తువులును యున్నవి. సంస్కార సమయమందు అనుభవాలు, వస్తువులు చూపించుచున్నాము. (1) ఆకలి, (2) దప్పిక, 3. ఆహారము, 4. నీళ్ళు, ఆహారము ఆకలిమీద యుంటుంది. ఆత్మ జీవనంలో ఆహారము + నీళ్ళును యుండవలయును. శరీరానికి సంబంధించిన ఆకలి + దప్పిక మత్తయి 5:6లో ప్రభువు చెప్పలేదు. నీతిమీద ఆకలి దప్పికను గూర్చి ఆయన చెప్పెను. ఆకలిదప్పులు గలవారికే తృప్తి కలుగును. ఇక్కడ ఆకలి దప్పిక అనేవి అనుభవములు మనము కోరింది దొరుకుటే ఆకలి + దప్పిక దీరుట. ఇదే నీతి. నీతికి సంబంధించిన వరాలు, శక్తులు అవన్ని కోరుకోవచ్చును.

**1. ఆకలి అనగా:–** ఆశ ఊరికే ఆశించడమే, కొందరు ప్రార్థనలో విశ్వాసం కోరుకొంటున్నారు. ప్రార్థనంతా ఇదే ఆలాపన. ఆ ఆలాపనే ఆశ. దప్పిక, కోరిక, నీతి. ఆశ లేకపోతే ప్రార్థనవల్ల లాభములేదు. ఆశ లేనిదే అడిగినది దొరకదు. ఆకలిదప్పిక తీరదు. ఆహారమెందుకంటె ఏది మనకు లేదో అది అనుగ్రహింపబడవలసింది ఇదే ఆహారము. తినవలసిన దానికొరకు ఆశిస్తాము. ఇదే ఆహారము, మనకు ఏది ఇచ్చినాడో అదే ఆహారము ఆకలి తీర్చును. నీళ్ళు త్రాగేటందుకును అన్నం, కూర, పండ్లు ఆహారములోనివి, నీళ్ళలోనివి కాఫీ, టీ, గంజి, ద్రాక్షరసం ఇవి నీళ్ళలోనివి. తినేవి ఆహారమును త్రాగేవి దాహము తీర్చేదియునైయున్నది. నేనిచ్చు నీటివల్ల దాహము తీరును. ఇక దాహము కాదని చెప్పెను. సంస్కార భోజనముకూడా

వీటిలో ఒక భాగము. ఈ భోజనము నిమిత్తమై ఆశ, ఆకలి, దప్పిక ఉన్నదా? వీటిని అనుభవించిన హాయిగా ఉండును. ప్రభు శరీరమువల్ల నాకు ఆకలి తీరును. ప్రభువు రక్తమువల్ల నాకు హాయిగా ఉండును. ఎవ్వరికి ఆకలిగా, ఆశగా, కోరికగా యుండునో వారికి ఆకలి తీరును. ప్రభువు జీవమును త్రాగినవారికి రక్తమును ప్రాణమునకు హాయిగా యుండును. ప్రభువు జీవముపై ఆశగలవారు, దాహము గలవారు, కోరిక గలవారు, పుచ్చుకుంటే హాయిగా ఉండును. ఎవరికి వారే పరీక్షించుకొండి. లోకభోజనం చేయుటకు మందముగాయుంటే భోంచేయము, ఇంకొకసారి త్వరగా ఆకలివుంటే ముందే తింటాము. వారికి తృప్తి, పుచ్చుకొనుటకు ఆతురత వుంటే ఆకలి తీరి తృప్తి కలుగును. అట్టి మనస్సుతో శరీర, రక్తములు పుచ్చుకొన్న వారికి ఆకలి, దప్పిక తీరి ప్రాణము హాయిగా ఉండును. ఆత్మ బలం కొరకు శరీరం, ఆత్మజీవము కొరకు రక్తము. రక్తములో జీవముందని బైబిలులో యున్నది. సిలువపై ఎఱ్ఱని రక్తము కాదుగాని దానిని మించిన జీవనము సంస్కార రక్తములోయున్నది.

**2. పరీక్షలు:–** 1. ఆకలిగా ఉన్నదా? మందముగా ఉన్నదా? మందముగా యున్నవారు తింటే వాంతి అగును. ఆకలిగా యున్నప్పుడు తిన్నవారికే తృప్తి, జీవము, శుద్ధి కలుగును. ఇంతకు ముందు ఆకలి లేకపోతే ఈ మాటలు విన్నందుకైనా ఆకలి కలిగించుకొండి. ప్రభుయేసు రక్తము పుచ్చుకొనుటకు దాహము కలిగి రండి. దాహమున్నదో లేదో చూచుకొండి. మందములోయుండి బల్లయొద్దకు వచ్చినట్లయితే శరీర రక్తములను అవమానపరచినవారు, అగౌరవపరచిన వారగుదురు. లూథరన్ వారు వారము ముందు చెప్పుదురు. ఆకలిదప్పులు కలిగించుకునేటందుకే ఆకలిదప్పులతో వచ్చితిని అని త్రాగువారు తృప్తిపరచబడుదురు. మీకు దీవెనలు కలుగునుగాక!

# 4వ పాఠము

I. 1కొరింథీ 11:27. దయగల ప్రభువా! మేము నీ బల్లయొద్దకు రాబోవుచున్నాము. గనుక మేమెట్లు సిద్ధపడవలెనో అది మాకు నేర్పించుము. రావలసినవారిని రప్పించి, రాకూడని వారిని రానియ్యకుము. దూతలను కావలియుంచి, దయ్యములను వెళ్ళగొట్టి మనస్సాక్షి, జ్ఞానం, ప్రత్యక్షము, విశ్వాసము, ధైర్యమును వెలిగించుము నామకార్థముగా గాక సమస్తమును నీ దృష్టికి అనుకూలమైన రీతిగా జరిగించుమని వేడుకొంటూయున్నాము. ఆమేన్.

**రెండు ముఖ్యమాటలు:-** అయోగ్యముగా పుచ్చుకొనుటనుబట్టి అపరాధియగుదుము, అయోగ్యముగా పుచ్చుకొనకూడదు. అట్లు పుచ్చుకొనిన యెడల అతడు నేరస్థుడగును. (1) అయోగ్యత కలిగియుండుట నేరము, (2) ప్రభురాత్రి భోజనము అట్టి నేరము కలిగియుండి పుచ్చుకొనుట రెండవ నేరము. ఈ రెండు నేరములుంటే నాశనమే. పాపమేమైన యున్నదా? అని చెప్పనుగాని అయోగ్యము యున్నదా అని చెప్పుచున్నాము. పౌలు పాపములనుగూర్చి ఈ సందర్భములో చెప్పలేదు. పాపము అసలే పనికిరాదు.

**అయోగ్యత అనగా:-** మనిషి ఉన్నాడు అతనికి జబ్బు ఉన్నది. అప్పుడు భోజనము చేయలేడు. అతనిలో ఉన్న జబ్బు పోతేనే గాని భోజనము చేయలేడు. మనిషి ఉన్నాడు పాపము తీసివేసికుంటాడు శుభ్రమైపోయాడు. జబ్బు తీసివేసి శుభ్రమైన తరువాత ఇంకా భోజనము మామూలుగా తినుటకు యోగ్యుడు కాడు. అదే యోగ్యత. పాపము పోయిన తరువాత ప్రభువు భోజనము పుచ్చుకొనుటకు వీలులేదు.

ఎందుకనగా అయోగ్యత ఇంకా యుండును. ప్రభువు భోజనము కాదుగాని అది విందు ఎక్కువ పాపశుద్ధి పొందనివాడు విందు ఆరగించుటకు యోగ్యుడుకాడు. జబ్బు పోయినవాడు భోంచేయగలడు. భోజనములో ఒకటి రెండు కూరలుండును. ఇతడు విందుకు తగడు. జబ్బు పోయిన మనిషి బలపడి మామూలు భోజనానికి అలవాటు పడినగాని విందుకు వెళ్ళలేడు. పాపము పోయిన పిదప మనిషికి నీరసముండును. వాక్యం ద్వారా బలపడి విందులోనికి వెళ్ళవలెను. బలపడకుండ విందులోనికి వెళ్ళుటే అయోగ్యత. కొందరు పాపాలు ఒప్పుకొనరు, విసర్జించరు, పాపపరిహారము పొందరు అది అయోగ్యత అయితే పాపలు ఒప్పుకొని, విసర్జించి, పరిహారము పొంది ప్రార్థించి, తీర్మానాలుచేసి వాక్యంవల్ల బలపడి ప్రభువు బల్లయొద్దకు రాగా అయోగ్యత పోవును. (1) పాపములు ఒప్పుకొనుట, (2) పాపములు విసర్జించుట, (3) ఇకచేయనని తీర్మానించుకొనుట.

II. అయోగ్యత అనగా ఇంకా ఏమిటి? అయోగ్యముగా పుచ్చుకొనకూడదని పౌలు చెప్పెను. (1) పాపపరిహారము, (2) నిబంధన, (3) జ్ఞప్తి – మత్తయి, మార్కు, లూకా, యోహాను చదివితే గింజలు దొరుకును.

(1) ప్రభువు భోజనము పాప పరిహారము కొరకు, (2) ప్రభువు భోజనము నిబంధన కొరకు. దేవునికి ఇశ్రాయేలీయులకు ఒక నిబంధన యున్నది. దీనికి వారు లోబడిరి. గనుక ఇశ్రాయేలీయులు దేవుని జనమైరి. గనుక దేవుని ప్రజలు, నిబంధన లేకపోతే అన్యులు.

**ఏమిటి నిబంధన?** ఇశ్రాయేలీయులారా? నేను మీ దేవుడను అనగా ఇశ్రాయేలీయుల ప్రభువా! నీవే మా దేవుడవు అని అంటే అదే నిబంధన.

**క్రొత్త నిబంధన:-** ప్రభువు + శిష్యులు ఈ భోజనమువల్ల ఒకటే అవుదురు. పాతనిబంధనలో దేవుడు + ప్రజలు నిబంధన వలన ఒకటైపోయిరి. ఉదా:- హరిజనులు భోజనము సిద్ధముచేయగా బ్రాహ్మణులు తినిన భోజనమువల్ల ఒకటే అగుదురు.

III. **జ్ఞప్తి:-** ప్రభువు మరణమును జ్ఞప్తి తెచ్చుకొనుటే యోగ్యత. ఈ మూడింటిని గౌరవించుట యోగ్యత, గౌరవించకపోవుట అయోగ్యత. ఆహా! యేసుప్రభువా! పాపపరిహారం అనుగ్రహించినావుగదా యని ప్రభువా! నాకు రావలసిన మరణము నీవు పొందినావుగదాయని గౌరవము కలిగి రెండవ రాకడ వచ్చు పర్యంతము నిన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుదును. (1) పాపపరిహారము, 2) నిబంధన, 3) మరణము జ్ఞప్తి తెచ్చుకొనవలయును. ఈ మూడు తలంచుకుంటూ ప్రభువు భోజనము పుచ్చుకొనవలెను.

**ఆయన రాకడ:-** ప్రకటన గ్రంథములో 7సం॥రాలు ఉండేది నిత్యమైన విందు. 1) ప్రభువు భోజనము పుచ్చుకున్నందువల్ల పాపపరిహారముయొక్క నిశ్చయత. 2) ప్రభువు భోజనము పుచ్చుకొన్నందువల్ల ప్రభువుతో ఏకమైనామనే నిశ్చయత. 3) ప్రభువు భోజనము పుచ్చుకొనుటవల్ల ఆయన రెండవసారి తప్పక వస్తారనే దాని నిశ్చయత. ఈ నాలుగు ముద్రలు ప్రతి ప్రభు భోజన సమయమందు రెండవ రాకడగూర్చి తలంచాలి.

**రాకడలు:-** 1,2,3 దగ్గరకు రావడము. 2. ఏకాంత ప్రార్థనలోకి రావడము, 3. ప్రభువు భోజనం ఇవ్వడానికి బల్లయొద్దకు రావడము, 4. పత్మసు లంకలోనికి రావడము. యోహానుకొరకు రావడం, 5. అందరికొరకు రాకడలో రావడము. ఈ శరీరము రక్త

బలమువల్ల స్థిరంగా నిలువబడగలము. (2) రేప్చర్ వరకు నడువగలము (1) పాపపరిహారము, (2) నిబంధన, (3) మరణములో రక్తబలమున్నది. (4) రాకడ వరకు మనము రక్తబలమువల్ల ఎదుర్కొనగలము.

**ప్రార్థన:-** దయగల ప్రభువా! మేము బల్లయొద్దకు వచ్చుచున్నాము. గనుక రక్తబలము, శరీరబలము అనుగ్రహించుము. యోగ్యతగా పుచ్చుకొనుటవల్ల మేము నీ బలమును పొందగలము. ఆ విధంగా పుచ్చుకొనుటకు మమ్మును సిద్ధపర్చుమని ప్రభువుద్వారా వేడుకొంటుయున్నాము. ఆమేన్.

# 5వ పాఠము

**దా. కీర్తన 23:5,6; లూకా 14:20; 1కొరింథీ 11:23-34.**

ఆత్మీయ పోషణ ఆత్మీయ భోజన విశ్వాసులారా మీకు ప్రభువు చేసిన విందుయొక్క ఫలితము కలుగునుగాక! నేను చెప్పే మొదటి చివరి మాటలు ఏమంటే మీరు భోజనము దగ్గర మోకరించిన మొదటి నిమిషము నుండి భోజనము అయిపోయిన కడవరి నిమిషమువరకు మిక్కిలి కష్టపడి ఒక పని చేయవలెను. అది యేదనగా **"మనోనిదాన కార్యము"** మీ మనస్సు రొట్టెమీదే ఉండవలెను. మీ మనస్సు ద్రాక్షారసముమీదనే ఉండవలెను. అదే మనోనిదానము.

మీ మనస్సు ప్రభువుయొక్క పరిశుద్ధ శరీరమువైపే ఉండవలెను. మీ మనస్సు ప్రభువుయొక్క అమూల్య రక్తమువైపే ఉండవలెను. అదే మనోనిదానము. అలాగు ఉన్నయెడల అప్పుడు మీరు ప్రభువు భోజనము పుచ్చుకొన్నట్టే. మీరు మీ ఇంటిలో భోజనము చేసేటప్పుడు దిక్కులు చూస్తూ తింటే ఈగలు, దోమలు వాలవచ్చును. గనుక మీ దృష్టి అన్నమువైపే ఉండవలెను. భోజనము ముగించేవరకు ఆవిధముగానే ఉండవలెను. ఆలాగే నీళ్ళు త్రాగేటప్పుడు దిక్కులు చూస్తూ త్రాగిన యెడల నీళ్ళు మీ బట్టలమీద పడును. నీళ్ళవైపే దృష్టి, అన్నమువైపే దృష్టి ఉంచినయెడల అదే మనోనిదానము. అలాగే సంస్కార భోజనము భుజించినప్పుడు ***ఈ నాలుగు మనస్సులో చూడవలెను. అనగా రొట్టె ద్రాక్షారసము రొట్టె వెనుక శరీరము, ద్రాక్షారసము వెనుక రక్తము ఈ నాల్గింటిని చూస్తుండవలెను.*** అయితే మీ పాపములను జ్ఞాపకము రానీయకండి. ఈగలు, దోమలు వాలవచ్చు. దృష్టి అన్నము వైపే

ఉండాలి. మీ మనస్సులోనికి మీ బస, మీ పిల్లలు, మీ ఆస్థి, మీ సొమ్ము, జ్ఞాపకమునకు రానీయకండి. అదే మనోనిదానము మరియు మీరు మనస్సులోనికి ఏ చెడుగైనా సరే యే మంచైనను రానీయకండి చెడుగును రానీయకూడదు. మంచిని రానీయకూడదు. ఈ నాలుగే జ్ఞాపకముండవలయును. అప్పుడు సంస్కార భోజన వలన ప్రయోజనము మీకు కలుగును. రొట్టె మీరు తినుచున్నారని మీకు ఏలాగు నిశ్చయమో అలాగే యేసుక్రీస్తు ప్రభువు యొక్క పరిశుద్ధ శరీరము అందుకొనుచున్నారనే నిశ్చయము మీకు తెలియవలెను.

మనస్సులో రొట్టెయొక్క నిశ్చయము మీకు తెలిసినట్లు దానితోపాటు ఆయన శరీరముకూడ మీకందుచున్నదనే నిశ్చయత మీ మనస్సుకు తోచవలెను. అది మనోనిదానము. అలాగే ద్రాక్షరసము కూడా పుచ్చుకొనేటప్పుడు ఆయన అమూల్య రక్తమును పుచ్చుకొంటున్నానని మీ మనస్సునకు తోచవలెను. దర్శనము కాదు, దేవోక్తికాదు మరేమికాదు. అది మీ మనస్సు పని. దర్శనవరము దేవోక్తివరము గలవారికి తెలియవచ్చును. అది ప్రభువు పని మీ యెడల అయితే మీరనుకొనడము మీకు తోచడము మీకు నమ్మిక పుట్టడము ఇవి మీ పనులు.

ప్రభువు తన పని చేస్తాడు. మీరు మీ పనులు చేయవలెను. 1) మనోనిదానము, 2) అవి మనకు అందుచున్నవని మనస్సుకు తోచడము, 3) ఈ నాలుగు నాలోనికి వెళ్ళుచున్నవని నమ్మడము అదే సంస్కార భోజనము. మన ఇండ్ల దగ్గర చేసే భోజనము, గుడిలో భోజనము సంస్కార భోజనము. సంస్కారమనగా ఇంటి సంబంధము. సంస్కారమనే కీర్తనకూడా ఒక చరణములో ఉన్నది. ఇది పాడుచుండగా ఒక మిషనరీ సంసారమని ఉన్నదేమని అయ్యగారిని అడిగిరి. అందరు

వివాహము చేసికొని సంసారము చేస్తారా అని అడిగిరి. అర్థము అదికాదు లోకమంతా కలసి ఉన్నది సంసారమని చెప్పిరట.

పురుషోత్తముగారు కట్టిన కీర్తనలో ఉన్నది. అనగా ఈలోకమంతా అని లోకజీవితమని అర్థము. అది సంసార భోజనము దానికి లోకభోజనమనియు పేరున్నది. సంస్కార భోజనమనగా యేసుప్రభు ఏర్పరచిన భోజనము. తన శరీర రక్తముల భోజనము. అన్నము కూరల భోజనము కాదు ఇది ప్రత్యేక భోజనము. ఈ వేళ గుడియైన తర్వాత నేనెవరినైనా మీరు ప్రభువు భోజనము తీసుకున్నారా? అని ప్రశ్నిస్తాను, అవును అంటారు. అప్పుడు ఇతర తలంపులు రాలేదా? అంటాను వచ్చాయంటారు. అలాగైతే మీరు రొట్టె, ద్రాక్షారసమేగాని సంస్కారము తీసికోలేదంటాను. ఇంకొకరిని అడుగుతాను. ఇతర తలంపులు వచ్చాయిగాని నేను ఈగలను, దోమలను తోలివేసినట్లు వాటిని తోలివేసానంటారు. అలాగైతే నీవు సంస్కారము పుచ్చుకొన్నావంటాను. ఇంకొక అబ్బాయిని అడుగుతాను రాలేదంటాడు. అలాగైతే నీకు ఇతర తలంపులు రాలేదు గనుక నీవు ప్రభువు భోజనము పుచ్చుకొన్నావంటాను.

నేను వ్యక్తులమీద ప్రశ్నించినది చివరి భాగము. ఈ మూడు జ్ఞాపకముంచుకొని ప్రభు సంస్కారపు విందు పరుగెత్తుకొని రండి ప్రభువే మన విందు అని రెండు (1) మనోనిదానము, 2) ముగ్గురు వ్యక్తులమీద ప్రశ్నలు, 3) ముగ్గురి జవాబులు.

# 6వ పాఠము

**దా.కీర్తనలు 23:5; లూకా 22:14; 1కొరింథీ 11:23**

ఈవేళ సంస్కార భోజనము. అందుచేత ఆ అంశముమీదనే వర్తమానము వినవలెను. అనుదినము మనము భుజించు ఆహారమునకు వేరైనది, ఆకలి తీరనదియు, ఆత్మకు ఆకలి తీరే భోజనము శరీరమునకు కాదు. ఈ దినము నేను రెండు అద్భుతములు జ్ఞాపకము చేస్తాను. అవి ప్రభువు భోజనములో ఇమిడియున్నవి. అవి అందరికి తెలిసేయున్నవి.

**1వ అద్భుతము:-** యేసుప్రభువు తన శిష్యులకు భోజనము ఇచ్చేటప్పుడు జరిగిన అద్భుతము. అప్పటినుండి ఇప్పటివరకు అనగా 2వేల సం॥ల నుండి తన బిడ్డలకు ఇచ్చుచున్న భోజనమైన అద్భుతము మన విషయములో జరిగిందేకాదు. ఆయనచేసిన అద్భుతము మనము పుచ్చుకొన్న తరువాత మారిన అద్భుతం. అయితే ఈవేళ అదికాదు. ఆయన రెండుసార్లు ఇస్తున్న భోజనములో జరిగిన అద్భుతము.

1. శిష్యులకు. 2. నేటికి మనకిస్తున్న భోజన అద్భుతము. ఈ పాఠములో రెండు మాటలున్నవి. (ఎ) నీకొరకియ్యబడుచున్న నా శరీరము, (బి) మీకొరకు చిందింపబడు నారక్తము. మీకొరకియ్య బడుచున్న శరీరమేలాగు శిష్యులలోనికెళ్తుంది? శరీర మెదురుగా కనబడుచున్నది. అదెలాగు జరుగును. ఎదురుగా ఆయన నిలబడినాడు. ఇది నా శరీరమన్నాడు అది అద్భుతము. మీకొరకియ్యబడు రక్తమన్నాడు అది ఇంకొక చిత్రము. చిందింపబడు రక్తము. ఇవ్వబడు శరీరమన్నారు.

సిలువపై నెక్కకముందే చెప్పెను గురువారము భోజనము, శుక్రవారం సిలువ చిందింపబడే రక్తమనకందించిన రక్తమన్నాడు. ఈ మాటలు రెండు పాఠములో దాగిన రెండు మాటలు. మన మనస్సులో ఒకటే ఉంటే గ్రహిస్తాము. చిక్కే విడిపోవును. ఆపై రూపానికి మనిషి అంతరంగమందు ఆయన దేవుడు. మనిషి రూపు అయినా ఆయన దైవత్వము పోలేదు. దైవత్వమునకు ఒకశక్తి ఉన్నది. అదే రాబోయేది. ఇప్పుడు ఇవ్వగల శక్తి శరీరానికి లేదు. ఆయన శరీరము మన శరీరముమీద పాపములేని పిసర ఎక్కువగా ఉన్నది. మన శరీరమే నరస్వభావము పాపమేగాని అది ఆయనకు లేదు. దీనివల్ల ఆయన శరీరము రక్తము ఇవ్వగలడు. అయితే ఇవ్వడము, చిందించడము రెండు కనిపించుచున్నవి. శరీరమెట్లు ఒకదరినుండి ఇస్తున్నారు. ఆయన శరీరజీవము ఆరంభించినది మొదలు ఆయన శరీరమిస్తూనేయున్నాడు. ఆయన శరీరం మనుష్యులకు ఉపయోగార్థమువాయెను. రోగులాయనను ముట్టిరి. మనకాయన శరీరమిచ్చెను. చంటి బిడ్డలనెత్తి దీవించినాడు ఆలాగువాడెను. ఈ ప్రకారము జీవితకాలమంతా పనులలో, జీవించుటలో వాడినాడా లేదా? తలితాకుమీ అని యాయీరు బిడ్డను చేయిపట్టి లేవనెత్తి వాడినాడా లేదా? పేతురు అత్తను జ్వరము నుండి లేవనెత్తలేదా? ఈ విధంగా తన జీవితకాలమంతయు వాడెను. ఆయన పుట్టింది మొదలు మరణము వరకు శరీరాన్నిచ్చెను. సంస్కార సమయములో ఇచ్చినది మర్మముగాను, శిష్యులందుకొనుటయు మర్మముగానే యున్నది. రక్తముకూడా అలాగే మర్మముగా ఉన్నది.

2. చిందింపబడుచున్న రక్తము ఎలాగో అర్థంకాదు. ఆయన పుట్టుక మొదలు నిందలు, నేరములు, పిచ్చి, దయ్యములు పట్టినవాడని త్రాగుబోతని, కలహమునకు ప్రజలను లేపువాడని, చిక్కు ప్రశ్నలు, మొండి వాదములు తరచుట తుదకు మరణము. ఈ శ్రమలే రక్తము చిందించుటయైయున్నది. సాధారణముగా చెమటవూర్చి రక్తము ధారపోసి పనిచేస్తినంటారు. ఆయన శ్రమలు రక్తము చిందించిన దానితో సమానము. హెబ్రీ పత్రికలో ఆయన ప్రతిదినము రోదన చేసెను అని ఉన్నది. రోజు దుఃఖము అదే రక్తము చిందించుట. శుక్రవారము అసలు రక్తము కార్చెను. శుక్రవారము తానే శత్రువులకు అప్పగించుకొనెను. గురువారము తన శిష్యులకు తన శరీరమిచ్చెను. ఆయన అప్పగింపబడినది రాత్రిలోనే అని వ్రాయబడియున్నది. అప్పుడును శరీర రక్తాలు ముందే ఇవ్వగలడు ఇది మొదటి అద్భుతము.

**2వ అద్భుతము:-** యేసుప్రభువు పునరుత్థానము తర్వాత రెండువేల సం॥ల నుండి తన విశ్వాసులకు క్రీస్తునైయున్నాడు. 2వేల సం॥ల నుండి ఉన్నది మహిమ శరీరము, మహిమరక్తము, పాతశరీరము గతించెను. పాతది ఉన్నప్పుడే ఇస్తే ఇప్పుడివ్వలేడా? శరీరము విశ్వాసులకిస్తే తరగాలి. పాపశరీరమైతే తరుగును గాని పాపములేని పాత శరీరము తరుగదు. క్రొత్త శరీరము, క్రొత్త రక్తము అసలే తరుగవు. తరుగనేది ఆయన శరీర రక్తాలకు లేదు గాన తరుగుటనేది అప్పుడు లేదు, ఇప్పుడులేదు. రెండవది నమ్ముట సులువేగాని మన శరీరమున కివ్వగలడు పునరుత్థాన శరీరమింకా రాకపోయిన పాపములేని శరీర మివ్వగలిగెను.

శిష్యులకిదేమో అదెందుకో అదెట్లు వారిలోనికి వస్తున్నదో తెలియలేదు. రొట్టె, ద్రాక్షరసము కనబడెను. ఈ రెండు వారిలోనికి

వెళ్ళినట్టు తెలిసినదిగాని శరీరము రక్తము ఎట్లు వెళ్ళెనో అది వారిలోనికి వెళ్ళినట్లు తెలియకపోయినా నమ్మిరి. ప్రభువు చెప్పింది నమ్ముటేవారి పని వారు అమాయకులు. ప్రశ్నలు వారికిలేవు. అదే గొప్ప విశ్వాసము **విశ్వాసానికి ప్రశ్నలులేవు తృప్తి ఉండును.** కాని అవిశ్వాసానికి అన్నీ ప్రశ్నలే. వారికి దేవుడని బాగా తెలిసిపోయి ఆయన చెప్పిందెల్లా నమ్మినారు. గనుక ఈదిన సంస్కార సమయములో మనము చేయవలసిన గొప్ప పని ప్రభువుయొక్క శరీర రక్తములు విశ్వాసముతో పుచ్చుకొనవలెను. పౌలు చెప్పినట్లు అవిశ్వాసముతోగాని, సరియైన ప్రవర్తనలేక పుచ్చుకొంటే అదే కళంకము. మన హృదయములో కళంకము లేకుండా చేయుట, అదెలాగు? అదెప్పుడు అనే అవిశ్వాసములేకుండా తీసికొంటే అదే కళంకములేని యోగ్యత. అలాగనుకోకుండా తీసికొంటే అయోగ్యత, దానివల్ల మేలుకాదు. కీడువచ్చును. గాన జాగ్రత్తగా తీసికొనుటకు రండి. ఈ మాటలెప్పుడు చెప్పని మాటలు ఇదివరకు రొట్టె ద్రాక్షారసముతో ఏకముగా శరీరము, రక్తము ఇస్తున్నారనేది నిజమే అలాగు నమ్మి మీరు తీసికొను రొట్టెతో శరీరము నాలోకి వెళ్ళిందని నమ్మండి. కనబడేది నమ్ముటగాదు. నిశ్చయముగా కనబడనిది నమ్ముట నిశ్చయము గాన పైచెప్పిన రీతిగా నమ్మి రండి. లోపములు తీసివేసికొనుట మనముచేయు అద్భుతము. ఆయనచేయు అద్భుతము పంచిపెట్టుట గనుక రొట్టె, ద్రాక్షారసము, రక్తము, శరీరము ఈ నాల్గు ఏకకాలములో తీసికొనుచున్నామని నమ్మి రండి.

ఈ కొద్దిమాటలు మీకు సిద్ధపడే మాటలుగా అందునుగాక! ఆమేన్.

# 7వ పాఠము

**1కొరింథీ 1:21. "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిచేయుడి".**

**ప్రార్థన:–** ఓ ప్రభువా! నీవు రొట్టెను, ద్రాక్షారసమును ఇచ్చినట్లు మాకు నీ వర్తమానము దయచేయుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

**జ్ఞాపకము చేసికొనుట:–** 1. గతించిన కాలములో ప్రభువు మనకు చేసిన ఉపకారములు జ్ఞాపకము చేసికొనవలెను. ఇక ముందునకు చేయు ఉపకారములను కూడ జ్ఞాపకము చేసికొనవలెను. జ్ఞాపకము అనునది దేవుడు మనిషి శరీరములో పెట్టిన గొప్ప శక్తి, జ్ఞాపకము అనేది లేకపోయిన మనము అన్ని మరచిపోదుము. తుదకు ప్రభువును కూడ మరచిపోదుము. భూలోకమును, పరలోకమును, అపవాదిని, సమస్తమును మరచిపోయి తోలు బొమ్మవలెనుందుము. బొమ్మకు జ్ఞాపకశక్తి ఉండదు. అట్లే మనముకూడ నుందుము. గనుక జ్ఞాపకశక్తి మిక్కిలి అవసరము. ఒకవేళ జ్ఞాపకశక్తి తగ్గి ఉన్న దానిని బాగుగ ఉపయోగించుకొనవలెను. ప్రసంగ వాక్యములో ఏమి జ్ఞాపకముంచు కొనవలెనని క్రీస్తుప్రభువు చెప్పినారు. సంస్కార సమయమున ప్రభువును మాత్రము ఆయన క్రియలను, మాటలను ఆయన ఇచ్చిన భోజనమును జ్ఞాపకము చేసికొనవలెను. గాని ముఖ్యముగా ప్రభువును మాత్రము జ్ఞాపకము చేసికొనవలెను. మనలను ఎవరైన భోజనమునకు పిలిచిన భోజనము జ్ఞాపకము వచ్చును. గాని పిలిచిన ఆయన జ్ఞాపకము రావలెను. ఆయనకు కృతజ్ఞత మొదట. ఆ తర్వాత భోజనము మొ॥వి తలంచుకొనవలెను.

2. ఏదెనుతోట మొదలు అంత్యదినము వరకు ఒక వరుసగలదు. తోటలో దేవుడు నీ నిమిత్తము నేల శపింపబడెను అని చెప్పెను. అది అంత్యదినమువరకు ఉండును. పాపము, పాపము వలన వచ్చిన ఫలితములు చివరవరకును గలవు దేవుడు చెప్పినమాట సత్యము నేల శపించబడినది. ఈ శాపమునకు ప్రక్క మరియొక వరుస దీవెనలు వరుసకూడ కలదు. మాటవరుసకు దేవుడు శాపము అన్నాడు గాని దానిప్రక్క పొడుగునా దీవెనల వరుసకూడ గలదు. ఈ దీవెనల వరుస ఆ శాపమును దిగ మ్రింగెను. నాగిన్నె నిండిపొర్లుచున్నది. నిండితేచాలు పొర్లు ఎక్కుట ఎందుకు? ఇంకా ఎక్కువ దీవెనలు. శాపమును దిగ మ్రింగు వరకు దీవెనలు గలవు. రెండు వరుసలు జ్ఞాపకముంచుకొనవలెను. శాపము వరుస, దీవెనల వరుస.

**3. పొలములు:–** అక్కడ ధాన్యాదులు, కూరగాయలు, వృక్ష ఫలములు ఇవన్ని శాపముకాదు. దీవెనలే. శపించబడిన నేలలో నుండి వచ్చిన దీవెనలు భూమిలోనుండి ఊట, నీళ్ళు, ధనము, లోహములు వచ్చుచున్నవి. శపింపబడిన భూమిలోనుండియే వచ్చుచున్నవి. కాబట్టి శాపమనగా ఏమిటి? ధాన్యము శాపమా? కూరగాయలు శాపమా? పండ్లు శాపమా? నీరు శాపమా? శాపము అన్నాడేగాని, దీవెన ఇచ్చినాడు. పొలములో ఆహార పదార్థములు జ్ఞాపకముంచుకొనవలెను. ఇంటిలో భోజన పదార్థములు అనుభవించుచున్నప్పుడు ప్రభువు ఇచ్చినాడు. గనుక వందనములని చెప్పవలెను. ఆహారపదార్థములు, భోజనమును బట్టి తండ్రిని జ్ఞాపకముంచుకొనవలెను.

**4.** ఇప్పుడు సంస్కారబల్లమీద యేసుప్రభువు వడ్డించు భోజనము జ్ఞాపకముంచుకొనండి. పైన చెప్పిన భోజనము (ఆహారము మొ॥నవి) మనము వడ్డించుకొనేది. మనము తినేదిగాని తండ్రి ఇచ్చిన పదార్థములే. ఆయన అన్నము, కూర, పండ్లు తెచ్చిపెట్టాడు. మనము తెచ్చుకొని అనుభవించి ఇచ్చిన తండ్రిని జ్ఞాపకముంచుకొందుము, రాత్రి భోజనపు బల్లమీద ప్రభువు మనకు రొట్టెను, ద్రాక్షరసము మన చెట్లపండ్లరసము తీసికొని ఆయన వడ్డించెను. అట్లు వడ్డించుట ఆయనకు సంతోషము. కానాను పెండ్లివిందుకు అందరు వచ్చినారు. ఆయనకూడ వచ్చినారు. వరుసలోనే ఆయనకూడ కూర్చున్నారు. ఆయనకు అన్నములేకనా? లేక విందు తెలియకనా వచ్చినది? మనము తిను ఆహారములో పాల్గొనుటకు ప్రభువు వచ్చి కూర్చుండెను. అది ఆయనకు సంతోషము. ఆయన మన భోజనపంక్తిలో కూర్చుని తినుట మనకు సంతోషము. ఆయనకు సంతోషము మనకు సంతోషము.

**ఉదా:–** ఒకరు విందుకు పిలిచినారు. పిలిచిన ఆయన వారితోనే కూర్చుని భోజనము చేసినారు అందువలన రెండు సంతోషములు విందువలన సంతోషము ఒకటి, వారితో కూర్చుని భోజనము చేసినందున మరియొక సంతోషము. క్రీస్తు ప్రభువు మనకు రొట్టె, మనకు ద్రాక్షారసము వడ్డించినారు. ఆయన 5వేల మందికి వడ్డించలేదు. శిష్యులు వడ్డించినారు. సంస్కారములో వస్తువులు మనవి. వడ్డన ప్రభువుది గనుక ప్రభువు వడ్డించుచున్నాడనే సంతోషము మనకుండును. ఇంటిలోని అన్నము, పొలములోని పంటను చూచి తండ్రి జ్ఞాపకము వచ్చును. రాత్రి భోజనములో వడ్డించు యేసుప్రభువును జ్ఞాపకముంచుకొనవలెను. కొందరు విద్యార్థులు ప్రార్థన చేయుదురు. ఏమని? ప్రభువా!

శరీరమునకు ఆహారమిచ్చినట్లు ఆత్మకుకూడ ఆహారమిమ్ము అని. వారి తలంపులో ప్రభువు భోజనము లేకపోయినా దానికి సంబంధించిన తలంపు కలదు. (1) పొలములోని ఆహారపదార్థములు, 2) ఇంటిలోని భోజనము, (3) క్రీస్తుప్రభువు ఇచ్చు రొట్టె ద్రాక్షారసము. ఈ రొట్టె ద్రాక్షారసము తీసికొనునప్పుడు ప్రభువు శరీరమును, రక్తమును జ్ఞాపకము చేయును. ఈ భోజనము అనగా ప్రభువు యొక్క శరీర భోజనము, మన ఇంటిలోని భోజనమును మించినది. ఒక భోజనము మరియొక భోజనమును జ్ఞాపకముచేయును. ఒక భోజనమును మించిన భోజనము మరియొకటి. ఒకదానికంటె ఒకటి ఎక్కువ. పంటకన్న భోజనము ఎక్కువ. ఆ భోజనముకన్న రొట్టె, ద్రాక్షారసము ఎక్కువ. వీటికన్న ప్రభువుయొక్క శరీరము రక్తము ఎక్కువ. శాపము ఏది? నేల శపింపబడ్డది, శపింపబడిన నేలమీద రక్షకుడు నిలువబడి శాపమునకు లోబడి 11మంది శిష్యులకు భోజనము శపింపబడిన నేలమీద వడ్డించెను. శాపము ఏది? మంచి మనస్సుతో పుచ్చుకొనిన శాపములేదు. ప్రసవవేదన, శాపము, బిడ్డ పుట్టగానే చెంతనే దీవెన. పొలములో చెమట, కష్టము, శాపము. దానిచెంతనే పంట, దీవెనకాదా! శాపము ఏది? దీవెనలే నిండి పొర్లుచున్నవి. అయితే ఎన్నిమార్లు సంస్కారములో ప్రభువుయొక్క శరీర రక్తములు తీసికొన్నను వ్యాధులు, కష్టములు, చిక్కులు ఉంటూనే యుండును. అయినను సంతోషము, కృతజ్ఞతకూడ ఉండును. అయితే ఇంకొక కాలము రావలెను. పాపములో పడని కాలము, శాపము పేరుకైనను లేనికాలము, మరణములేని కాలము రావలెను అప్పుడు ఒక విందు ఉండును. అప్పుడు ఆ శాపము పోయి, దీవెన ఉండవలెను. అది పరలోకములో జరుగును. క్రీస్తుప్రభువు అక్కడివిందు. ఆయన లక్షణములు, గుణములు. ఆయన కళ విందుగా

ఆచరింతుము. ఆయన జీవము విందు, అదే రక్తము. శాశ్వతకాలము అక్కడివిందు. (ఆయన లక్షణములు గుణములు. ఆయన కళ విందుగా ఆచరింతుము. ఆయన జీవము విందు. అదే రక్తము. శాశ్వతకాలము) పుచ్చుకొందుము. ఇక్కడ పుచ్చుకొనుటకంటె పరలోకములో పుచ్చుకొనుట ఇంకా ఎక్కువ. ఇక్కడ తీసికొనుటలో ప్రభువుయొక్క శరీర రక్తములు తక్కువకాదు. మనము పుచ్చుకొనుట, అంగీకరించుట తక్కువ. అక్కడ తీసికొనకపోవుట, అంగీకరించకపోవుట ఉండదు. గనుక పరలోకములో ఎక్కువ. అనేకులు క్రీస్తుయొక్క శరీర రక్తములు తీసికొనుచుండగా బలహీనత ఎందుకు ఉండవలెననుచున్నారు. ఆయనలో లోపములేదు. మనము అంగీకరించుటలో, మనము నమ్ముటలో, మనము జ్ఞాపకము చేసికొనుటలో లోపమున్నది. గనుక బలహీనతకూడ ఈలోకములో గలదు. ఆ లోకములో ఏ బలహీనత ఉండదు. మనము అంగీకరించుట, తీసికొనుట, అనుభవించుట, శాశ్వతకాలముండును.

పొలములోని ఆహారపదార్థములకన్న ఇంటిలోని ఆహారము ఎక్కువ, ఇంటిలోని ఆహారముకన్న సంస్కార భోజనము అనగా ప్రభువు శరీరరక్తముల భోజనము ఎక్కువ. ఈ లోకములో ఈ విందుకన్న పరలోకపు విందు ఇంకా ఎక్కువ. గనుక సంస్కార భోజనము అజాగ్రత్తగా, నిర్లక్ష్యముగా కాక సిద్ధపడి సంతోషముతో పుచ్చుకొనవలెను. విందుకు పోవువారు స్నానముచేసి, వస్త్రము ధరించి సంతోషముతో భుజింతురు. ఇప్పుడుకూడ దోషములేకుండా, శుభ్రముగానుండి నీతి వస్త్రము ధరించి, సంతోషముతో పుచ్చుకొనండి.

# 8వ పాఠము

| ప్రభువుయొక్క శరీరము | ప్రభువుయొక్క రక్తము |
| --- | --- |
| I | I |
| రొట్టె | ద్రాక్షారసము |
| I | I |
| మన శరీరము | మన ఆత్మ |
| I | I |
| మన శరీర జీవనము | మన ఆత్మీయ జీవనము |

ప్రభువు రాత్రి భోజనము విశ్వాసులకే ప్రభువు ఏర్పరచినారు. విశ్వాసులు పైవి చూడవలెను. క్రీస్తు ప్రభువు రెండు మాటలు చెప్పెను. 1) రొట్టెనిచ్చుచూ ఇది నా శరీరము అనెను, 2) ద్రాక్షారసము ఇచ్చుచూ ఇది నా రక్తము అని చెప్పెను. రొట్టె పట్టుకొని ఇది రొట్టె అనలేదు, ద్రాక్షారసము పట్టుకొని ఇది ద్రాక్షారసము అనలేదు అది రొట్టె, ద్రాక్షారసమని వారికి తెలియును. గనుక అట్లు చెప్పక ఇది నా శరీరము నా రక్తము అని చెప్పెను. వారు వెంటనే ఇది రొట్టెకదా ఎందుకు శరీరము అనుచున్నావు? ఇది ద్రాక్షారసముకదా ఎందుకు రక్తమనుచున్నావు అని అడుగవలసినది. అట్లు అడుగుటకు ప్రభువు వారికి అవకాశము ఇవ్వలేదు. వారు నమ్మి మాట్లాడకపోవుచున్నారు. ప్రభువు చెప్పినది వినుట నమ్ముటయే వారుచేసిరి. వారికి ప్రభువునందు ఎక్కువ గౌరవము, విశ్వాసము గనుక వారట్లు అడుగలేదు. ఇప్పుడు మనకు రొట్టె అని తెలుసు గనుక నమ్మనక్కరలేదు. గాని శరీరమని తెలియదు గనుక అది నమ్మవలెను. అలాగే ద్రాక్షారసమని తెలుసు

గనుక నమ్మనవసరము లేదు. గాని ఇది రక్తమని తెలియదు గనుక అది నమ్మవలెను. ఈ రెండు సబబుగా లేవుగాని ప్రభువు చెప్పినాడు. గనుక నమ్మవలెను. **ఉదా:-** గ్లాసులో నీరుపోసి అడిగినవారికి ఇస్తాము. ఆయన పుచ్చుకొన్నాడు ఆయన గ్లాసు తీసికొన్నాడా, మంచి నీరు తీసికొన్నాడా? ఇచ్చిన ఆయన గ్లాసు నిచ్చినాడా, నీళ్ళు ఇచ్చినాడా? అడిగిన ఆయన నీళ్ళు అడిగినాడు గాని గ్లాసు అడగలేదు. గాని రెండు ఇవ్వడము నిజమే. అలాగే రొట్టె ఇచ్చుట నిజమే. దాని మూలముగా శరీరము ఇచ్చుట కూడ నిజమే. ద్రాక్షరసము ఇచ్చుట నిజమే. దాని మూలముగా ప్రభువు రక్తమిచ్చుటకూడ నిజమే. గ్లాసు, మంచినీళ్ళు రెండు ఆయన తీసికొనెనుగదా! అలాగే ప్రభువు రొట్టె, ద్రాక్షరసములతో, తన శరీర రక్తములనుకూడ ఇచ్చెను. ఇప్పుడు కూడ ఇచ్చుచున్నాడు. విశ్వాసులు మాత్రము తీసికొందురు. వారు తీసికొనునప్పుడు విశ్వాసమునుబట్టి ఆయన శరీర రక్తములను అందుకొనుచున్నారు. రొట్టె, ద్రాక్షరసము అందుకొనుట ఎంత నిశ్చయమో ప్రభువుయొక్క శరీర రక్తములు అందుకొనుట కూడ అంత నిశ్చయము. పాదిరిగారు వాటిని బల్లమీద పెట్టి ప్రతిష్ఠించిన తర్వాత అవి వట్టి రొట్టె, వట్టి ద్రాక్షరసముకాదు. అప్పుడు పుచ్చుకొనువారు వట్టి ద్రాక్షరసము వట్టి రొట్టె తీసికొనక వాటితోబాటు శరీర రక్తములు అందుకొందురు. ప్రతిష్ఠ లేక ముందు పిల్లలు ఆ రొట్టె తినిన ఆ ద్రాక్షరసము త్రాగిన అది వట్టి రొట్టె. అది వట్టి ద్రాక్షరసము మాత్రమే. ఆరాధన అయిపోయిన తర్వాత మిగిలిన రొట్టె మిగిలిన ద్రాక్షరసము పిల్లలు త్రాగిన అది వట్టి రొట్టె వట్టి ద్రాక్షరసమే గాని సంస్కారమున తీసికొన్నప్పుడు వాటితోబాటు విశ్వాసి ప్రభువు శరీర రక్తములను అందుకొనును.

అవిశ్వాసి వచ్చి అందరు తీసికొనుచున్నారు. నేను తీసికొందును నామకార్థముగా ఆచారమునుబట్టి ఆ రెండు తీసికొనును. అప్పుడు క్రీస్తు ప్రభువుయొక్క శరీరము రక్తము అతనికి అందునా? రొట్టె ద్రాక్షారసము అందునుగాని, ప్రభువు శరీర రక్తములు అందవు 1కొరింథీ 11:29లో శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు అని గలదు. విశ్వాసి ఉపయోగము కొరకును, మేలుకొరకును తీసికొనుచున్నాడు. అవిశ్వాసి శిక్షకొరకు తీసికొనుచున్నాడు. విశ్వాసి అవి వట్టి రొట్టె, వట్టి ద్రాక్షారసము కాదు. అవి బజారులోనుండును. అయితే ఈ బల్లమీదనున్నవి క్రీస్తు శరీరము, రక్తము అని విశ్వసించి తీసికొనును. అవిశ్వాసికి ఇవన్నియు ఉండవు. ఆచార ప్రకారముచేసి క్రీస్తు శరీర రక్తముల వలన కీడు కలిగించుకొని అపరాధి ఆయెను. గనుక శిక్షార్హుడైనాడు. రొట్టె తీసికొనునప్పుడు ప్రభువు శరీరమే. ద్రాక్షారసము తీసికొనునప్పుడు ప్రభువు రక్తమే అని అనుకొనుచు బల్లయొద్దకు రండి. అది మాకేలాగు తెలియును అని అడుగవచ్చును. అది క్రీస్తు ప్రభువే చెప్పెను. ఆయన చెప్పినదే నిజము. మనకు తెలియనక్కరలేదు. ప్రభువు చెప్పినది అర్థమైన కాకపోయిన నమ్ముటయే విశ్వాసియొక్క పని.

యేసుప్రభువుయొక్క శరీర రక్తములు తీసికొనిన తర్వాత మన శరీర జీవితము, ఆత్మీయ జీవితము మేలు పొందవలెను. సువార్తలలో పాపక్షమాపణ నిమిత్తము చిందింపబడుచున్న రక్తము అని మత్తయి 26:28లో గలదు. మన శరీరము మట్టియగును. ఆత్మ జీవించి యుండును గనుక పాపము అంటుకొని యుండును. గనుక రక్తమువలన పాపపరిహారము కలుగును. అయితే క్రీస్తు శరీరము తీసికొనుటవల్ల ఉపయోగమేమి? మనిషియొక్క శరీరము ఆత్మ కలిసి

ఉన్నది రక్తము ఆత్మ జీవనములోని పాపపరిహారము కొరకు ఆయన శరీరము మన శరీర జీవనము యొక్క వృద్ధికొరకు ఆయన రక్తము మన ఆత్మజీవనవృద్ధి, శుద్ధికొరకు, ఆయన శరీరము మన శరీర జీవన వృద్ధికొరకు, శరీరమునకు వ్యాధి ఉన్నది గనుక వ్యాధి పరిహారము అవసరము. 1పేతురు 2:24లో ఆయనపొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి అని గలదు. గనుక క్రీస్తు శరీరము తీసికొనుట మన శరీర స్వస్థత కొరకు. **ఉదా:-** ఒకరు సంస్కారము తీసికొని నా జబ్బు పోయెనని సాక్ష్యము చెప్పెను. గనుక సంస్కార భోజనము మన శరీర ఆత్మలకు ఉపయోగము. శరీరమునకు రోగపరిహారము. ఆత్మకు పాప పరిహారము కలుగును. అవిశ్వాసికి జబ్బు, పాపము ఎక్కువగును. ఈ రెండిటితో చనిపోయి నాశనమునకు వెళ్ళును. లూథరన్ ఆరాధన పుస్తకములో విశ్వాసమునందు బలపరచి అని వ్రాయబడి యున్నది. సంస్కార సమయమున పాపపరిహారము తర్వాత శరీరాత్మలకు బలము కలుగును. 1) క్రీస్తు శరీరము, 2) క్రీస్తు రక్తము, 3) రొట్టె, 4) ద్రాక్షారసము, 5) మన శరీరము, 6) మన ఆత్మ. ఈ ఆరును ముఖ్యమే. **క్రీస్తుప్రభువు చేసిన ఏర్పాటును తృణీకరింపక, ఆచారమునుబట్టి పుచ్చుకొని విశ్వాసమునుబట్టి మేలు పొందవలెను.** అపరాధులగుటకును, శిక్ష పొందుటకును పుచ్చుకొనరాదు. యెషయా 53:4లో ఆయన మన పాపములను, రోగములను భరించెనని గలదు. పాప పరిహారము, రోగ పరిహారము రెండును గలవు. క్రీస్తు సిలువమీద చిందించిన రక్తము మన ఆత్మ జీవనముయొక్క మేలుకొరకు సిలువమీద శరీరము అర్పించుట మన శరీరమునకు స్వస్థత నిచ్చుటకు ప్రభువు 33 1/2 సం॥లలో శరీర రక్షణకు, ఆత్మ రక్షణకు కావలసిన కార్యములన్ని

చేసెను. కొందరు శరీరము అనవసరము అనుచున్నారు, శరీరముకూడ అవసరమే.

ఎంతకాలము సంఘము ఈ సంస్కారము ఆచరింపవలెను? ప్రభువు వచ్చువరకు. తర్వాత ఉండదు గనుక సంస్కారము ఉండదు. సంఘము పరలోకములో విందులోనుండును. వెయ్యేండ్లలో సంస్కార భోజనపు ఏర్పాటు ఉండదుగాని ప్రభువు రక్తమువలన వారికి శుద్ధి కలుగును వాక్యములో ప్రభువు వచ్చు పర్యంతము అని గలదు. గనుక పైన 6ను ప్రభువుయొక్క రాకడనుకూడ జ్ఞాపకము చేసికొనవలెను. మరియు ప్రభువుయొక్క మరణమును, రోగ నివారణను పాపక్షమాపణనుకూడ జ్ఞాపకముంచుకొనవలెను. ఈ కొన్ని మాటలు మిమ్మును సంస్కారమునకు సిద్ధపరచునుగాక! విశ్వాసులకు బలమును, ఆదరణమును కలిగించునుగాక!

# 9వ పాఠము

1) ప్రభువు బల్లయొద్దకు రాకముందు దేవుని యెదుట ప్రార్థన గదిలో తప్పిదములన్నియు ఒప్పుకొనవలెను. క్షమించుమని వేడుకొనవలెను. ఇకమీదట జాగ్రత్తగా నుందునని చెప్పవలెను. 2) తత్పూర్వము ఇతరులకు విరోధముగా చేసిన తప్పిదములు వారియొద్ద ఒప్పుకొనవలయును. 3) లూథరు చిన్న ప్రశ్నోత్తరి వివరముగల స్టాంపు ప్రశ్నోత్తరి బాగుగా చదువుకొనవలెను. 4) ప్రభువు భోజనమును జ్ఞప్తి తెచ్చు బైబిలులో నున్న వాక్యములు ధ్యానింపవలెను. అవేవనగా మత్తయి 26:17-29; మార్కు 14:22-25; లూకా 22:14-20; 1కొరింథీ 11:23-29; మత్తయి 5:6;,23,24; లూకా 14:15-24; యోహాను 6:53-57; ప్రకటన 19:9; ఆది 14:18; నిర్గమ 12:21-28; 2సమూ. 9అధ్యా॥; 1రాజు 5:6; కీర్తన 23, 5) ప్రసంగము జాగ్రత్తగా వినవలెను. ఇట్లు సిద్ధపడవలెను. 6) బల్లయొద్దకు వెళ్ళుచున్నపుడు ప్రభువు మీ ఆత్మకు భోజనము పెట్టుటకు ఎదుట నిలువబడియున్నాడని తలంచుకొనవలెను. 7) బోధకుడు రొట్టె, ద్రాక్షారసము ఇచ్చునపుడు ప్రభువు తన శరీర రక్తములు అనుగ్రహించుచున్నాడని దృఢముగా నమ్మవలెను. 8) రొట్టె తీసికొనునపుడు ఆయన శరీరమునుకూడ రొట్టెతోపాటు తీసికొనుచున్నామని విశ్వసింపవలెను. ద్రాక్షారసము తీసికొనునప్పుడు ఆయన రక్తమునుకూడ తీసికొనుచున్నామని విశ్వసింపవలెను. ఆ రెండు తీసికొనుట ఎంత నిశ్చయమో ఈ రెండును తీసికొనుట అంత నిశ్చయమైయుండవలెను. నోటితో ప్రభువుయొక్క శరీర రక్తములు అందుకొనుట ఎంత ధన్యత అని ఆనందింపవలెను. 9) ఒకవేళ రొట్టె పొడుము రాలినయెడల ప్రభువు శరీరము అందకుండ

రాలిపోయెనని తలంపవద్దు. ద్రాక్షరసము ఒక చుక్క ఒలికినయెడల ప్రభువు రక్తము ఒలికినదని అనుకోవద్దు. 10) బల్లయొద్దయున్నంతసేపు ప్రభువు భోజనమును మాత్రమేకాక ఆయన మరణమునుకూడ జ్ఞాపకము తెచ్చుకొనవలెను. మరియు పరలోకములో అనుభవింపబోవు విందునుకూడ తలంచుకొనవలెను. 11) ప్రభువు భోజనమునకు బోధకుని అయోగ్యత అంటుకొనద్దు. 12) ప్రభువు భోజన మర్మము గ్రహింపలేకపోయినప్పటికిని ప్రభువు ఏర్పాటు గనుక నిశ్చయముగా ఉపకారము కలుగనని నిరీక్షింపవలెను. 13) భోజనమైన తర్వాత నెమ్మదిగా మీ స్థలమునకు వెళ్ళి ప్రార్థన కాదుగాని స్తుతిచేయండి. 14) ప్రభు భోజనము పుచ్చుకొన్న తర్వాత మీ జబ్బుపోయినది అనికొందరు చెప్పుచున్నారు ఇది నమ్మవచ్చును. పాపములే పోగొట్టగల ఆయన జీవము, రుగ్మతను పోగొట్టలేడా?

2. 1) ఉదరశుద్ధి లేనిదే ఆహారము తినరుగదా! అట్లే పాప శుద్ధి లేనిదే ప్రభు భోజనము పుచ్చుకొనరాదు అట్లు పుచ్చుకొన్నయెడల హాని కలుగును. "వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" అని పౌలు 1కొరింథీ 11:29లో చెప్పుచున్నాడు. 2) ప్రభువు రొట్టెముక్కను ఇస్కరియోతు యూదా నోటికి అందించెను. "పుచ్చుకొనగానే సాతాను వానిలో ప్రవేశించెను ప్రభువు భోజనము అయోగ్యతగా పుచ్చుకొనువారికి ఇట్టి గతి సంభవించును" గనుక జాగ్రత్తపడండి.

తినుటకు త్రాగుటకు ఏమియు దొరకని అరణ్యములో దేవుడు తన ప్రజలకు భోజనపు బల్లవేసెను. యోహాను 6:31లో ఆరులక్షలకన్న ఎక్కువగానున్న వారికి నలుబది సంవత్సరములు పోషణ జరిపెను. ఇదెంత ఆశ్చర్యము! మరియొక అరణ్యములో అయిదు వేలమంది

కంటె ఎక్కువమందికి ప్రభువు భోజనపు బల్లవేసెను. ఆయన వారికి అద్భుతమైనరీతిగా కావించిన ఆహారము వారికి తృప్తిపరచెను. ఇదెంత ఆశ్చర్యము! కరువు కాలములో ఏలియా అనుభక్తుని అరణ్యమునకు చేర్చి కాకులచేత ఆహారము పంపెను. ఇదెంత ఆశ్చర్యము! ప్రభువు విశ్వాసులకు రెండువేల సంవత్సరములనుండి తన శరీర రక్తములను ఆహారముగా ఇచ్చుచున్నాడు. ఇది అన్నిటికంటె ఎంత ఆశ్చర్యము!

క్రీస్తుప్రభువుయొక్క శరీర రక్తములు విశ్వాసులకు అన్నపానములై యున్నవి అనుట అవిశ్వాసులకు కర్ణకఠోరముగా నుండును. మనము భుజించునవి మన శరీర రక్తకములవంటివికాదు. అవి మహిమ వస్తువులు గనుక శ్రవణీయము. ఒకని ఇంటవిందన్ననూ, ఒక ఊరిలో సంతర్పణన్ననూ పరుగు. ప్రభు భోజనమన్ననో! భోజన సంస్కారాలోచన రాగా కరకరమని ఆకలివేయుచున్నదా? ఆకలిలేని యెడల ఆత్మలో ఏదో ఒక జబ్బు అనిగ్రహించుకొనవలెను. ఆకలి లేనిదే ఎవరన్నము తిందురు? ఈ పత్రిక చదువుకొని మీరెట్లు సరందమౌదురో!

# 10వ పాఠము

ఈ సంస్కార భోజనము మనము అనుదినము భుజించు ఆహారము వంటిదికాదు. ఇది ఆత్మీయ ఆకలితీరే భోజనము. ఈ దినము అందున్న రెండు అద్భుతములు జ్ఞాపకము చేయుదును. యేసుప్రభువు తన శిష్యులకు ఈ సంస్కార మిచ్చునప్పుడు జరిగిన అద్భుతము. అప్పటినుండి ఇప్పటివరకు అనగా 2వేల సం॥ల నుండి తన బిడ్డలకు ఇచ్చుచున్న భోజనమైన అద్భుతము. ఆయన చేసిన అద్భుతము మనము ఇది పుచ్చుకొన్న తర్వాత మారిన అద్భుతములుకాదు. ప్రభువు రెండుమార్లు ఇచ్చుచున్న భోజనములో జరిగిన అద్భుతము (1) శిష్యులకిచ్చుచున్న భోజనము (2) మనకిచ్చుచున్న భోజనము. ఈ భోజన పాఠములో రెండు మాటలున్నవి. మీకొరకియ్యబడుచున్న నా శరీరము, మీకొరకు చిందింపబడు నా రక్తము అనునవి. మీ కొరకియ్యబడు శరీరము ఏలాగు శిష్యులలోనికి వెళ్ళును. ఆయన శరీరము ఎదురుగా నున్నది. వారి ఎదుటనే ఆయన నిలువబడి యున్నాడు. ఏలాగు ఆయన శరీరము వారిలోనికి వెళ్ళును? ఇది అద్భుతము. తరువాత మీ కొరకియ్యబడుచున్న నారక్తము అనెను. ఇది మరియొక చిత్రము. సిలువ ఎక్కకముందు ఈ మాటలు చెప్పెను. సిలువకు ముందే ఈ సంస్కారము. చిందింపబడే రక్తము అనగా చిందించిన రక్తము అనెను. ఇవి గ్రహించవలెననిన రెండు సంగతులు జ్ఞాపకముంచుకొనిన గ్రహించగలము. చిక్కు ఉండదు ఆయన పైరూపమునకు మనిషి, అంతరంగమందు దేవుడు. ఆయన మనిషి రూపి అయినా దైవత్వము

పోలేదు. ఆ దైవశక్తినిబట్టి రాబోవు కాలములో ఇవ్వగలిగిన, ఇప్పుడే ఇవ్వగలడు. మన శరీరములో పాపమున్నది. (1) ఆయన శరీరములో పాపములేదు గనుక ఆయన శరీర రక్తములు ముందుగానే ఇవ్వగలడు. బ్రతికియుండగానే ఆయన శరీరమెట్లు ఇవ్వగలుగుచున్నాడు. ఆయన భూమిమీద జీవించుట మొదలు పెట్టినప్పటినుండి ఆయన శరీర మిచ్చుచునే ఉన్నాడు. ఆయన శరీరము మనుష్యుల ఉపయోగము నిమిత్తము వాడెను. రోగులు ఆయన శరీరము ముట్టుకొనిరి. మత్తయి 8:3; మార్కు 7:32-35; మార్కు 8:22-25. చంటిపిల్లల నెత్తుకొని దీవించుటద్వారా మార్కు 10:13-16లో శరీరమువాడెను. "తలితాకుమీ" అని యాయీరు కుమార్తెను చెయ్యి పట్టుకొని లేవదీయుటద్వారా వాడెను. మత్తయి 9:24,25లో పేతురత్తను ముట్టుటద్వారా మత్తయి 8:14. శరీరమువాడెను. ఈ విధముగా తన జీవితకాలమంతయు శరీరమును వాడెను. ఆయన పుట్టినది మొదలు మరణమువరకు తన శరీరమునిచ్చెను. అయితే సంస్కార సమయమున ఇచ్చినది మర్మముగా నిచ్చెను, శిష్యులు అందుకొనుటకూడ మర్మముగానేయున్నది. (2) చిందింపబడుచున్న రక్తము ఇచ్చుట ఏలాగు? ఆయన పుట్టినది మొదలు పిచ్చివాడని, దయ్యముపట్టినవాడని, త్రాగుబోతుఅని, కలహమునకు ప్రజలను రేపుచున్నాడని అనిరి. ఆయనకు చిక్కుప్రశ్నలు, మొండి వాదములు గలవు. తుదకు మరణము. ఈ శ్రమలే రక్తము చిందించుటయైయున్నది. సాధారణముగా చెమట ఓడ్చి రక్తము ధారపోసి పనిచేసితిని అందురు. అలాగే ఆయన శ్రమలు రక్తము చిందించినదానితో సమానము. హెబ్రీ పత్రికలో ఆయన ప్రతి దినము రోదనచేసెననిగలదు. అదే రక్తము చిందించుట. శుక్రవారము

ఆసలు రక్తము చిందిచుట, అయితే గురువారము ఆయన శరీర రక్తములు ఇవ్వగలడు. ఇది మొదటి అద్భుతము (3) పునరుత్థానము తరువాత రెండువేల సంవత్సరాలనుండి తన విశ్వాసులకు ఆయన తన శరీర రక్తములను ఇచ్చుచూనేయున్నాడు. పాతశరీరము పాత రక్తము గతించెను. మహిమ శరీరము, మహిమరక్తము ఇచ్చుచుండెను. శరీరము విశ్వాసులకిచ్చుచుండగా తరుగవలెను. పాపశరీరమైన తరుగును, పాపములేని పాతశరీరము తరగదు. క్రొత్త శరీరము క్రొత్త రక్తము అసలేతరగదు. తరుగుట అనునది ఆయన శరీర రక్తములకు ఇప్పుడుగాని, అప్పుడుగాని, ఎన్నడునులేదు. ఆయనకు పునరుత్థాన శరీరము రాకముందే పాపములేని శరీరము వారికివ్వగలిగెను.

శిష్యులకు అది ఎట్లు వారిలోనికి వచ్చినది తెలియదు? రొట్టె ద్రాక్షరసము మాత్రము వారికి కనబడినది. అది వారిలోనికి వెళ్లినట్లు తెలిసినదిగాని, శరీర రక్తము వారిలోనికి ఎట్లు వెళ్ళినది తెలియకపోయినను నమ్మిరి. ప్రభువు చెప్పినది నమ్ముట వారిపని. వారు అమాయకులు, ప్రశ్నలు వారికిలేవు. అదే గొప్ప విశ్వాసము. విశ్వాసమునకు ప్రశ్నలు ఉండవు తృప్తిమాత్రమే ఉండును. ఆయన దేవుడని వారికి బాగుగా తెలిసినది గనుక ఆయన చెప్పినది వారు నమ్మిరి. గనుక మనము ఈ సంస్కారము విశ్వాసముతో పుచ్చుకొనవలెను. పౌలు చెప్పినట్లు అవిశ్వాసముతో గాని సరియైన ప్రవర్తనగాని లేకుండ తీసికొనరాదు. అది ఏలాగు జరుగును? అ విశ్వాసములేకుండ తీసికొనిన అదే కళంకములేని యోగ్యత. అవిశ్వాసముతో తీసికొన్న అదే అయోగ్యత. దానివలన కీడు వచ్చునుగాని మేలురాదు. రొట్టె ద్రాక్షారసముతో ఏకముగా శరీర రక్తములు

ఇచ్చుచున్నారనునది నిజము. అది నమ్మి రొట్టె తీసికొనునప్పుడు ఆయన శరీరము నాలోనికి వెళ్ళినదని నమ్మండి. 1) ద్రాక్షారసము తీసికొనినప్పుడు ఆయన రక్తము నాలోనికి వెళ్ళినదని నమ్మండి. కనబడునది నమ్ముట విశ్వాసముకాదు. కనబడబడనిది నమ్ముట విశ్వాసము, అదే నిశ్చయము. లోపములు తీసివేసికొనుట మనముచేయు అద్భుతము, ఆయనచేయు అద్భుతము పంచిపెట్టుట, గనుక రొట్టె ద్రాక్షారసము, శరీరము రక్తము ఈ నాలుగు కోరకు బల్లదగ్గరకు రండి ఈ మాటలలోని వర్తమానము మీకు అందునుగాక! ఆమేన్.

# 11వ పాఠము

**మత్తయి 26:26-29; మార్కు 14:22-25; లూకా 22:14-20; 1కొరింథీ 11:23-28.**

ఈ సంస్కారము ఏర్పాటుచేసిన ఆయన ఎవరు? సంస్కారము తీసికొన్నవారెవరు? 1) ఆయన పాతనిబంధనలోని భక్తులందరు కనిపెట్టిన మెస్సియా జీవించిన కాలములో నున్నవారు. ఆ 11మంది మెస్సియాయొక్క శిష్యులు. ప్రభువునకు వారికి మధ్య ప్రదాని భోజనమున్నది. మా పూర్వీకులు చూడవలసిన మెస్సియాను ఇన్నాళ్ళకుచూచినామని వారి సంతోషము. మొదట ఆయనను కలసికొన్నప్పుడు మేము మెస్సియాను చూచినామని ఒకరితో నొకరు చెప్పుకొనిరి. సంస్కార భోజనములో మేము మెస్సియాను కనుగొన్నాము అని చెప్పినవారు. 2) ఆయనెవరు? ఆయన బోధకుడు. నా శరీరము నారక్తము అనుభవించినవాడే శాశ్వతజీవి అని బోధించిన గొప్ప బోధకుడు (యోహాను 6:54) శరీర రక్తములు అన్నపానములుగా ఇచ్చిన బోధకుడు. ఆ శరీర రక్తములను గురించి పూర్తిగా బోధించిన బోధకుడు. వీరు ఆ సంగతి నేర్చుకొన్న విద్యార్థులు, వారే శిష్యులు. 3) లోక పాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల యోహాను 1:29 అని ఎవనిగూర్చి చెప్పబడెనో ఆయనే ఈ మెస్సియా. ఎవరి పాపములు ఆయన మోసికొని వెళ్ళెనో ఆ పాపాత్ములందరు పవిత్రులే. ఆయన దేవుని గొర్రెపిల్ల వీరు సంస్కార సమయములో పరిశుద్ధులు. 4) ఆయన ఎవరు? నేను గొర్రెలకు మంచి కాపరిని అని చెప్పిన కాపరి. పైన ఆయన దేవుని గొర్రెపిల్ల. ఇక్కడ ఆయన కాపరి, వీరు ఆయన మేపే, నడిపించే గొర్రెలు, గాఢాంధకార లోయలో ఆయన వలన సురక్షితముగా నడిపింపబడ వలసిన గొర్రెలు కీర్తన 23:4లో ఆయన కాపరియై

యుండగా, వారు గొర్రెలైయుండగా వారికేమి కొదువ! "నాకేమి కొదువ నాధుడుండ" 5) ఆయన విందులో వడ్డించే ప్రధాని. కానానులోని వివాహములో ఒక పెండ్లి ప్రధాని ఉన్నాడు. ఆయనకు ద్రాక్షారసము అందినది. ప్రభు భోజన సంస్కార విందులో ప్రభువు వడ్డించే వడ్డనకర్త. ఆయన వడ్డించేవాడైన వీరెవరు? వీరు భుజించువారు. ఈ విందునకు ముందు 5వేల మందికి ఆయన వడ్డించక వారిచేతికిచ్చి వడ్డింపచేసెను. 12మంది అక్కడ వడ్డనకర్తలుగా నున్నారు. ఈ విందులో మీరు కూర్చొనండి. నేను వడ్డించెదనని చెప్పెను. శిష్యులకెంత సంతోషము. ఆయన మెస్సియా, వారు మెస్సియాను కనుగొన్నవారు. ఆయన బోధకుడు. వీరు నేర్చుకొన్నవారు. ఆయన పాపపరిహారకుడు. వీరు పరిశుద్ధులైన వారు. ఆయన కాపరి. వీరు కొదువలేని గొర్రెలు. ఆయన విందులో వడ్డించువాడు. వీరు విందు భుజించువారు. గొప్పవారు ఒక విందుచేసి, పదార్ధములు వడ్డించుమని ఇతరులకు అప్పగించి తాను మొదటి పంక్తిలోని వారికి మాత్రము వడ్డించిన ఆ పంక్తిలోనివారికి ఎంత సంతోషము, అలాగే యేసుప్రభువు ఇతరులైన శిష్యుల సేవకులు గలిలయలోను, యూదయలోను ఉండగా ఆ 11మందికే వడ్డించెను. వారు ఆయనకు మూల చుట్టములు (ప్రత్యేక బంధువులు) అయినారు. బేతనియలో, కపెర్నహూములో, కనానులోను, నజరేతులోను శిష్యులున్నారు. వారందరికన్న ఆ 11మంది ప్రత్యేక బంధువులైన ఆయన అతిధులు అయినారు.

7) ఈ ప్రభురాత్రి భోజనమునకు "సమభాక్త్యము" అనిపేరు కూడ ఉన్నది. ఎవరి ఇంటిలోవారు భోజనముచేసిన అది సమభాక్త్యమనబడదు. అన్ని ఇండ్లలోనివారు ఒకచోట కూర్చుని భోజనముచేసిన సమభాక్త్యము అనబడును. శిష్యులు వేర్వేరు గ్రామములవారు. ప్రభువు సముద్రము దగ్గర నున్నవారిని, సుంకపు

మెట్టుదగ్గర నున్నవారిని, అంజూరపు చెట్టుక్రింద నున్నవారిని పిలిచి వరుసగా కూర్చుండపెట్టి విందు చేసెను గనుక సమభాక్ష్యము. గనుక ఆయన సమభాక్ష్యదానకర్త. వారు సమభాక్ష్యభాగులు అనగా పాలుపొందిన వారు. యేసుప్రభువు గార్ధభాసీనుడై యెరూషలేమునకు వెళ్ళినప్పుడు ఈయన ఎవరు అని ప్రశ్నించిరి. ఈ రాత్రి భోజన సమయములో నేను 'ఈయన ఎవడు' అని వివరించుచున్నాను. 8) ఆయన 3సం॥లు వారితో కలిసి మెలిసి ఉన్న ఆయన ఒక బాటమీద నడిచిరి. ఒక దోనె ఎక్కిరి, ఒకే పంక్తిలో ఉండిరి. పాపులతో, సుంకరులతో భోజనముచేసి బసచేసిరి. ఈయన ఎవరనగా గొప్ప సహవాసికూడ ఉండివెళ్ళిన చోటకెల్ల వారిని త్రిప్పిన సహవాసి. ఆ సహవాసి ఈ విందులో వడ్డించే సహవాసి అయినాడు. వారు ఆయన జట్టులోని సహవాసులు. గనుక ఆయన సహవాసులు. 9) ఆయన అసలైన మానవుడు. మనుష్యులు పరిశుద్ధులైనను ఒకప్పుడు పాపులే. పరిశుద్ధులగుచున్న పాపులు. ఆయన పాపిగాదు, పరిశుద్ధుడు అపరిశుద్ధుడుగాదు. ఒకరివల్ల పరిశుద్ధుడుగా మార్చబడువాడుకాడు. అసలే పరిశుద్ధుడు. వారు పాపులుగాని పరిశుద్ధులగుచున్నారు. కొంతకాలమునకు ఆయన రూపలావణ్యములు వారికి వచ్చుననిగలదు. ఆయన నరరూపి. వారు పరిశుద్ధులు కావలసిన నరరూపులు. ఆదిలో తన రూపము ఇచ్చిన నరరూపులు గాన తిరిగి ఆయన రూపములోనికి వచ్చుటకు వారిని మేపుచున్నాడు. (ఆహారమిచ్చుచున్నాడు) అదే ఈ విందు. 10) యెషయా 9:7లో మనకొరకు శిశువు పుట్టెను. ఆయన బలమైన శిశువు. అనగా మన తండ్రియైయున్న దేవుడు. ఆయన తండ్రి. వీరు తండ్రియొక్క బిడ్డలు నేను ఆ 11మందిలో ఉంటేనా! అప్పుడు లేకపోయిన పోనీలెండి ఈ సంస్కార భోజనములో ఇప్పుడు ఉంటే చాలును. తండ్రియైయున్న దేవుని కృప తోడైయుండునుగాక!

# 12వ పాఠము

**"విందు సిద్ధమైయున్నది" లూకా 14:17.**

**"నా శత్రువుల యెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు" కీర్తన 23:5.**

1. ఇదివరలో ప్రభువు బల్లగురించి ప్రచురించితిమి. ఇప్పుడు పై అంశము ప్రకటించుచున్నాము. మానవులు జన్మింపక పూర్వమే పరలోకపు తండ్రి అందరకు కావలసినవాటిని అనగా ఆకాశములోను, భూమిమీదను ఉన్నవాటిని సృజించెను. మనము భుజింపవలసిన పండ్లు, కూరగాయలు, ధాన్యాదులు అవి మన భోజన పదార్థములుగా అమర్చిపెట్టెను. ఏమియు కొదువలేదు. మనము దేవుని బిడ్డలము కనుక మనకు ఈ ఏర్పాటొక బల్లమీద భోజనమువలె నున్నది. ఇది మనము తలంపవలసిన మొదటిబల్ల ఆదికాండము 1వ అధ్యాయము.

2. ఎన్నికజనమగు ఇశ్రాయేలీయులకు దేవుడు నలుబది ఏండ్లు అరణ్యములో భోజనము అనగా వారు కష్టపడి సంపాదింపని భోజనము అనుగ్రహించెను. ఇది మనము తలంచుకొనవలసిన రెండవబల్ల. (మొదటి బల్ల అందరకు, ఈ బల్ల వారికే నిర్గమ 16 ఈ రెండును శరీరమునకు ఆహారము చూపు బల్లలు).

3. నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు కీర్తన 23:5. అదిలేదు, ఇదిలేదు అది తక్కువ, ఇది తక్కువ అని విసుకునట్టివారికి. ఈకీర్తన సంబంధింపదు. 'నాకు లేమి కలుగదు' అని సంతుష్టిపడునట్టి విశ్వాసులకు మాత్రమే సంబంధించుచున్నది. ఈ కీర్తన శరీర జీవనమునకు మరింత ముఖ్యముగా ఆత్మ జీవనమునకును కావలసిన సదుపాయములను జ్ఞాపకము చేయుచున్నది. భూలోకములోను, పరలోకములోనుగల

సదుపాయములను కూడ జ్ఞాపకముచేయుచున్నది. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను. ఈ వచనము పరలోకమును జ్ఞాపకము చేయుచున్నది. నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు అను వచనము మనము యెంచుకొనదగిన మూడవబల్ల.

4. మనుష్యులందరు రక్షణ పొందవలెనని దేవుడు ఇచ్ఛయించుచున్నాడు అను సంగతి 1తిమోతి 2:4లో ఉన్నది. ఈ సంగతి చూడగా అందరు రక్షణ అంగీకరింపకపోయినను రక్షణ అందరికొరకుద్దేశింపబడినట్టు కనబడుచున్నది. సృష్టిలో మనకు ఉచితముగా ఏర్పరుపబడినవన్నియు తలంచుకొన్నయెడల మన మనస్సునకు ఎంతో విందుగా నుండును. యేసుప్రభువువల్ల కలిగిన ఆత్మీయ రక్షణ తలంచుకొన్న యెడల మనస్సునకు మరింత గొప్పవిందుగా నుండును. రక్షణ ఉచితము. ఎవరైన మనలను విందుకు పిలిచినప్పుడు మనము సంపాదించినది భుజించుటకు వెళ్ళుచున్నామని అనుకొనము. విందు అనుమాట ఉచితము అను తలంపును కలిగించుచున్నది. రక్షణను గొప్ప విందుగా భావించుకొనవచ్చును. రక్షణ మనము సంపాదించినదికాదు. ప్రభువు సంపాదించి మనకు ఉచితముగా ఇచ్చినది. ఈ రక్షణ విందు నాల్గవ బల్ల. ఒక ధర్మాధికారి గొప్ప విందు చేయించి ఇప్పుడు సిద్ధమైయున్నది రండని ప్రజలకు కబురు పంపెననియు, అందరకు కబురు పంపెననియు ప్రభువు చెప్పిన ఒక ఉపమానములో ఉన్నది. యేసుప్రభువుతో భోజన పంక్తిని కూర్చున్న యొకరు దేవునిరాజ్యములో భోజనము చేయువాడు ధన్యుడు అని చెప్పినప్పుడు భోజనమునకు సంబంధించిన ఈ ఉపమానము ప్రభువు చెప్పినందువలన అది సర్వజనులను ఆహ్వానించిన రక్షణ విందును జ్ఞాపకము చేయుచున్నది మత్తయి 22:2-10; లూకా 14:15-24.

5. క్రీస్తుప్రభువు శ్రమపడక ముందు ఎవరును గ్రహింపలేని ఒక భోజనపు బల్ల సిద్ధపరచెను. ఈ బల్లమీద భోజనము మొట్టమొదట గైకొన్నవారు ఆయన అతిసామీప్య శిష్యులు. బల్లయొద్ద యేసుప్రభువు ఉన్నట్టును బల్లమీద మొదటి వరుసలో ఆయన శరీరమును, రక్తమును ఉన్నట్టును, రెండవ వరుసలో రొట్టెయును, ద్రాక్షారసమును ఉన్నట్టును తరువాత బల్లయెదుట శిష్యులున్నట్టును భావించుకొందుము. ప్రభువు వారికి కనబడునట్లుగా రొట్టెను, ద్రాక్షారసమును అందించెను. ఆ రెప్పపాటులోనే వారి నోటికి తెలియని తన శరీరమును, కంటికి కనబడని తన రక్తమును వారికి అందించెను. ఈ విధముగా ఆయన తననే వారికి అనుగ్రహించెను. ఇది ఒక గొప్ప మర్మము. వారు తీసికొన్నవి నాలుగు. వడ్డించిన ఆయన ఒక్కరే. అందుకొన్నవారు కొందరే. తరుగకుండ ఆయన శరీరమును, ధారబోయకుండ తన రక్తమును వారికెట్లు ఇయ్యగలిగెనో మిగుల ఆశ్చర్యముగా నున్నది. "చిందింపబడుచున్న రక్తము" అని ప్రభువు తన రక్తమును గురించి చెప్పెను. అది ఆయన జీవించియుండగానే చిందింపబడుటకూడ ఆశ్చర్యము. ప్రభువు భోజనమైనప్పుడు మనమును ఆచరించుచున్న విషయములలో నీ చిత్తము ప్రభువు భోజనము ఏ విషయములలో గొప్పది? జవాబు 1) దేవుడు మానవుడు అయియున్న యేసుప్రభువును ఏర్పరచెను. గనుక గొప్పది. 2) ఆయన తన శరీర రక్తములను అందించుచున్నాడు గనుక గొప్పది. 3) ఇది పూర్వకాలములోని ఇశ్రాయేలీయుల పాతనింబంధనకు కాదుగాని మన కాలములో విశ్వాసుల క్రొత్త నిబంధనకు సంబంధించినది గనుక గొప్పది. 4) ప్రభువు రెండవసారి వచ్చి సంఘమును తీసికొని వెళ్ళునట్టి దినమువరకు ఆచరింపవలసినది గనుక గొప్పది 1కొరింథీ 11:26. 5)

పాపపరిహారము కొరకు ఏర్పడినది గనుక గొప్పది మత్తయి 26:28. 6) తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడునులేడు అని ప్రభువు చెప్పెను యోహాను 15:23. ఈ మాట లోకములోని స్నేహితులకు అన్వయించుచున్నమాట. “రక్తములో ప్రాణమున్నది” ద్వితీ. 12:23; మత్తయి 20:28. యేసుప్రభువు తన రక్తమును చిందించుట వలన తన ప్రాణమును మనకు సమర్పించినాడు. గనుక గొప్పది. 7) కొందరు మూడు నెలలకొకమారు మరికొందరు నెలకొకమారు, ఇంకను కొందరు వారమునకొకమారు ఇది ఆచరించుచున్నారు. విశ్వాసి తన ఇష్టము వచ్చిన సమయమందు ఆచరింపవచ్చును. ఇచ్చువారున్నయెడల నేను ప్రతిదినము ఆచరింతును అని సాధు సుందర్‌సింగుగారు చెప్పిరి. ఇచ్చుటకు ప్రభువు బల్లవేసియున్నది గనుక గొప్పది. 8) తన శరీర రక్తములను గైకొనువారు ఎల్లప్పుడు జీవింతురు అని ప్రభువు చెప్పెను గనుక గొప్పది యోహాను 6అధ్యా॥. 9) నాలుగు సంగతులను గమనించండి.

**మొదటిది:-** ఈ సంస్కార భోజనము మీ కొరకు అని చెప్పబడి యున్నది లూకా 22:19. **రెండవది:-** అనేకుల కొరకు అని చెప్పబడినది మార్కు 14:24. **మూడవది:-** ప్రభువు శరీరమును జ్ఞాపకము చేసికొనుటకు అని వ్రాయబడియున్నది 1కొరింథీ 11:26. **నాల్గవది:-** ఆయనవచ్చు పర్యంతము ఇది ఆచరించవలెనని వ్రాయబడియున్నది 1కొరింథీ 11:26 గనుక ఇది గొప్పది. 10) ఇది పరలోకములో జరుగనైయున్న పెండ్లివిందును జ్ఞాపకము చేయుచున్నది గనుక గొప్పది మత్తయి 26:22; ప్రకటన 19:9. 11) గతించిన ఇరువది వందల ఏండ్లనుండియు ప్రభువు కోట్లకొలది విశ్వాసులకు తన శరీరమును

రక్తమును ఇచ్చిన ఎట్లు తరగకుండును? బాధపడకుండను ఇచ్చుచున్నాడో ఇదియు మిగుల ఆశ్చర్యముగానున్నది. గనుక గొప్పది. అంత గొప్ప రక్షకుడు స్థాపించిన అంతగొప్ప బల్ల మనకొరకు ఎప్పుడును సిద్ధముగానేయున్నది.

ఈ దిగువను నేర్చిన మరికొన్ని సంగతులు వినండి. 5వ బల్లను గురించి చెప్పిన రీతిని బట్టి మీరుకూడ బల్లయొద్దకు వెళ్ళునపుడు అట్లే తలంచుకొనండి. ఎలాగనగా మీయెదుట బల్లవేసియున్నట్టును బల్లకు అవతల ప్రక్క ప్రభువు నిలబడినట్టును, బల్లమీద మొదటి వరుసలో శరీర రక్తములున్నట్టును, రెండవ వరుసలో రొట్టె ద్రాక్షరసము ఉన్నట్టును, వాటియెదుట బల్లదగ్గర మీరు మోకరించియున్నట్టును తలంచుకొనండి. మీకొరకు ఈ నాలుగుగల బల్ల సిద్ధమైయున్నది అని సంతోషించండి. మనకు కావలసినవన్నియు సిద్ధపరచుట తండ్రి మనసులోనున్న కోరిక. వెలుగు, గాలి, అగ్ని, నీళ్ళు, ఖనిజములు. భూమ్యాకాశములు మనకొరకు ఆయన సిద్ధపరచుచున్నాడు. గత కాలమందు ఆయన సిద్ధపరచినది తలంచుకొనండి. ప్రళయములో మునిగిపోకుండ రక్షింపబడునట్లు ప్రజలకు తండ్రి నోవహు కాలములో ఒక నావను సిద్ధపరచెను. ఇశ్రాయేలీయులకు నివాసార్థమైన ఒకదేశమును సిద్ధపరచెను. స్వనాశనమును కోరిన యోనాను సముద్ర విపత్తునుండి రక్షించుటకు మత్స్యమును సిద్ధపరచెను. అందరము చదువుకొనుటకు బైబిలు గ్రంథమును సిద్ధపరచెను. మనమది నేర్చుకొనుటకు ఒక సంఘమును సిద్ధపరచెను. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నానని యేసుప్రభువు తన శిష్యులకు చెప్పి వెళ్ళెను. యోహాను 14:2. ఇప్పుడది విశ్వాసులకు సిద్ధమగుచున్నది. విశ్వాసీ దేవుని స్తుతింపుము.

# 13వ పాఠము

**మత్తయి 26వ అధ్యాయము. "ఈ పాత్ర నా రక్తమువలనైన నా నిబంధన. దీనిలోనిది మీరు త్రాగుడి ఇది నా రక్తము".**

ప్రభు భోజన సంస్కారపు విందు దినమున ఈ విషయమునే వివరించుట అవసరము. దీనినే తలంచుకొనవలెను. మన రెండు నేత్రములు ఎదుట రొట్టె, ద్రాక్షరసము ఉన్నవి. అయితే నేటి ప్రసంగము యొక్క ముఖ్యాంశము ఏదనగా దేవుడు సృష్టిలో కలుగజేసిన వస్తువులు మనము చూస్తే పైకి ఒక విధముగనుక, లోపల మరియొక విధముగను ఉన్నవి. బహిరంగ, అంతరంగ స్థితులు ఒక విధముగాలేవు.

ఉదా:– 1) పండు:– పండు పైకి ఒక విధముగను కోసిన, లోపల మరియొక విధముగనున్నది. అరటిపండు పైన తోట లోపల గుజ్జు, పైకి కనబడుచున్నట్టే లోపలకూడా ఉన్నదని ఎవ్వరూ అనుకొనకూడదు.

ఉదా:– 2) పక్షులు, జీవరాసులు:– పక్షులకు బయట ఈకలు, వెంట్రుకలును, లోపల వేరుగనుక ఉండును.

ఉదా:– 3) మనుష్యుడు:– మనిషి బయటకు ఒక విధముగా నున్నాడు మరిలోపలనున్న ప్రాణము కనబడదు. దాని క్రియలు మాట్లాడుట, చూచుట, నడచుట వంటివి పైకి కనబడుచున్నవి. దీనినిబట్టి మానవుడు బాహ్యమున, అంతరంగమున వేరువేరుగా నున్నాడు.

ఉదా:– 4) సంస్కారపు రొట్టె:– పైకి మనమింటియొద్ద తినెడి రొట్టెవలెనె ఉన్నది. కాని ప్రభువు మనకు రొట్టె ఇచ్చునప్పుడు "ఇది రొట్టె" అని చెప్పలేదు. ఎందుకనిన అది రొట్టెవలెనె 11గురు శిష్యులకు

కనిపించుచునేయున్నది. కానీ దానిలోపల యుండునది వారికి కనబడదు. అది ప్రభువునకే కనబడును. గాన దానిని వారికి వివరించి చెప్పవలెను. "ఇది నా శరీరమని" చెప్పెను. కాని అది నమ్ముటకు వీలులేదు. ఎందుకనిన అది రొట్టెవలెనే కనబడుచున్నది. అలాగే "ఇది మీకొరకియ్యబడిన ప్రభువు శరీరమని" చెప్పి రొట్టెనిచ్చెను. విశ్వాసికి మాత్రమే ఆ మర్మము తెలియును. ప్రభువు ఈలాగు చెప్పినప్పుడా 11మంది లేచి ప్రభువా నీ శరీరము నీయొద్దనుండగానే ఇది నా శరీరమని ఏలచెప్పుచున్నావని ఎందుకడుగలేదు?

ప్రభువు మాట నమ్ముటయే వారి పని. అందుచేత అలా వారు ప్రశ్నించలేదు. ఆ శరీరమేలాగిస్తారో మనకు తెలియదు. ఆ రొట్టెతోపాటు ఆయన శరీరమును మనకు ఇవ్వకపోతే ఇది నా శరీరమని ప్రభువు చెప్పనే చెప్పడను నమ్మకము వారికున్నది. ఆయన చెప్పినదెల్ల నమ్ముటయనునది దినదినము వారిలో పెరుగుచునేయున్నది గాని తగ్గలేదు. అలాగుననే రక్తము: ఇది మీ పాపములకొరకు చిందింపబడిన నా రక్తము అనెను.

ఈ మాటలు బుధవారము చెప్పెను. గురువారము చిందించెను. కాని గురువారము "ఇది మీకొరకు చిందింపబడుచున్న నా రక్తము" అనెను. అంటే ఇప్పటికే రక్తము చిందింపబడుట ఆరంభమైనది. శత్రువులు శుక్రవారమున ఆయనను పొడిచినప్పుడు ఆయన రక్తము చిందింపబడినది. కానీ గురువారము నాడే ఆయన రక్తము చిందింపబడుట ఆరంభమైనది. కానీ అది మన కన్నులకు కనిపించుటలేదు. అనగా గురువారము అంతరంగముగా కారుచున్నది.

అరటి పండులో తోలు, పక్షిలో ఈకల, మనిషిలో చర్మము బహిరంగముగా ముందు వచ్చినవి. కానీ ప్రభువు విషయములో

అంతరంగము ముందు బహిరంగము వెనుక వచ్చినది. భూలోక చరిత్ర మనము లోకమందెచ్చట ఉంచినను అశుభ్రత, పాపము మొదలగునవి కనబడును. ఇవి మనకిష్టమున్నను, లేకపోయినను నిరంతరము కనబడుచునే యుండును.

పాపము ఎక్కడ ఉన్నదో అచ్చట పాపమును ప్రభువు పరిహారము చేయును. పిదప అచ్చట పాపముండదు. ఈ పాపపరిహారమునకై మానవుడు పశ్చాత్తాపపడవలెను. అలాగే మనిషికి జబ్బు వచ్చిన  అది పైకి కనబడుచునే యున్నది. ఆ జబ్బు మనిషితో నీ జబ్బు పోయినదని అంతరంగమున నమ్మమని చెప్పును.

అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లనూ పొందియున్నానని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను. మార్కు 11:24 జబ్బు పైకి కనబడుచున్నను పోకముందే పోయినదని నమ్మిన లోపలనున్న జబ్బు నిజముగా పోవును. ఒక స్త్రీకి 18 సం॥లనుండి నడుము వంగిపోయినది. తిన్నగా నడువలేదు. లూకా 13:11-13 మీటింగునకు వచ్చినది ఆ బలహీనత పోయినదని ఆమెతో ప్రభువు చెప్పెను. ఎందుకనిన ప్రభువునకు పోయినట్లుగా కనిపించుచున్నది. గనుక అయితే ఆ స్త్రీ ప్రభువు చెప్పిన మాటనే నమ్మెను గనుక ఆమె జబ్బు వెంటనే పోయినది గాన పైకి ఒకటి లోపల ఒకటి.

**మరణము చివరి దృష్టాంతము:-** పైకి విశ్వాసి మరణించెను, కాని దేవుని దృష్టిలో మరణించలేదు. అంతరంగములో జీవములోనికి వెళ్ళెను. బహిరంగములో సమాధిలోనికి వెళ్ళెను. చాలా సంవత్సరముల క్రిందట బుల్లెయ్య అను ఒకాయన మరణావస్థలో ఉండెను. ఆయన స్నేహితులు వచ్చి అయ్యా! చనిపోవుచున్నావా? అని వారు ఏడ్చిరి.

అట్లు దుఃఖించుచున్నవారి చేతులు పట్టుకొని "అయ్యలారా నేను చనిపోవుటలేదు. ఇప్పుడే బ్రతుకుట ఆరంభించు చున్నాను" అని చెప్పెను. అనగా మోక్షలోకములో నేను బ్రతుకుదునని చెప్పెను. అచ్చట మనము అనుభవించుచున్న కష్టనష్టములు మరియు మరణమనునవి లేవు. అచ్చట అంతా జీవము, పాపపరిహారము, వెలుగు, సంతోషము మొదలగునవి ఉండును. అట్టి సమయములో జీవవేగాని మరణముండదు.

కాబట్టి ఈవేళ మీరు రొట్టె తీసికొనినప్పుడు రొట్టెతోపాటు ప్రభువుయొక్క శరీరముకూడా తీసికొంటున్నామని మనము నమ్మితే దానివలన వచ్చిన ఫలము మీరందరు అనుభవింతురు. ఇట్లు విడిచి మనము గుడికి వచ్చినది సంస్కారపు రొట్టెను పుచ్చుకొనుటకే. ఇది మనము పెనముమీద కాల్చు రొట్టెకాదు. ఇది ప్రభువు శరీరము. దీనివలన వచ్చు ఫలితమును వివరించుటకు వీలులేదు. అది సంతోషము, జీవము మొదలగునవి. ఫలితాలన్నీ నాకున్నవని నమ్మి మనము ఇప్పుడు ఈ రొట్టెను పుచ్చుకొనవలెను. ఇదియే ప్రభువు శరీరము. అయితే తెలివి తక్కువతనము వలన దీనిని మనము పోగొట్టుకొనుచున్నాము. అందుకనే సంఘము నెలకొకమారు రొట్టెను పుచ్చుకొనుచున్నారు. ద్రాక్షారసముకూడా అట్టిదే. ఇది ప్రభుని మహిమ రక్తము, జీవము, మనిషి చనిపోవుచున్నాడని డాక్టరు నాడిని పట్టుకొని చూచును. అలాగే రక్తమంటే ప్రభువుయొక్క ప్రాణము, జీవము మనలోనికి వచ్చుచున్నది.

పేతురు ప్రభువు నెరుగనని బొంకినాడు. అప్పుడు ప్రభువు పేతురువైపు తీక్షణముగాచూచెను. వెంటనే పేతురు పశ్చాత్తాపపడి ఏడ్చెను. సంతాపపడి ఏడ్చెను. మత్తయి 26:69-75లో పాపము చేసిన

వెంటనే ఏడ్చెను. వెంటనే క్షమాపణకోరినాడు. క్షమాపణ పొందినాడు. పేతురు చాలా గడుసుతనముగలవాడు. వీరినిచూచి పాపము చేసి పేతురు వంటి గడుసుతనమును కోరరాదు. కాని పాపములు జయించుటకు ప్రయత్నము చేయవలెను. అట్లు ప్రయత్నము చేయుచున్నపుడు ఓడిపోయినను ఫరవాలేదు. మనిషి పాపములో పడినవెంటనే పశ్చాత్తాపపడిన ప్రభువు వెంటనే క్షమించును. ఆలస్యము చేయడు. మనుష్యుడు పాపము చేసిన పిదప ప్రభువు తనను ఇంక చేర్చుకొనడని నిరాశచే ఆలస్యము చేయునా!

'తాను' నిలచుచున్నాననుకొనువాడు పడకుండనే చూచుకొనవలెనని పౌలు చెప్పెను. ప్రభువుయొక్క మహిమ, జీవము మనకందునని నమ్మి తీసికొనుడి. వట్టి శరీరమును అనగా ప్రాణములేని శరీరము మనిషికాదు శవమే. అందుచే ప్రభువు రొట్టె, ద్రాక్షరసమునిచ్చెను.

రొట్టె – ప్రభువు శరీరము; ద్రాక్షరసము – ప్రభువు జీవము (రక్తము); ప్రభువే ఆదృష్టాంతము.

ఆఖరు దృష్టాంతము ప్రభువే. పరిసయ్యులు ఆయన నరరూపమును చూచి ఆయనను నమ్మలేదు. ఆయన లోపల దేవుడై యున్నాడని కూడా నమ్మలేదు. కాని శిష్యులు, ఇతరులు నమ్మినారు. పరిసయ్యులకు యేసుప్రభువు మరియ యోసేపుల పుత్రునివలె కనబడుచున్నారు. గాన నమ్మలేదు. అట్లే ఈ విధముగా నేడు అనేకులు ఆయన ఇచ్చిన రొట్టె ద్రాక్షరసములను ఆయన శరీరము, ఆయన రక్తము అని నమ్మలేరు. ప్రభువే మన విందు. రొట్టె ద్రాక్షరసము కలిసి ఒక మనిషి అయినాడు. అట్లే శరీరము, జీవము కలిసి ప్రభువు అయినారు.

# 14వ పాఠము

**దా.కీ. 134; లూకా 8:22; రోమా 11:33-36**

ప్రార్థన:- సర్వజన పోషకుడువైన ఓ తండ్రీ! సర్వలోక రక్షకుడువని గ్రహించే కృప నిమ్ము. మా శరీర ఆత్మలను నీవు పోషించే దేవుడవైయున్నావు. నీకు వందనములు. మోక్షలోకములో మహిమాహారముతో పోషించేవాడవైయున్నావు అది సాగించుము. మాలో ప్రతివారిలో చొరబడి వర్తమానము అందించుము. క్రొత్తవారికి ఎప్పుడు వర్తమానము అందనివారికి వర్తమానము అందించుమని క్రీస్తు ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

సర్వలోక జనపోషకుడైన దేవుని భోజన పంక్తిలో కూర్చుండు సహకారవిశ్వాసులారా ఈ వర్తమానము అందుకొనుడి.

**1) శరీరము ప్రాణము:-** దేవుడు ఈ రెంటిని అద్భుతంగా పోషించే పోషకుడైయున్నాడు. గనుక మనము ఆయనను స్తుతింపవలెను. ఆ శరీరములో ప్రాణమేకాదు ఆత్మకూడా ఉన్నది. శరీరము ప్రాణము ఆత్మయై యున్న మనము పోషింపబడవలెను పోషించేవాడు దేవుడే.

మోక్షలోకములోను పోషణ అగత్యమైయున్నది 1) శరీర 2) ఆత్మీయ జీవిత పోషణ 3) నిత్యజీవముయొక్క మహిమ పోషణ మానవుల దృష్టికి శరీర పోషణ అద్భుతముకాదు. నరులు పొలములో పనిచేసి సంపాదించి తినే భోజనము ఇది సామాన్య పోషణయైయున్నది. ఇది దేవునియొక్క సెలవునుబట్టి వచ్చుచున్నది. మేఘములు, వర్షము, పైరు, వెన్ను, గింజ, పంట, ఇవన్నియు శరీర విషయములు.

**ఆత్మపోషణ:-** శరీర పోషణార్థము తప్పక దేవుడు పోషణ ఏర్పరచెను. బైబిలు కథ ప్రకారము ఇశ్రాయేలీయులు తమ స్వదేశమునకు వెళ్ళడానికి అరణ్యము అడ్డువచ్చినది. 40సం॥లు వారక్కడ గడుపవలెను. నదులు, పొలాలేగాని బజార్లు లేవు అప్పుడు వంట అక్కరలేని చల్లని ఆహారము ఆకాశమునుండి కురిపించెను. 40 సం॥లు ఆరు లక్షల మందికి ఇట్టి ఆహారము కురిపించి వారిని పోషించెను. మనలను సహా దేవుడు పోషించును అనే నమ్మకమునకు ఈ సంఘటను దేవుడు వ్రాయించెను.

ఏలియా కథలో వర్షము లేక, మంచులేక కరువు వచ్చినది. పంట పండలేదు. రాజునకు, కూలికి ఈ కరువు వచ్చినది. భక్తులు భక్తిహీనులు ఆకలికి చావవలసినదే. దేవుడు భక్తులనుకూడ చావనిచ్చునా? ఏలియాతో దేవుడు నీవు అరణ్యమునకు వెళ్ళు. అక్కడ నివసించు కాకులు నీకు ఆహారము తెచ్చిపెట్టునని చెప్పెను. మనమైతే దొంగిలించే కాకులు ఆహారము పెట్టునా అని అనుకొందుము. గాని ఏలియా అట్లు అనుకొనక రొట్టె ముక్కలు తిని ఏటి నీరు త్రాగెను. 1 రాజులు 17:2-7. ఏలియాతో దేవుడు అరణ్యము విడచి పట్టణములోకి వెళ్ళుము. బస, భోజనపు ఏర్పాట్లు విధవరాలి వద్ద ఏర్పరచితిని అని అనెను. ఒక్క నీటి చుక్కలేకుండా ఏరు ఎండిపోవును అని దేవుడు సెలవిచ్చెను. ఏలియాకు దేవుడు చూపించిన ఆ విధవరాలు ఒకప్పుడు భాగ్యవంతురాలే గాని కరువువల్ల బీదరాలుగా మారిపోయెను. పుల్లలు ఏరుకొనుచున్నది. ఏలియా ఆమెను రొట్టెలు తెమ్మని కోరగా కొంచెమెయున్నది అని ఆ విధవరాలు పలికెను. అప్పుడు ఏలియా కరువుపోయెవరకు నూనె, పిండి అయిపోదు అనెను. 1 రాజులు 17:10-16. అలాగే జరిగెను. కరువు దినములు అయిపోయెవరకు వారు తిన్నారు. అలాగే భక్తులకు కరువు ఉండరాదు. దేవునిని నమ్ముకొన్నవారికి ఆహార, కరువు ఉండకూడదు.

ఈ ఏలియా అరణ్యప్రయాణములో అలసి చెట్టు క్రింద పరుండి నా ప్రాణము తీసికో ప్రభువా అని అనగా దేవుడు నీవు చాలా దూరము వెళ్ళవలెను లేచి భోజనము చేయుమనెను. బుడ్డితో నీళ్ళను పెనముపై రొట్టెయుండగా తిని బలము పొంది ఏలియా 40 దినములు ప్రయాణము చేసెను.

ప్రవక్త అయిన ఎలీషాను దర్శించుటకు 100మంది వచ్చిరి. ఎలీషా యొద్ద 40 మంది యుండిరి. వీరందరికొరకు ఒకరు 20 రొట్టెలు తెచ్చిరి మీరు లేచి రొట్టెలు పంచుడని శిష్యులకు సెలవిచ్చెను. 2 రాజులు 4:42-44. 20 రొట్టెలు వందమందికి పంచగా ఇంకా మిగిలెను. ఈరీతిగా ఆ రొట్టెలు అద్భుత ఆహారమైనది.

యేసుప్రభువు ఈలోకములో ఉన్నప్పుడు సముద్రతీరమున బోధించుచుండెను. చక్కని వాక్యమును ప్రభువు బోధించుచున్నందున వినుచున్న ప్రజలు ఆకలిగా ఉన్నను ఇంటికి వెళ్ళకుండా ఉండిపోయిరి. వారు ఆకలితో ఉండిరి వారినిచూచి ప్రభువు 5 రొట్టెలు, 2 చేపలు పంచగా 12 గంపలు మిగిలెను. మత్తయి 14:17-21లో 20 రొట్టెలు వద్దయున్న దేవుడు ఇక్కడ మనిషిగాను, అక్కడ దేవుడుగాను ఉండెను. ఆయనే ఈయన 5వేల మంది తినిరి. 12 గంపలు మిగిలెను. ఇది శరీరమునకు ప్రాణమునకు పోషణ. ఇది అద్భుత ఆహారము.

**2. ఆత్మ ఆహారము:-** పైన ఉదహరింపబడిన ఈ ఆహారము గింజల ఆహారము. అది ఈ లోకములో ఉన్నప్పుడు అవసరమైయున్నది. ఒక దినమందు ప్రభువు 40 దినముల ఉపవాసప్రార్థనలో అరణ్యములో ఉన్నారు. అక్కడ నీళ్ళు, ఆహారములేదు. అరణ్యములో ఆకలిగా ఉన్న ప్రభువును సందుచేసికొని కవీశ్వరుడు వచ్చెను. అయ్యా! ఈ శిలలతో

మీరు రొట్టెలైపోండి అంటే అవి అగును గదా మీరు తినవచ్చునని అనెను. అందుకు ప్రభువు నరుడు రొట్టెవల్లకాదు దేవుని నోటి మాటవల్ల జీవించునని చెప్పెను. మత్తయి 4:4లో ఈ వాక్యము ద్వితీయోపదేశకాండములోనిది. ఒక దొరసానమ్మగారు 6 దినములు ఆహారము మానివేసి వాక్యమునే చదివి జీవించెను. దేవుని వాక్యము లేకుండా సృష్టి కలుగలేదు. ఒక బోధకుడు జబ్బుగా ఉన్న ఒక ఆమెయొద్దకు వెళ్ళి నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే అని చెప్పెను. అట్టి మాటవిన్న ఆమె ఆత్మకు ఆదరణ కలిగెను. దేవుని వాక్యము అనుదినము చదివిన ఆత్మకు ఆహారము దొరుకును.

3) యేసుప్రభువు ఈలోకములో తన శిష్యులకు బల్ల ఏర్పరచెను. ఆ బల్లపై రెండు పాత్రలు ఉండెను. ఒక పాత్రలో రొట్టెలు ఉండెను. ఆ పాత్రలోని రొట్టె తీసి తన శిష్యుల చేతికిచ్చి ఇది నా శరీరము తినుడని చెప్పెను. రెండవ పాత్రలో ద్రాక్షరసము ఉండెను. ఆ రసమును తీసికొని ఇది నా రక్తము తీసికొని త్రాగుడి అని చెప్పెను. రొట్టెనుబట్టి, ద్రాక్షారసమునుబట్టి యేసుయొక్క శరీరము, రక్తముకూడ మనకు లభించుచున్నది. ఆయన బ్రతికియుండగా ఆయన శరీరమును, రక్తమును ఎట్లు భుజించగలము ఇది మనకు అర్థముకాదు. అది మహిమ శరీరము, తల్లిదండ్రుల శరీరము బిడ్డలకు వచ్చునట్లు యేసుప్రభువు పాపములేని శరీరము మనకుకూడా వచ్చెను.

ఉదా:- ఈ అమ్మాయి తల్లివలెను, ఈ అబ్బాయి తండ్రివలె ఉన్నారు అని మనము అందుము. యేసుప్రభువు రూపము మనకుకూడా వచ్చునట్లు మనము సిద్ధపడవలెను.

# 15వ పాఠము

## కీర్తన 119:103; లూకా 22:14; 1కొరింథీ 11:23-26

సంస్కార భోజన ప్రియులారా! మీకు ఈ భోజనముయొక్క ఉద్దేశ్యము తెలియునుగాక! దీనివలన మీకు ఎప్పటికప్పటికే మితానుభవము కలుగునుగాక!

నిన్న భోజనము చేసిన మనము ఈవేళ నాకు భోజనము అక్కరలేదని ఎవ్వరు చెప్పరు. అలాగే ఇదివరకు ప్రభుభోజనము అనుభవించిన మనము ఈవేళ అక్కరలేదని చెప్పము.

**సాధుసుందర్‌సింగ్ అను పరమభక్తుడేమన్నాడనగా ఇచ్చేవారుంటే ప్రభు భోజనము ప్రతిదినము తీసికుంటానన్నాడు.** శరీరాహారము ప్రతిదినము తీసికొనుట లేదా? అన్నము ప్రతిదినము తిన్నట్లు ఇది ఆత్మకు అన్నము. ఈవేళ సంస్కార భోజనము వంకమీద ఇతర భోజనములుకూడా జ్ఞాపకము చేస్తాము. నేనెన్ని చెప్పబోవుచున్నానో వాటన్నిటికి బల్లభోజనము అనిపేరు. వాటన్నిటికి ఒకటేపేరు. సంతర్పణ. వాటన్నిటికి ఒకటేపేరు విందు. వాటన్నిటికి ఒకటేపేరు బంతి భోజనము. బల్లభోజనము మనకంటికి కనబడనిగాలి మీదిబల్ల, ఈ గాలి బల్లమీద రెండు పాత్రలు, అవి ఏవనగా 1) ఖగోళపాత్ర 2) భూగోళపాత్రలని రెండున్నవి. ఖగోళ శాస్త్రములో మనమనుభవించవలసిన కాంతులు ఉన్నవి. ఇవి తినవలసినవి కాదుగాని అనుభవించవలసినవి.

**1. వర్షధార:-** ఇది శరీరములోనికి అన్నముతోపాటు వెళ్ళవలసినదే. ఇది తినవలసినది కాదుగాని త్రాగవలసినది.

గాలిబల్లమీద ఖగోళ, భూగోళపాత్రలున్నవి. భూగోళపాత్రలో మనము తినవలసిన పండ్లు చాలా ఉన్నవి. 2) మనకు సహాయముచేసే పశ్వాదులున్నవి. మనకవసరమైన జలరాసులు, సముద్రము, నదులు, కాలువలు, చెరువులు గుంటలున్నవి. దేవుడు మనకేమి తక్కువచేయలేదు. మనము పరలోకాన్ని వెళ్ళేవరకు భుజింపవలసినవన్నీ గాలి బల్లమీదనే అమర్చి ఉండిరి. ఇది మొదటి బల్ల.

**2వ బల్ల:-** ప్రభు భోజన సంస్కారబల్ల, గాలి బల్లమీద ఈ బల్ల ఎందుకు గొప్పదనగా ప్రభుయేసుయొక్క రక్తమాంసములకు సూచన. ఇది అనుభవించుట వల్ల శరీరాత్మలకు బలము. ఈ గాలి బల్లలో ఉన్నవి. శరీరానికి ఎలాగో సంస్కార బల్లలోనివి ఆత్మకు అలాగున్నవి.

**3వ బల్ల:-** దీనినిగూర్చి బోధించుట చాలాకష్టము. దీనినిగూర్చి విన్నవారు వందమంది ఉంటే ఇద్దరికే అర్ధమగును. ఈ బల్ల దగ్గరకు స్వయముగా యేసుప్రభువు దర్శనములోనికి వచ్చి పాదిరిగారివలె రొట్టె ద్రాక్షరసము ఇచ్చును.

ఈ దినం గుడిలో మీరు పొందు రొట్టెవంటిదికాదు. అట్టి ద్రాక్షరసమును కాదు. అది ఆత్మీయమైన రొట్టెబిళ్ళ ఆత్మీయమైన ద్రాక్షరసము. ఆ మూడవ బల్లమీద ఉన్నది పుచ్చుకున్నవారికే తెలియును. ఇతరులకు తెలియదు కనబడదు.

సన్నిధి కూటములలోనికి ప్రభువు వచ్చి ఈ రొట్టె ద్రాక్షరసము దర్శనములో ఇచ్చేది తీసికొనవలయునని చెప్పుచున్నారు. ప్రభువు ఇస్తూ ఇట్లు చెప్పుచున్నారు. సన్నిధిలో నేనిస్తున్నానని పాదిరిగారి ఇచ్చేది మానివేస్తారేమో మానవద్దని చెప్పుచున్నారు. అప్పుడడిగాము గుడిలో తీసికోమంటున్నారు. మీరెందుకిస్తున్నారని అడుగగా పాపనైజము,

పాపేచ్ఛను పూర్తిగా క్రమముగా మీలోనుండి అంతరింపజేయుటకై నేనిస్తున్నానన్నారు.

ప్రభువు ఇచ్చేటప్పుడు క్రమముగా పాపములొప్పుకొనుట, పాపేచ్ఛ ఉండదు. గుడిలో ఇచ్చేదానికి ఉందును. సన్నిధిలోని అంతరంగ సంస్కార భోజనము వల్ల రెంటిని తొలగించినారు.

రేపు ప్రపంచములో శత్రువులవల్ల క్రైస్తవులకు అన్ని రకములుగా శ్రమలు రానైయున్నవి. అట్టి హింసలురాగా గృహము విడిచి ఆలయమునకు శత్రు భీతివలన రాలేము. ఈ హింసలవలన దేవాలయములో పుచ్చుకొన వీలుండదు.

ఆ కాలములో క్రైస్తవులు పాదిరిగారు గుడికిరారు. అప్పుడు సన్నిధిలో పుచ్చుకొనుటకు అలవాటుపడిన మనకు మన యింటిలోనే ఒక్కరున్నా ఇద్దరున్నా ఇస్తాడు. ఎంతో కృప మీ గృహములో అంతరంగ భోజనము తీసికొనుట అనేది అలవాటు చేసికొండి. ప్రభు భోజనము అనగా అంతరంగ భోజనము. మీ ఇంటిలో నలుగురున్నా ఇద్దరికే ఇస్తారు. నలుగురుంటే ఇద్దరికే ఇచ్చారు. అందుచేత ఇంటిలో ఎందరుంటే అందరు పుచ్చుకొనుటకు ఇప్పటి నుండే సిద్ధపడండి. అయ్యగారికి అలవాటు. ఏది త్రాగుచున్న మూడు దృశ్యాలు జ్ఞాపకము తెచ్చుకొంటారు.

1) సిలువపైవున్న ప్రభువును, 2) అంతరంగ సంస్కార భోజనమును, 3) పాపము చేయడానికి ముందు త్రిత్వ దేవుడున్నాడు. ఆ ముగ్గురిని తలంచుటకాదు. ఎప్పుడైతే పాపము ప్రవేశించినదో ఈ ఒక్కటైయున్న త్రిత్వము వేర్వేరుగా అయిపోయి మనిషిని రక్షించుటకు మూడు పనులు చేసిన స్థితిని జ్ఞాపకము చేసికొంటూ ఉన్నారు. అలాగుచేసినందున ఎప్పటికైన గొప్ప మహిమ స్థితి లభించును. ఎంత

మహిమ అనగా సిలువెంత గొప్ప మహిమగలదో, అంతరంగ భోజనమెంత గొప్ప మహిమగలదో రక్షణార్థమై ఈ ముగ్గురు వేరగుట ఎంతగొప్ప మహిమగలదో, అంత గొప్ప మహిమ ఆ తలంపు వలన ఎప్పటికైనా లభించును.

యెషయాలోని ఉపమానములో (యెషయా 27:3). తోటమాలి ప్రతి మొక్కకు ప్రతి నిమిషము నీళ్లు పోస్తున్నారు. దానినిబట్టి అయ్యగారి ప్రార్థన ప్రతి మనిషిని, ప్రతి మొక్కను, ప్రతి జంతువును ప్రతి నిమిషము దీవించుము. అన్నియు మరొక క్రొత్త మాట ప్రభువే చెప్పిరట. మనకర్థము కాకపోయినా ప్రతినిమి,ము అంతరంగ సంస్కారము పుచ్చుకొంటున్నారు.

దేవా! నీవు ప్రతి నిమిషము ఇచ్చుచున్నట్లు ప్రతినిమిషము పుచ్చుకొనే శక్తి ప్రార్థన చేయాలి. అయ్యగారన్నారట 3 నెలలు లేక ఒక నెలకొకసారి పుచ్చుకొంటాము, ప్రతినిమిషము ఎక్కడ పుచ్చుకొను అన్నారట. ‘యేసు నీ తలపె నాకు’.

మీరే ఆలాగు పుచ్చుకొనుట మీకే కష్టమైతే యేసు నీ తలపె నాకు అనే పాట ఏలాగు పాడుతున్నారు. నాతలంపు కలిగియుండునుట ద్వార ప్రతి నిమిషము పుచ్చుకొన్నట్టే. ఈ మాట చెప్పినందుకై అధైర్యపడవద్దు ఆ తలంపు కలిగియుంటే పుచ్చుకొన్నట్టే.

ఈ దేవాలయము అన్నదాన సమాజముగా అన్ని వినిపించును. పరలోకములో రెండవరాకడ తరువాత 7 సం॥లు విందు జరుగును. వాటన్నిటికంటే గొప్ప విందు పరలోకములోని విందే. 7 సం॥రాలు విందు రెండవ రాకడకు సిద్ధమైన వారికేగాన మీరందరు ఆ విందుకు తయారుకావలెనని హెచ్చరించుచున్నాము. ఆమేన్.

# 16వ పాఠము

**ప్రార్ధన:-** యేసుప్రభువా! సంస్కార భోజనమునకు సంబందించిన విషయములు ఆలోచించుటకు మాకు తగిన జ్ఞాన శక్తి, అంగీకరించుటకు విశ్వాస శక్తి దయచేయుము. మేము ధ్యానింపనైయున్న వాటి మూలముగా మా ఆత్మ జీవమునకు బలకరమైన సంగతులు దయచేయుము. మాలో ప్రతివారికి ఏదో ఒక వర్తమానము అందించుమని వేడుకొనుచున్నాము.

1కొరింథీ 11:26 మీరు ఈ రొట్టెను తిని ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు.

ప్రియులారా! ఈ దినము భోజన సంస్కారము. ఇప్పుడు వాక్యములో ఉన్నట్లుగా ఆయన వచ్చేవరకు ఆచరించవలెను. ఆయన వచ్చేవరకు ఆచరించవలెను. ఆయన వచ్చేవరకు దీనిని ఆచరించుచు, ఆయన మరణమును ప్రచురించుట మనిషి పుట్టుట ఒక పర్యాయమేగాని భుజించుట అనేక పర్యాయములు జరుగుచుండును.

ఒక విశ్వాసి సంఘములోనికి వచ్చి బాప్తిస్మము కోరినప్పుడు అతడు పునర్జన్మము పొందినాడని చెప్పవచ్చును. బాప్తిస్మము ఒక పర్యాయమే. లోకములో జన్మము ఒక్క పర్యాయము ఎట్లో, సంఘములో ఆత్మ జన్మకు ముంగుర్తు అయిన బాప్తిస్మము కూడ ఒక్క పర్యాయమే. శిశువు పుట్టుట ఒక్క పర్యాయమే గాని పాలు త్రాగుట అనేక పర్యాయములు. అట్లే ప్రభువు భోజనము రాకడ వరకు. జన్మము ఒక్కసారే, బాప్తిస్మముకూడ ఒక్కసారే. భోజనము అనేకసార్లు.

సంస్కారముకూడ అనేకసార్లు. ఇవి పుచ్చుకొనునప్పుడెల్ల ప్రభువు యొక్క మరణము ప్రచురించుదురు. ఎందుకంటే ఆయన తన మరణ సమయమునందే తన శరీరమును మనకు సమర్పించెను. తన మరణములో తన స్వీయ రక్తమును ధారపోసెను. కాబట్టి ఇది తీసికొన్నప్పుడు ఆయన మరణమును ప్రచురించుదుము. అది మనకు సంతోషము మొదటిది ఆయన మరణము జ్ఞాపకము తెచ్చుకొనుట ఇది ఆచరించుట. రెండవది రాకడ. ఆయన వచ్చువరకు దీనిని జ్ఞాపకము ఉంచుకొనవలెను. మరణము తలంచుకొనుచు ప్రభు భోజనము ఆచరించుదము. గనుక ఆయన శ్రమలో, మరణములో, విందులో, ఆయన పునరుత్థానములో పాలివారమైయుందుము, గనుక బల్లయొద్దకు సిద్ధపడకుండా రాకూడదు.

భూలోకములో మూడు స్థితులు ఉన్నవి. పరలోకములో ఒక్క స్థితి మాత్రమే ఉన్నది. 1) మనిషి యొక్క పాప జీవితము ఉన్నది. 2) మనిషియొక్క శరీర జీవనము ఉన్నది. పాప జీవితము మంచిది కాదు గాన దానిని విడచిపెట్టవలసియున్నది. శరీర జీవితము అవసరము గనుక దానిని విడచిపెట్టరాదు. 3) ఆత్మ జీవితము దీనిని విడచిపెట్టరాదు. 1. శరీర జీవితము. 2. ఆత్మ జీవితము. భూమిమీద ఈ రెండును మనకొరకే ఏర్పరచబడియున్నది. గాని పాప జీవితము మనదికాదు. 4) పరలోకములో మనకొక జీవితమున్నది. అది మహిమ జీవితముదానికి వెళ్ళకముందు మనము శరీర జీవితము అనుసరించవలెను. గాని ఆ పాప జీవితము మాత్రమే విడువలెను.

యేసుప్రభువు వచ్చి ఈ శరీర జీవితమును అంతరింప చేయలేదు. గాని ఈ శరీర జీవితములోని అంశము తీసివేయక ఆత్మ

జీవిత అంశము ప్రవేశపెట్టి శరీర జీవితమును బలపర్చెను, మహిమపర్చెను. ఈ అంశములు విశాలమైన దీర్ఘ అంశములు. యేసుప్రభువు వచ్చినప్పుడు శరీర జీవితములో ఏమిచూపెను. భోజనము అంటే అందరికి తెలుసు. ప్రభువు అది కొట్టివేయక ఆత్మ భోజనము ప్రవేశపెట్టెను. యేసుప్రభువు ఈ వేళ మన మధ్యకు వస్తే అన్నం అని అంటారు. గాని రొట్టె అని అనరు. ప్రభువు కాలమునందు రొట్టె, ద్రాక్షరసము ఆహారమైయున్నది. ప్రభువు రొట్టెకు బదులుగా శరీరమును, రక్తమునకు బదులుగా ద్రాక్షరసమును ప్రవేశపెట్టినారు. మనకు సంస్కారపు విందులో చిన్నరొట్టె త్రుంచి యిస్తే కడుపునిండలేదు అని అనము. అది ఎట్లు భోజనము కాగలదు? న్యాయము చొప్పున చూచినగాని అది కడుపునిండేదికాదు. ఇంటివద్ద తినే ఆహారము ఆకలి తీరేదైయున్నది. శరీర జీవితములో మనము భుజించే ఆహారము, శరీరమును, రక్తమును జ్ఞాపకముచేయుచున్నది. శరీర భోజనములో ఆత్మ జీవనము ప్రవేశపెట్టి మనకు శక్తి అనుగ్రహించుచున్నాడు.

అలాగే బాప్తిస్మము అనే స్నానమున్నది. ఈ స్నానములో నెత్తిమీద కొన్ని నీళ్లు పోసినంత మాత్రమున స్నానమగునా? లేకపోతే నీళ్ళలో మునిగినంత మాత్రమున స్నానమగునా? అది నీళ్ళతో తడుపుటయేగాని పూర్తి స్నానముకాదు. ఈ స్వల్పకార్యములనుబట్టి గొప్ప పునర్జీవము మనకు కలుగుటకు ఆత్మ జీవితములో కొనసాగించేదైయున్నది.

తనయొద్ద నున్న జన సమూహామును చూచి మీయొద్ద ఏమి యున్నదని ప్రభువు ప్రజలను అడిగెను. అవి ఐదు రొట్టెలు రెండు చిన్న చేపలు మాత్రమే. అయితే ఆ జనమునకు అవి సరిపోవు. ఆ రొట్టె

అలాగే ఉన్న యెడల అది ఐదుగురికే సరిపోవును. ప్రభువు వాటిని తీసికొనెను గనుక అవి అన్నివేల మందికి సరిపోయినవి. అలాగే గురువు చిన్న రొట్టెలు తీసుకొనెనుగాని అది ఆత్మ జీవనమును సంతుష్ఠి పరచేదినైయున్నది. ఈ స్వల్ప భోజనము వల్ల ఆ భోజనమునకు విలువ వచ్చినది. తక్కిన సమయములలో ఈ రొట్టెకు గాని ద్రాక్షరసమునకు గాని విలువ లేదు. బల్లయొద్ద ఈ స్వల్ప భోజనము ప్రభువు ఇచ్చినప్పుడు అది గొప్పదైయున్నది. యేసుప్రభువు మన శరీర జీవితములో మన ద్వారా ఆయన ఈ లోకములోనికి మనవలె వచ్చెను. 30వ సంవత్సరమునందు మనవలె ఉద్యోగములో ప్రవేశించలేదా? ఆయన ప్రతి అంశమును ఆత్మ జీవనమునకు సమానమైనదిగా చేసెను. మనవలె భోజనము చేసెను. మనవలె నీళ్ళు త్రాగెను.

శరీర జీవనములో జన్మము, ఆత్మజీవనములో పునర్జన్మము.

శరీర జీవనములో ఆహారము, ఆత్మ జీవనములో ప్రభు భోజనము. ఎవరైనా తమ బంధువులు ఉరివేయబడితే ఆ ఉరి కొయ్యవంటిది చేసికొని మెడలో వేసికొనునా? అలాగు ఎవరు చేయరు. అది అసహ్యమైన పని. భోజనము చేయునప్పుడు చావును తలంతురా? అయితే ఇది యేమిటి? యేసుప్రభువు ఈ భోజనము చేయునప్పుడు తన శిష్యులతో నా మరణమును తలంచుకొనుడి అనెను. యేసుప్రభువువలె సంఘము తన సంతోషమునుబట్టి అట్టిది కల్పించుకొన్నది. సంఘస్తులైనవారు తమ మెడలో సిలువ వేసికొనుచున్నారు. అది అసహ్యమైనదిగా దానిని ఎంచలేదు. ఎందుకంటే ఆయన మన పాపమంతయు తనమీద వేసికొన్నాడు గనుక మనము మెడలో సిలువ వేసికొనుటకు సిగ్గుపడము. సిలువను ప్రభువు ఎంత

తేలికగా చేసెనో రొట్టెను, ద్రాక్షారసమును అంత తేలికగా చేసెను. బాప్తిస్మము అనగా జన్మము, రాత్రి భోజనము అనగా పురర్జన్మము.

ఈ రెండు మనకు కావలసినవే. అంతేకాక ప్రభువు సిలువ భరించెను. ఆ సిలువను మనము ఎత్తుకొనుచున్నాము. మనకేమి శ్రమ. ఆయనే మన నిమిత్తమై శ్రమ భరించెను. గనుక మనము సిలువను ధరించుకొనుచున్నాము. ప్రభువు సిలువను మోసెను. సిలువకు అంటగొట్టబడెను. తరువాత మరణము పొందినను జీవించెదననెను గనుక మనకు మరణము లేదు. మనము శాశ్వత జీవనములో ప్రవేశించుటకు ప్రభువు మరణము నొందెను. యేసుప్రభువునుబట్టి ఐదు రొట్టెలు ఐదువేలమందికి సరిపోయినవి. అలాగే రెండు చేపలు 5వేల మందికి సరిపోయినవి. యేసుప్రభువునుబట్టి మనకు మరణము జీవసాధనమైనది. మనము చనిపోయిన తరువాత జీవములోనికి ప్రవేశించెదమని నిరీక్షించవలెను. ఒక ఆయన మరణించేటప్పుడు నూతన యెరూషలేము అని అనెను.

మరణము – శరీర జీవనము

ఆత్మజీవన సాధనము – ఇచ్చునది

గనుక శరీర జీవనములో ఉన్న మూడింటిని ఆత్మ జీవనములో ఉన్న మూడింటిగా మార్చి యేసుప్రభువు మనలను దీవించెను.

మరణము, జీవము, మహిమ జీవితము. శరీర జీవితములో ఎండ, గాలి అన్నియు అనుభవించుచున్నాము. ఇది మంచి జీవితమే. ఈ శరీరము పరలోకమునకు వెళ్ళునప్పుడు మహిమ శరీరముగా మారును. ఇక్కడ ఈ రొట్టెపోయి పరలోకములో ఎన్నటికిని ఆకలిలేని

విందు దొరుకును. క్రొత్త జీవము, క్రొత్త ఆయుష్కాలము అక్కడ ఉండును. ఆత్మ జీవనమే ఎక్కువ గాని దానికంటే మహిమ జీవనము మరెక్కువ. మనము శరీర జీవితములో ఆత్మజీవనమును జ్ఞాపకము చేసికొనవలెను. ఈ ప్రకారముగా ఒకదానికొకటి సంబంధమున్నది. క్రొత్త రూపము మనకు వచ్చును. క్రొత్త శక్తి మనకు వచ్చును.

మనము శుభ్రమైన భోజనము చేసిన అంత శుభ్రముగా మన శరీరము ఉండును. అట్లే మనకెన్ని పర్యాయములు సంతోషముతో ప్రభురాత్రి భోజనము తీసికొనుచు ఉన్నామో అన్ని పర్యాయములు ఆత్మీయ జీవనములో సంతోషించెదము. ఇవన్నియు జ్ఞాపకము చేసికొని ప్రభురాత్రి భోజనము ఆచరించుట మన కర్తవ్యమైయున్నది. అట్టి దీవెన మీకు కలుగునుగాక.

# 17వ పాఠము

## The Cake of Bethlehem

బెత్లెహేము అనగా రొట్టెల ఇల్లు, ఆహారపు ఇల్లు. బెత్లెహేములో పుట్టిన రొట్టె యేసుప్రభువు. క్రిస్మస్ కేక్ ఆయనే. ఈ ఆహారము మనము భుజించుటకే ఆయన వచ్చాడు. ఆయన మనల్ని భుజింపచేయటానికే భూలోకమంతటిలో విశ్వాసులందరు ఆయనను భుజిస్తున్నారు.

**1. రుచిగల ఆహారమైపోయారు:–** కేక్ రుచా? రొట్టె రుచా? రుచిగల ఆహారముగా వచ్చాడు గనుక సంతోషము. క్రిస్మస్ రొట్టె అనరు. ఈ విందునకు వస్తున్నాము గనుక సంతోషముతో ఆయన ఇస్తున్నాడు. నా పిల్లలకు నేను ఆహారమై పోతునన్నారు. అదే ఆయన సంతోషము.

భూలోకములోని కేక్‌లకు రుచిలో తేడా ఉంటుంది. గానీ ఈ కేక్ అన్నిటిని మించిన రుచిగలది, బలకరమైనది. ఆత్మీయ జీవితమునకు కావలసిన అన్ని విటమినులు కల్గిన కేక్, భూలోకములో తయారు చేసినదైతే లోటు ఉంటుంది. కానీ, ఇది పరలోకములో తయారు చేయబడినది. గనుక రుచిలో ఏలోటులేదు. నన్ను తినువాడు జీవముగలవారని పలికెను. నిత్య జీవము గలవారమే. నిత్యము జీవించువారమే. ఈ మహిమ ఆహారము పైలోకమునుండి వచ్చినది. మనలను మహిమకు తయారు చేయుటకు ప్రభువు చుట్టూ మహిమ ఉన్నది. గొర్రెల కాపరుల చుట్టూ ప్రభువు మహిమ ప్రకాశించినది.

పెండ్లికుమార్తెలమైన మనల్ని మహిమతోడ కప్పి మహిమ జీవులనుగా మార్చును.

మహిమ జీవులు అనగా దేవదూతలు. వారిచుట్టూ మహిమ ఉన్నది. పాపము చేయలేదు, అట్టి దేవదూతలనుగా తయారు చేయుటకు ఈ కేక్ వచ్చినది.

రుచికరమైనది కాదా! బలకరమైనది కాదా! నిత్యజీవమునిచ్చేది కాదా? పిల్లలు రొట్టె కొరకు ఎలా ఎదురు చూస్తారో అలాగే నా కొరకు మీరు ఎదురు చూస్తున్నారు గనుక పంచుతానన్నారు. మీ ఆకర్షణ నాతట్టున్నది గనుక నా పిల్లలకు అందిస్తానన్నారు.

**1. మహిమ జీవులుగా రండి:-** మహిమ జీవులుగా మార్చుటకు జనసంఖ్య కాలములో ప్రభువు పుట్టినారు. జీవపు రొట్టెయైన యేసుప్రభువు జీవగ్రంథములో పేరెక్కించుటకు నీలోనికి వెళ్లుచున్నారు. నా అంతరంగములోనికి రండి అని ఆహ్వానించుకొనండి.

1) జీవగ్రంథములో మనపేరెక్కించే కేక్, 2) ప్రజలందరికి సరిపోయిన కేక్ ఆయనే. ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషమునిచ్చే బెత్లెహేము కేక్ ప్రభువు, ఎవ్వరికి లోటులేదు.

3) అంతరంగ సంతోషము, బహిరంగ సంతోషము నిచ్చే కేక్. నన్ను భుజించినవారికి చావులేదు. జీవములో ప్రవేశించారు. అసలైన జీవితము జీవించుట ప్రారంభించారు. పాపము చేయుటకు వీలులేదు. దానికి పూర్తి అంతం. వారు మహిమ జీవులు, దూతలకు చావులేదు జీవించేవున్నారు. నూతన జీవితములోనికి ప్రవేశ పెట్టబడినారు. నూతన కేక్ తిన్నవారికి మహా సంతోషము. ఆయనలో లోటులేదు. మాదేలోటు. ఆటంకాలు తీసివేసికొనండి. అనుమానాలు తీసివేసికొనండి. ప్రభువు నాకీదినమున ఆ రుచికరమైనది, ఆ బలకరమైనది, ఆ మహా సంతోషకరమైనది, నా ప్రభువు నాకిస్తున్నారు.

శరీరసంబంధమైన సంతోషము కాదు. శరీర శక్తులను జయించండి. షెకీనా మేఘమునకు సిద్ధపడండి.

**4) దేవునికిష్టులైనవారినిగా చేసే కేక్:-** లూకా 2వ అధ్యాయము. ఎవరు ఈయనను అంగీకరించలేదో వారు ఆయనకు విరోధులే! మనల్ని, పాపముచేసిన వారిని, విరోధులైనవారిని, ఆయనకిష్టులైన వారినిగా ఈ కేక్ చేస్తుంది. మహిమతో తయారు చేయబడినది. సంపూర్ణమైనవారినిగా, ఆయనకిష్టులైన వారినిగా చేయును. ఆయనకిష్టులైన మందలోచేరి మేఘమునకు సిద్ధపడండి. నేను అయోగ్యురాలను, నీ కృపవలన నన్ను భుజింపనిమ్ము అని చేరండి. ఈ కేక్ పరలోకమునకు, భూలోకమునకు సమాధానమిచ్చే కేక్. నిజముగా ఈ దినమున నేను కేక్ తింటున్నాను. ఆయనే క్రిస్మస్ కేక్ వడ్డించేది ఆయనే.

సమాధానమిచ్చుటకు వచ్చిన కేక్ మీ కుటుంబములలో సమాధానమిచ్చును గాక! ఆమేన్. ఆదరించుటకు వచ్చిన కేక్ మిమ్ములను ఆదరించును గాక! ఆమేన్. నష్టపోయిన మిమ్మును మహిమతో నింపి పరలోకము నుండి మీ నష్టమును తీర్చునుగాక! ఆమేన్. ప్రభువు రూపమును, శుద్ధిని, పెండ్లి కళనిచ్చి మహిమ వధువుగా సిద్ధపరచునుగాక! ఆమేన్.

Bible Mission HQ Guntur

# 18వ పాఠము

**యేసుప్రభువు చెప్పెను "జీవాహారమును నేనే" యోహాను 6:35.**

ఈ రొట్టె అధ్యాయములో యోహాను 6వ అధ్యాయము (The Bread Chapter). ప్రభువు ఆయనే అసలైన ఆహారమైయున్నారని నిత్య జీవము నిచ్చు ఆహారము ఆయనే అని వివరము బోధించెను. ఆయనే అక్షయ ఆహారమని కూడ వినిపించును. క్షయమగు ఆహారము కొరకు కష్టపడకండి అక్షయ ఆహారము కొరకు పాటుపడండి అని చెప్పెను. ఇదే నిజమైన ఆహారమనికూడ మరియొక నామము. ఈ ఆహారమును ఆయనే పెట్టెను. భూలోక జీవితము కొరకు తినే ఆహారములన్ని క్షయమైనవే నశించిపోవునని రాబోవు పరలోక జీవితము, భూలోక జీవితము కలిగియున్నాముగాని రెండవ బ్రతుకులేదు. వీటినే మామూలు జీవితము, అంతరంగ జీవితము అనికూడ అంటారు. రెండు జీవితములు కలిగినవారు ప్రభువును కలిగియున్నారు. ఒక్క జీవితము అనగా భూలోక జీవితమున్నవారు బ్రతికి ఉన్నను చచ్చినవారే. జీవించి ఉన్నను మృతులే. బహిరంగ జీవితము, అంతరంగ జీవితము. ఈలోకములోనే రాబోయే జీవితము పరలోకములో, దీనికొరకు సిద్ధపడుట, రాబోవు జీవితము కొరకు ప్రయాసపడుట గలిగియున్నారా? మన ప్రయాసమంతా లోకజీవనము కొరకే. శరీర జీవితము, బహిరంగ జీవితము కొరకే అనగా పొట్టకొరకే. ఎంత ప్రయాసపడుచున్నాము? అంతరంగ జీవితము కొరకు పిల్లలను ఏ పాఠశాలలకు, యే కళాశాలలకు పంపుచున్నారు? ఈ జీవితము ఆ నిత్యజీవితములోనికి వెళ్ళేది. ఆ జీవితము శాశ్వతమైనది. మీ ప్రయాసమునకు ప్రతిఫలము లేకుండా చేయరు. నిరాశపడకండి. నిత్య జీవితమునకుకూడ మీ పిల్లలను తయారు

చేయండి. ఇది తల్లిదండ్రుల బాధ్యత. దేవుడు మనకు బహుమానములుగా మనకిచ్చిన పిల్లలను ఎలా పెంచుచున్నాము? ఆత్మీయ జీవనము, నిత్యజీవమునకు తయారు కాకుండ సాతాను ఆటంకములు కలిగించుచున్నది. దేవుడు ఊరుకొనడు. శ్రమల గుండములోనికి దింపి "దైవభక్తి" అనే భూలోకమునకు పరలోకమునకు పనికివచ్చు విద్యనేర్పగలరని పౌలు వ్రాయుచున్నాడు. ఈ విధి కొరకు పిల్లల విషయములో ప్రభువును ఆశ్రయించండి. భూలోకములో మంచి విద్యనిచ్చి ఆత్మీయముగ నరకమునకు మీ పిల్లలను పంపించుట న్యాయమేనా? రాబోవు మహిమ జీవితము, అంతరంగ జీవితము, బహిరంగ జీవితము రెండును బాగున్నవి. ప్రభువును ప్రేమించినాడు, గౌరవించినాడు. రెండు జీవితములను బాగుగా కాపాడుకొన్నాడు. గనుక చివరి సింహాసనమెక్కినారు. తనవారందరిని, ఇతరులను రక్షించెను. ఈలాగున్నారా? 2) దానియేలు: రెండు జీవితములు బాగున్నవి. ఎల్లప్పుడు ప్రభువు మిమ్ములను శ్రమలో నుంచడు. ఈలోకములో, పైలోకములో నడిపించు ప్రభువును సంపాదించు కుందాము అన్ని జీవులకు జీవమునిచ్చే జీవాహారమైన ప్రభువును అందుకొనుట ఏలాగు? 1) వాక్యాహారముద్వారా 2) ప్రార్థనాహారము ద్వారా 3) ధ్యానాహారముద్వారా 4) గానాహారముద్వారా 5) సన్నిధి ఆహారముద్వారా 6) అనుభవ ఆహారముద్వారా 7) ప్రభువిచ్చు సంస్కారాహారము ద్వారా.

**1. వాక్యాహారము:-** యేసుప్రభువే వాక్యము. బైబిలులో ఆయన మాటలున్నవి. ఆయనే ఆహారము గనుక అందుచున్నారు. చదువుటవలన, వినుటవలన, ఇతరులకు వినిపించుటవలన, ఈ ఆహారము అందుకొనగలము.

**2. ప్రార్థనాహారము:–** అన్ని చిన్న పనులు ప్రభువుతో చెప్పుకొనుట, ఆయనతో పరిచయముగా మాట్లాడుట, స్వంతజీవితము కొరకు, సృష్టి అంతటికొరకు చిన్న పనులు చేయుటద్వారా జీవాహారము నందుకొనగలము.

**3. ధ్యానాహారము:–** దేవునిని ధ్యానించుట, ఆయన తలంపుతోనే నిశ్శబ్దముగా తలంచుట. ప్రభువు కనబడువరకు, మాట్లాడువరకు కనిపెట్టుకొని యుండుటద్వారా జీవాహారమైయున్న ప్రభువును అందుకొనగలము.

**4. గానాహారము:–** దైవసంకీర్తనము చేయుటద్వారా బలము నందుకొనగలము. శ్రమలలో కీర్తనలు పాడిన సంతోషము, బలము కలుగును. పౌలుసీల రక్తములు కారుచుండగా కీర్తనలు పాడి జయముపొందిరి. ఇదే జీవాహారము నందుకొనుట.

**5. దైవసన్నిధాహారము:–** ప్రభువుతో సహవాసములోనుండుట, రూపమును అద్దుకొనుట. అలాగే ప్రభువు తన రూపమును మనలో అద్దుట జరుగును. కోడిగ్రుడ్లు తల్లి క్రిందనుండి అవయవములను బ్రతుకును అందుకొను నట్టి అంతస్థు. ఇక్కడ విశ్వాసి ప్రభువు రూపమునకు మారును. రాకడకు సిద్ధపడును. ఇది జీవాహారమైన ప్రభువునందుకొనుటే.

**6. అనుభవాహారము:–** పై వాటన్నిటివలన జీవాహారము నందుకొననందున అనుభవము సంపాదించుకొనగలము. ఈ అనుభవము వలన ఆటంకములను జయించు శక్తి, శ్రమలను జయించు బలముతో రాకడకు ఆయత్తపడుదుము. సాతానుకూడ వచ్చును. మన పాపజీవితము చూపించును. అనుదినము భుజించుటద్వారా

జీవాహారమును అనగా ప్రభువు నందుకొని నిత్య జీవనమునకు ఆయత్తపడగలము.

**7. ప్రభు సంస్కార భోజనము:–** పై వాటన్నిటిని మరుగుగా/ రహస్యముగా మనలోనికి వెళ్లుట. ఇక్కడ బహిరంగముగ శరీర రక్తములద్వారా ప్రవేశించుట (మనలో) యోగ్యముగా తీసికొనువారిలోనికి బహిరంగముగా వెళ్లుట అనే పని ప్రభువు చేయును. అయోగ్యత అనగా అపవిత్రత, అవిశ్వాసము, నామకార్థము అలవాటు ఇవి వద్దు. యోగ్యత అనగా పరిశుద్ధత, విశ్వాసము, నూతన ఉత్సాహము. విందు అంటే సంతోషముగదా! బలమునకు సరిపడు ఆహారపదార్థములన్ని ఇందుగలవు. దీనిలో అంతరంగ సంస్కారముకూడ గలదు. అనగా సంఘనాయకులు, పాస్టర్లు ఇచ్చు రొట్టె ద్రాక్షారసములు కాకుండా ప్రభువే స్వయముగా తన శరీర రక్తములు విశ్వాసులకిచ్చును. ప్రభువు పాద సన్నిధిలో నుండువారికి ప్రభువిచ్చు విందు. ప్రభువిచ్చు ఈ గొప్ప అనుభవము కొరకు ఓపికతో ఆయన పాదములయొద్ద కనిపెట్టండి. "నైజపాపములు నశియించుటకే భోజనము వడ్డించును – రాజే స్వయముగా దేవరాజే స్వయముగా" గనుక నాకేమి కొదువ. ఇక జీవించువాడను నేనుకాదు అన్న అపోస్తులుడైన పౌలు అనుభవము సంపాదించుకొని రాకడకు ఆయత్తపడి రాకడ మేఘము చేరుదుముగాక.

# 19వ పాఠము

**వరుని మహిమ:-** 1) రాకడ కొరకు నిరీక్షించుచున్న విశ్వాసులారా! రాకడకొరకు విశ్వసించుచున్నవారు. పైకి మేఘములోకి ఎందుకు? బలము పొందే నిమిత్తము. దైవ వాక్యపఠన చేయవలసి యున్నది. ఎవరు వాక్యపఠన చేయగలరో దాని ప్రకారము నడుచుకొనగలరో వారే మేఘముమీద ఎగిరి వెళ్ళగలరు. అట్టివారు ముందుగా దైవగ్రంథములోని సంగతులు బాగా చదివి విని, ధ్యానించి నడుపవలెను.

ఉదా:- అందరము తినవలసిన ఆహారము తినేవారు నడువగలరు. తిండిమానితే నడువలేరు. అలాగే మనముకూడా వాక్యాహారము వల్ల మేఘము లోనికి ఎగిరేశక్తి పొందగలము.

2. మరియొకటి మనకు కావలెను. అది ప్రభు భోజనము. ఈ భోజనము గురించి కొన్ని సంగతులు జ్ఞాపకము చేయుదును. ఈవేళ నేను మీకు చెప్పే అంశము ప్రభువు యొక్క బల్ల సిద్ధముగా యున్నది. ప్రసంగముయొక్క ఆరంభము నుండి అంతము వరకు ఇదే మనస్సులో జ్ఞాపకముంచుకొనండి. మనము సిద్ధముగా ఉన్న లేకపోయిన ప్రభువుబల్ల మాత్రమే మనకు సిద్ధముగా నున్నది. మనము జ్ఞాపకముంచుకొనవలసిన అంశము ఇదే. మనము సిద్ధముగా నున్నాము అనేది వచ్చే ఆదివారము అనగా ప్రభుభోజనము పుచ్చుకొనుటకు ముందు మాత్రమే కాదు.

**1) మొదటి బల్ల:** ప్రభువు బల్ల సిద్ధముగా నున్నదని చెప్పకముందు నేనుకొన్ని సంగతులు జ్ఞాపకము చేయుదును.

లోకమంతటికి ఒక బల్ల, ఇశ్రాయేలీయులకు ఒక బల్ల. లోకమంతటికి నీ వెలుపట ఒక బల్ల అనగా సృష్టి, వెలుగు, గాలి, ఆకాశము మొదలగునవి.

**2) రెండవ బల్ల :** ప్రభువు యూదులకొరకు అరణ్యములో 10 సం॥ల క్రిందట వేసిన బల్ల. దేవుడు వారికి కావలసిన ఆహారము నిర్గమ 16వ అధ్యాయములో ఇచ్చెను. గాలిలో మంచి ఆహారము ఆ బల్లమీదకు వచ్చినది. కొండలోనుండి ఆహారము వచ్చినది. ఆకాశములోనుండి ఆహారము వచ్చినది. ఆ బల్లమీదకి కొండలోనుండి అనగా భూమిలోనుండి ఆహారము వచ్చినది. ఇది ఇశ్రాయేలీయులకు ఏర్పరచిన బల్ల. ఇది ప్రత్యేకముగా ఇశ్రాయేలీయులకే.

**3) మూడవ బల్ల :** ఈ బల్ల మత్తయి 22; లూకా 14వ అధ్యాయములోను ఉన్నది. యేసుప్రభువు దానిపేరు చెప్పకుండ దాని తీరు మాత్రమే చెప్పెను. ఆయన ఏ సందర్భములో చెప్పెను? దేవుని రాజ్యములో భోజనంచేసే వారు ధన్యులని ఒకరు అనగా, దానికి యేసుప్రభువు ఇచ్చిన జవాబు దేవుని రాజ్యమును, భోజనమును చేసేవారును ధన్యులు. ఈ మూడింటికి అర్థము కొంత అతనికి తెలిసెను ఇదే మూడవ బల్ల.

ఉదా:- ఒక ధర్మాధికారి యుండెను. ఆయన నా సంతర్పణకు అందరు రండి అని ఒక కబురు పంపెను. కొంతమంది వచ్చిరి కొంతమంది రాలేదు. చివరకు ఆయన అన్నారు. వివరములేకుండా అందరిని పిలవండి అన్నాడు. గ్రుడ్డివారిని, కుంటివారిని, అంగహీనులను, అందరిని పిలవండి అన్నారు. రండి భుజించుడి అనెను. వీధులలో అక్కడ జబ్బుగలవారు, చిక్కుగలవారు, భిక్షకులు ఉంటారు. వారిని తీసికొని రండి. ఊరిబయట, కంచెలనుండేవారు, వారిని

తీసికొని రండి. రాజబాటలలో ఉండేవారు, ప్రయాణీకులు, కంచెలలో ఉండేవారు, గజ దొంగలలో ప్రసిద్ధికెక్కినవారు అన్నిటికి ఫర్వాలేదు అనెను. అందరు నా భోజనము తినాలి అని మత్తయి 22:2-10; లూకా 14:16-24లో ప్రభువు చెప్పెను. ఇది దేనికి గుర్తు అనగా ప్రభువు ఈలోకములో సిద్ధపరచిన రక్షణ మహాభాగ్యము. లేక రక్షణ బల్ల. ప్రయాణీకులు రావాలి ఎందుకంటే ప్రయాణం ముఖ్యముకాదు. మహారక్షణ భాగ్యము గొప్ప విందు. అది లోకాంతమువరకుండును. కాబట్టి ఆ బల్ల, అది తీసివేయబడదు.

మరియొక బల్ల దావీదు 23వ కీర్తనలో ఉన్నది. యెహోవా నాకాపరి అని నమ్మేవారికే. అది పచ్చికగలచోట్ల ఆయన నన్ను పరుండజేయును అనే వారికే. అది తన నామమునుబట్టి నీతిమార్గములో నన్ను నడిపించుచున్నాడను వారికే. ఆ బల్ల గాఢాంధకారపు లోయలలో నేను సంచరించినను, ఏ అపాయమునకు భయపడను అనువారికే ఆ బల్ల. నేను బ్రతుకు దినములన్నియు, కృపా క్షేమములే, నావెంట వచ్చును అని చెప్పువారికే ఆ బల్ల. అది నమ్మేవారికే ఆ బల్ల అది దావీదు కీర్తనలో మాత్రమే కనబడుచున్నది. ఏమంటే నీవు నా శత్రువుల యెదుట భోజన బల్ల సిద్ధపరచుదువు. ఇది వీధులలో ఉండే వారికే కాదుగా కేవలము ప్రభువు యొద్దకు వచ్చేవారికే ఈ బల్ల.

**4. విశ్వాసులకొక బల్ల:-** సంతుష్టి బల్ల. రక్షణ పొందేవారు ఆ మాట అంటారు. నీళ్ళు తక్కువైనా బియ్యము తక్కువైనా తక్కువ అని అనరు. అది వారికే లెక్కలేదు. మాకు కొదువలేదు అంటారు. అయితే నరులకు బల్ల ఒకటి పరలోకములో సిద్ధమగుచున్నది. ఇప్పుడు మనకు భూలోకములో అదికాదు ప్రపంచములో కాదు. అది రక్షణ బల్ల అందరికి గృహములోకాదు అది సంతుష్టిబల్ల. సంఘములో కాదు

సంఘ బల్ల అందరికికాదు నా పాఠమేమంటే, ప్రభువు బల్ల సిద్ధముగా నున్నది. నీవు వచ్చినను రాకున్నను సరే అది సిద్ధముగానున్నది. మిషనెరీ బట్లర్ ఏమిచేయును? అంతా సిద్ధముచేసి గంట వాయించును. అలాగే యేసుప్రభువు ఈ బల్ల సిద్ధము చేయించెను.

1) దీనిమీద కనబడే రొట్టె ఉన్నది : బోధకుడు సిద్ధపరచినది.

2) దీనిమీద కనబడే ద్రాక్షారసమున్నది : బోధకునిద్వారా సిద్ధపరచబడినది

3) దీనిమీద కనబడే విశ్వాసి ఉన్నాడు: మోకాళ్లూని

4) రొట్టె వెనుక యేసుప్రభువుయొక్క శరీరమున్నది. ద్రాక్షారసము వెనుక యేసుప్రభువు యొక్క అమూల్యమైన ప్రాణ రక్తమున్నది.

బల్ల వెనుక యేసుప్రభువుయొక్క పై రెండును కనబడునవి కావు, యేసుప్రభువే ఉన్నాడు.

5) ఇక్కడ యేసుప్రభువు ఉన్నాడు. ఆయనకు కనబడడు, ఇది కనబడడం లేదు ఇది కనబడడంలేదని విశ్వాసి చింతపడడు అతడు ఆత్మ నేత్రములతో చూచును. యేసుప్రభువు దేనిలో కనబడ్డారు? శరీర నేత్రములకు బోధకునికి కనబడెను గాని అవిశ్వాసికి కనబడడు గనుక హేళనచేయును. ఇంత దివ్యమైన భోజనం అనుభవించే విశ్వాసికి ఆ హేళన ఎందుకు? శరీర నేత్రములకు కూడా హేళనే. అవిశ్వాసికి ఆ హేళన ఎందుకు? తన తలంపు ఏమంటే యేసుప్రభువే ఇక్కడున్నాడు అనుకొనును. అది ఎప్పుడు సిద్ధముగా నున్నది. అది సోమవారమునాడే, మంగళవారము కూడా. బుధవారము, మరీ సిద్ధముగా నున్నది. ప్రభువు ఆనాడే అది మనకు తయారు చేసి యుండెను. శనివారము ఎందుకంటే

ఆయన ఆదివారము కొరకు సిద్ధపడుచున్న దినము. శనివారము గనుక శనివారముకూడా సిద్ధముగానున్నది. ఆదివారము అయితే అసలే సిద్ధముగా ఉన్నది. గనుక ఎప్పుడైనా సరే. ప్రభువుబల్ల ప్రతిరోజూ సిద్ధముగా నున్నది. పగలు సిద్ధముగానున్నది, రాత్రి, ఉదయం, సాయంకాలము, సోమవారమునుండి ఆదివారము వరకు సిద్ధముగానున్నది. సంవత్సరము పొడుగునా సిద్ధముగానున్నది. అది తీసివేయబడదు. ఎప్పుడో 2వేల సం॥ముల క్రిందట వేయబడిన బల్ల వేయబడియున్నది. బల్ల తీసివేస్తే సంఘము కూడా తీసివేయబడవలసినదని సాధు సుందరసింగు అన్నారు. ఇచ్చేవారుంటే ప్రతిరోజు నేను ప్రభు భోజనము తీసికొంటాను అనెను. తిన్నా తినకపోయిన ప్రభువు బల్ల సిద్ధముగానేయున్నది. అయితే ప్రభువు బల్ల సిద్ధపర్చేదెవరు? ఆ ధనికుడు ఎంత గొప్పవాడు కాకపోతే అందరిని పిలుచును? అని ప్రజలు అనుకొన్నారు. ఈ బల్ల సిద్ధపరచినవాడు యేసుప్రభువు గనుక మనము తప్పకుండా శ్లాఘించవలెను యోహాను 15:13లో ఏమున్నది? ఒక స్నేహితుడు ఒక స్నేహితుని కొరకు ప్రాణమిచ్చుట కంటే గొప్పదేది? ప్రభువు తన శరీరము ఈ బల్ల రక్తము జీవము అని ఉన్నది. ఆయన తన ప్రాణము అర్పించెను గనుక అది మహా విలువైన భోజన సంస్కారము. ప్రభువు ఈ కొద్ది మాటలను దీవించునుగాక!

# 20వ పాఠము

**దా.కీర్త. 150:2; మత్త 26:27,28; 1కొరింథీ 11:23-28**

మనము అనేకమైన మర్మముల యెదుట ఉన్నాము 1) సూర్యచంద్ర, నక్షత్రాదులు ఆకాశమందున్నవి. అవి క్రిందపడకుండ ఎట్లు ఉంటున్నవో మనకు తెలియదు. అదొక మర్మము. 2) దేవుడు మనిషిగా జన్మించుట అది ఒక మర్మము 3) సర్వలోక పాపపరిహారార్థమై సిలువపై మరణము పొందుట, అది ఒక మర్మము 4) దేవుడేలాగు మరణము కాగలడు? 5) సమాధి చేయబడుట ఒక మర్మము 6) పునరుత్థానమగుట 7) గాలిలో పరలోకానికి వెళ్ళుట. అదియొక మర్మము. ఇన్ని మర్మముల యెదుటను ఇంకా అనేకమైన మర్మముల యెదుటను మనము నిలువబడియున్నాము.

అలాగుననే యేసుప్రభువు తన శరీర రక్తములను ఏలాగు ఇస్తారో అదియును గొప్ప మర్మము. అయినను తక్కిన మర్మములు మనము నమ్ముచున్నట్లు ఈ మర్మమునుకూడా నమ్మితీరాలి. ఇట్లు నమ్మిన యెడల ఈ సంస్కార భోజనము వలన గొప్ప మేలు పొందగలము.

ఈ ఉదయం అయ్యగారు నాలుగు విషయములు మాత్రమే జ్ఞాపకము చేస్తున్నారు. ఆ నాలుగు ప్రభు భోజన సంస్కార చరిత్ర నుండి బైటికి తీసిన విషయాలు.

1. 11మంది శిష్యులు ఒక్క సంఘముగా ఏర్పడి (ఎ) ఏ విధమైన భేదాభిప్రాయములు (బి) విరోధములు (సి) ఏవిధమైన ప్రశ్నలుకూడా లేకుండా ఏక సంఘమై సంస్కారమును తీసికొన్నారు.

తక్కిన దినాలలో వారును, ప్రభువుపై ప్రశ్నలు వేసినా, సంస్కార సమయములో ఏ ప్రశ్నలేకుండా చూచుకొన్నారు.

2. 11మందికి పాదాలు కడుగునప్పుడు ఎందుకని ఒక్కరన్నారు గాని, భోజనమప్పుడు ఒక్క ప్రశ్నరాలేదు. ప్రభువుతో పదకొండుమంది ఒకే స్థితిలో ఏకీభవించిరి.

యేసయ్య దీవించి, వారికి నా శరీరమని రొట్టె ఇచ్చినప్పుడు ఈ రొట్టె శరీరామేలాగైనదని ప్రశ్నించవలసింది. శరీరముగా ఈ రొట్టె ఏలాగు అందుచున్నదని ప్రశ్నించలేదు. గనుక ప్రభువుతో ఏకమైనారు. వారిలో వారైనా, ఒకరిపై ప్రశ్నలు వేసికోలేదు. 11మంది ఏకమైనారు. 11మంది ప్రభువుతో ఏకమైనారు. 11 మంది రొట్టెతో ఏకమైనారు. 11మంది సహవాసముతోను, సంఘముతోను, ఏకమైనారు వారే ఆదిసంఘము ఒక్కటైపోయిరి.

ద్రాక్షారసము రక్తమేలాగైనదని ప్రశ్నించలేదు. రక్తమేలాగు త్రాగము అని అసహ్యించుకొనలేదు. గనుక ద్రాక్షరసము విషయములోను 11 మంది ఏకమైరి వారు ప్రభువుతో ఏకమైరి.

లెక్కకు 11 మంది గాని ఇంకొక లెక్కకు ఒక్కటే సంఘము. రొట్టె ఒక్కటే దానిని విరిచి 11 ముక్కలుచేసి 11 మందికి ఇచ్చిరి. అనగా ఆ రొట్టెముక్కలు లెక్కకు 11 గాని, రొట్టె ఒక్కటే. అలాగే మనుష్యుల లెక్కకు వారు 11 మందేగాని, లెక్కకు ఒక్కటే సంఘము.

ద్రాక్షరసము 11 మందికి ఇచ్చిరి. 11 గుక్కలు అయినవి. లెక్కకు 11 గుక్కలుగాని, ఒక్క పాత్రలోనివే. ఒక వరుసకు ఒక లెక్క. 11 ముక్కలు. మరల 11 మంది మనుష్యులు గుక్కలు 11. మూడు

పదకొండ్లు ఒక వరుస. ఇంకొక లెక్కలో, ఎ) సంఘము ఒక్కటే బి) పాత్ర ఒక్కటే సి) రొట్టె ఒక్కటే, డి) గురువు ఒక్కడే.

11 మంది ఎగుడు దిగుడు లేకుండా సమానముగానున్నారు. ఒక్కప్పుడు ఈ 11 మంది మనలో ఎవరు గొప్పని ప్రశ్నించుకున్నారు గాని ఇక్కడ ప్రశ్నయేలేదు. అంతకుముందు మనలో ప్రభువు అప్పగించేదెవరిని సైగలు చేసికొన్నారు. ఇక్కడ సైగలేదు, ఎప్పుడిస్తారా తిందామనే ధ్యానముతోనే ఉన్నారు. వేరొక తలంపే లేదు. ఆ రెండు ఏమి ప్రశ్నలు లేకుండా పుచ్చుకొన్నారు. నమ్మకటలోను ప్రశ్నలేదు ఆయన మాటలన్నీ నమ్మిరి.

శిష్యుల దృష్టిలో ప్రభువు ఒక్కరే ఉన్నది. వేరొకటిలేదు. ప్రభువు ఇచ్చు రొట్టె, ద్రాక్షారసమేగాని, ఇంటివద్ద రొట్టెగాని, బజారు ద్రాక్షారసముగాని, వారి మనుస్సులో లేదు. 11 మందికి ఒకరిని గూర్చి ఒకరికి తలంపేగాని ఇంకెవ్వరులేరు. 12వ వాని తలంపే వారికి లేదు. ఈ ప్రకారముగా (1) ద్రాక్షారసము (2) సంఘము (3) రొట్టె, (4) యేసు ప్రభువు ఈ నాలుగు ఒక్కటే! ఒక్కమాట, ఒక్కపని, ఒక్క ఆచారము. ఎ) ఒక్క ఇష్టముమీద బి) ఒక్క విశ్వాసముమీద, సి) ఒక్క సంతోషముమీదే సంస్కారము గడిచిపోయింది. ఇట్టిది లోకములో ఇంకొకసారి జరుగుట ఎన్నడు లేదు. "అది అసాధ్యము" ఎప్పుడైన జరిగినదేమో మనకు తెలియదు.

ప్రస్తుతము ప్రపంచములోని సంఘమును పరీక్షిస్తే జరుగుటలేదు. అప్పుడు 11 మందే సంఘము. ఇప్పుడు 80 కోట్లు. ఇంత పెద్ద సంఘము ఏ మతములోనులేదు. యేసుప్రభువు జీవముగలవాడు గాన, ఆయన సంఘము జీవము గలదైయున్నది.

11మంది విశ్వాసముగలవారైయున్నారు.
11మంది ఐకమత్యము గలవారు.
11మంది సమాధానము గలవారు.

11మంది సంతోషము గలవారు. మరల ప్రశ్నించని నమ్మిక 80 కోట్ల సంఘమున్నా ఇప్పుడుండుట కష్టము. అసాధ్యము అని నేను చెప్పుచుండగా విన్న మీరు పౌరుషము తెచ్చుకొని, 11మందికంటే గట్టిగా ఉండవచ్చు. గుంటూరులోనైనా, మన గుడిలో ఉన్నవారైనా, గట్టిగా ఉండవచ్చును. ఈ గుడిలోని వారైనా పౌరుషమును తెచ్చుకొని ఉంటే మంచిది. ఈ ప్రసంగము అచ్చువేసి లోకమంతా పంచితే 11 మందేనా? మేమెందుకు గట్టిగా ఉండలేమని అంటే ఈ కాలపు సంఘము 11 మంది సంఘముతో ఏకమైపోతారు.

లూథరన్, బాప్టిస్టులున్నారు. వీరు వారి దగ్గర, వారు వీరి దగ్గర సంస్కారము, బాప్తిస్మములు తీసుకొనరు. చర్చి మిషను వారి దగ్గర తీసికొనరు. మిషను, మిషను కలిసి తీసికోడానికి ఇష్టపడకపోతే 11 మందివలె ఏలాగుండగలరు?

వివాహమప్పుడు వారు వీరిని, వీరు వారిని పుచ్చుకొంటారు గాని సంస్కారము ఒక్క దగ్గర పుచ్చుకోరు. నేటి వరకు ఆ 11 మందితో సమానమైన స్థితి గలవారెవ్వరునులేరు. అయితే ఈ సంగతి 80 కోట్ల క్రైస్తవులకు అందిస్తాము. రోమన్ కథోలిక్కువారు, ప్రొటస్టాంటులతో కలిసి తీసికోరు. సెవెంత్‌డే వారు, పెంతెకొస్తువారితో కలిసి తీసికోరు. భూమిమీద ఉన్న సంఘాలు గలిబిలిగా ఉన్నవి. సంస్కారములోనే కలవకపోతే పరలోకములో 7సం॥రాల పెండ్లి విందులో ఏకీభవించి మరుస్తారా? ప్రపంచములోని అన్ని శాఖలు అన్ని మిషనులవారు అక్కడుండాలి.

ఒక్క సంఘములోనే సాతాను విరోధము పెట్టగా ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. ఒకరిమీద ఒకరు ఎ) చాడీలు బి) లేనిపోని మాటలు కల్పిస్తారు. తమ విరోధులతో మాట్లాడ లేనివారు ఇక్కడకు, బల్ల దగ్గరకు సంస్కారము కొరకు ఏలాగు వస్తారు? 7సం॥రాల విందుకేలాగు వెళ్తారు? ప్రభు బోజన సమయమప్పుడెల్లా చెప్పిన మాటలున్ను, ఈవేళ చెప్పినవి కలిపిన ఎన్నిమాటలు! ఎంత పొడుగైనా మాటలు, ఇక ముందుకు చెప్పేవికూడా కలిపితే ఇంకా పొడుగగును. ఈ సారి సంస్కారము రాకడ వరకు మాత్రమే సాగుచుండును. అన్ని మిషనులవారి ప్రసంగాలు ఈవాలులోనే కలుపండి ఎంత పొడుగవునో?

రాజమండ్రిలో వృద్ధులైన దొరగారు సంస్కార సమయములో ఇప్పుడు మీరు సమాధానపడకపోతే అక్కడ ఏలాగు సమాధాన పడగలరు? అని గద్దించేవారట.

1) ప్రభువుతో, 2) సంఘముతో 3) రొట్టెతో, 4) ద్రాక్షారసముతో, 5) ఒక్కటై వారివలె ఉండేవారు. ఇటువంటివారే ఈ భోజనానికి తప్పకుండా రండి. ఈ కొద్ది మాటలను దీవించి మీ ఆత్మలకు మేలుకరముగా అందించునుగాక! ఆమేన్.

# 21వ పాఠము

**" విందు – పొందు – సందు – మందు – బందు " ఎస్తేరు 5:3.**

1. ఈ భాగములో ప్రియురాలియొక్క విలువైన విందును చూస్తున్నాము, 2. ఈ విందు రాజుగారికి పొందునిచ్చింది. 3. ఈ పొందువలన పనిచేయడానికి సందు దొరికింది. 4. ఈ సందులో సాతాను బందు అయినది.

**ఎస్తేరు గ్రంథములో 3 విందులున్నవి.**

1) అహష్వేరోషు రాజుగారి విందు, 2) ఎస్తేరు విందు, 3) హామాను విందు.

నిరంతర యాజకుడైన మెల్కీసెదెకును భుజించుటకు వచ్చిన దేవుని పిల్లలారా! దేవుని కుమారుని పోలియున్న వాని శరీరమును తినుటకు వచ్చిన దేవుని పిల్లలారా! నిరంతర మెలా సరిపోతారు? ఈయన "తరుగడు" ఈ నిరంతరముండే ఆయనను ఎంత తిన్నా, ఎన్నిసార్లు తినినా తరుగడు. ఆయన నడిపించే గొర్రెపిల్లలలో చేరండి. "The orphan lamb" ఈ ఎస్తేరు దిక్కులేని గొర్రెపిల్ల. దిక్కులేదుగాని 127 సంస్థానాలకు రాణి అయినది. అధికారియై పరిపాలించిన గొర్రె. నా అంతటి గొప్పవారు లేరని చూపించుటకు 6 నెలలు విందు చేసారు అహష్వేరోషు రాజుగారు. ఇది లోకస్తులయొక్క విందు. ఈ విందు ఆయనకు సందు అయినది. ఈ విందు నాధారము చేసికొని వష్తిని రాణిగా తగవని బయటకు పంపివేసి ఎస్తేరును లోనికి రప్పించారు.

ఇది నా ప్రాణప్రియుడు నన్ను తన ప్రియురాలుగా చేసికొనుటకు చేసికొన్న సందు. ఈ అనాథ గొర్రెని అన్నీ ఉన్న గొర్రెపిల్లగా

చేయుటే నా ప్రాణప్రియుని చిత్తము. కాబట్టి నా ప్రాణప్రియుని చిత్తము నెరవేర్చుకొనుటకు సందు చేసుకొన్నారు. మరి మన ప్రాణప్రియుని చిత్తము నెరవేర్చుటకు ఎన్ని ఇబ్బందులున్నా మనము సందు చేసికొనవద్దా! పొందు కోరి వచ్చిన ప్రాణ ప్రియునికి సందు చేసికొని విందు ఇవ్వద్దా! విందు చేసిన ఎస్తేరుకు పొందు వచ్చింది. సహవాసము వచ్చింది. 127 సంస్థానాల మీద అధికారియైన అహష్వేరోషు పొందులోనికి ఆమె వెళ్ళారు. సాతాను చిత్తమును బందు చేయాలి. ఎస్తేరు పని దేవుని చిత్తము నెరవేర్చేపని. అదే సంఘ కన్యక యొక్క పని. యూదులందరు బ్రతుకవలెనంటే పెండ్లికుమార్తెయైన ఎస్తేరు రావాలి. ఇశ్రాయేలీయులను కాపాడు ప్రభువా! అని ప్రార్థన చేస్తారు.

ఇశ్రాయేలీయుల నిమిత్తము ప్రార్థన చేసిన మీకు క్షేమము కలుగును. ఈనాటి ఇశ్రాయేలీయులు బైబిలుమిషను వారే! కాబట్టి బైబిలుమిషను క్షేమము కొరకు ప్రార్థనచేస్తే ప్రాణప్రియుని ఇష్టమును నెరవేర్చిన పెండ్లికుమార్తెలమౌదుము. ఆయన చిత్తము చేదుగా నున్నదని నిర్లక్ష్యము చేయకండి జాగ్రత్త! ఈ గొర్రెల మందలో చేరండి. ఆయనయొక్క సొంత గొర్రెల మందలో చేరండి. ఆలస్యము చేయకండి. మీకు కావలసిన దీవెనకొరకు, ఆదరణ కొరకు చేరండి. ఆయన ఇచ్చిన తరుణమును పోగొట్టుకొనకండి. 1) రాజుగారి విందు ఎస్తేరుకు సందు ఇచ్చినది. 2) ఎస్తేరు విందు హామానును బందు చేసినది. అలాగే ఈ పెండ్లికుమార్తెయొక్క విందు సాతానును బందు చేసినది. ఇది ప్రాణప్రియుని యొక్క పని. ఎస్తేరు అనే వధువు ఆటంకములున్నా ప్రాణప్రియుని పనిని తప్పించుకొనలేదు. అలాగే నా శిరస్సు పని అని తలంచి చెప్పిన దానికన్నా ఎక్కువ చేయండి. ఇది రిబ్కా అనే వధువుయొక్క స్థితి. పొందు = సహవాసము. ఆ పొందు లేనిదే బందు

రాదు. అడిగిన దానికన్నా ఎక్కువ పని చేసిన రిబ్కా. పెండ్లికుమార్తె బాధ్యత ఏదనగా ఎక్కువగా చేయుట. ప్రాణమునకు తెగించి చేయుట. ఇది నా ప్రాణప్రియుని చిత్తము. ఏకీడు వచ్చినా, ఏ అవమానము వచ్చినా నా ప్రాణ ప్రియుని చిత్తము నెరవేరుస్తాను.

రాజా! నేను విందు చేస్తాను. మీ ఇద్దరూ రండి. నా ప్రాణప్రియుని చిత్తము నెరవేర్చుటే ఈ దినము నా తీర్మానము ఆయన చిత్తము నెరవేర్చుటే. మహిమ తలంపులు, మహిమ పెండ్లికుమార్తె, మహిమ పెండ్లికుమారుడు, మహిమ పొందు. సాతాను కుట్రను బయలుపరచాలంటే పెండ్లికుమార్తె విందు కావాలి. ప్రియుని కిష్టమైన విందు నేను చేస్తానోహో! సాతాను కుట్రనంతటిని విడదీసిన ఎస్తేరు విందు. నా ప్రాణప్రియుడు ఆనందముతో నా ముఖము చూడటానికి వస్తారు. అప్పుడు సాతాను కళ్ళు పేలిపోతాయి. లోకమునకు విరుద్ధము పరలోకమునకు సంతోషమే, ఎస్తేరు విందే విందు. సాతాను కుట్రను కూలద్రోసిన విందు. అందరు ఏకంగా ఉండుటే సాతానుకు బందు. దేవుని పిల్లలమీద జయము పొందలేరు జాగ్రత్త! సహించుకోండి. నోటిమాట పారవేసికొనవద్దు. ఎస్తేరుయొక్క విందు పెండ్లికుమార్తెకు సందు. ఈ పెండ్లికుమార్తె విందువలన అనగా 7 ఏండ్ల విందు వలన 1000 ఏండ్లు పిశాచికి మట్టులేని గొయ్యి. అదే సాతానుకు మందు. కాబట్టి వారికి ఎప్పుడైనా అపజయమే! 7 ఏండ్లు సంపూర్ణముగా విందు తిన్నావు గనుక సాతానుకు బందు.

"హామాను కుటుంబానికి మందు వేశారు" జాగ్రత్త. ఇక పైకిరాలేరు. అధికారమంతా రాణిగారి చేతిలో ఉంది. పెండ్లికుమార్తె చేతిలో పెత్తనమంతా ఉంది. ఈ ఎస్తేరే మొదటి అధికారి. మొర్దెకై ఓ కూలి మనిషి. అయితే 127 సంస్థానాలకు రెండవ అధికారి అయ్యారు.

Bible Mission HQ Guntur

దైవచిత్తమును నెరవేర్చినందువలన పినతండ్రి కూతురు దేవుని పక్షముగా నున్నందువలన సాతానును జయించారు. ఎస్తేరు వంటి జయమే మీ జయము.

**విందు-సందు-పొందు-బందు :** విందులో సంపూర్ణమైన ఆనందము. 1000 ఏండ్ల పరిపాలన 7 ఏండ్ల పెండ్లివిందు: అందు అధికారము వీరిద్దరిదే. ఈ సంతోషమును ఆటంకపరచువారు ఎవరైనా ఉంటారా! 1000 ఏండ్లు సంతోషమే. సంపూర్ణ సంతోషమనే విందు. ఇప్పుడు మనము గ్రహించలేము. ఆ సంతోషము నాదే. మనసులో భద్రము చేసికొని స్తుతించండి.

1) హామానుయొక్క కుయుక్తి - గెలువలేదు.

2) మొర్దెకై యొక్క రాజభక్తి - గెలిచింది.

3) ఎస్తేరు యొక్క సేవాశక్తిని బట్టి ఇవన్ని కలిగినవి, గనుక

4) యూదులైన వారికి విముక్తి.

పై అనుభవము కొరకు నిరీక్షించి చూస్తున్న మీ చేతిలో రాజదండము వుంటే పారిపోవలసిన పనిలేదు. సిద్ధపడండి రండి. బైబిలుమిషను సంస్కారపు విందు 1000 ఏండ్ల ఆనంద విందునకు ఆయత్తపరుచును అట్టి మహిమ విందునకు ఆయత్త పరచుటకే రాణిగారు వినయము, విధేయత ధరించుకొన్నది. ఇదే ఆమె మెడలో ధరించుకొన్న ముత్యము. ఆ ముత్యము రాజుగారిని ఆకర్షించినది. సంపూర్ణ విధేయత. వ్యర్థాతిశయము వలన పెండ్లికుమార్తె అంతస్థును పోగొట్టుకుంటారు జాగ్రత్త.

మొర్దెకైకి విధేయురాలు, హేగేకి విధేయురాలు, రాజుగారికి విధేయురాలు.

ఇట్టి విధేయులుగా నమ్మకత్వము కలిగిన పెండ్లికుమార్తెలుగా ఈ విందు యొద్దకు వచ్చిన వారిని ప్రాణప్రియుడు నడిపించును గాక! నేటి కాలములో సాతానును బంధించాలంటే మీరందరూ ఏకమనస్సు కలిగివుంటే సాతాను బందు అవుతుంది.

పెండ్లికుమార్తె పని (నేనే) నాయొక్క పని Active = చాలాకీ గా పనిచేయుటే! అపుడే సాతాను బంధించబడుతుంది. రాకడ వరకు కాదు ఇపుడే సాతాను బంధించబడవలెను. ప్రభువు మీకు నిత్యము విందైయుండునుగాక! మొర్దెకై విందు. మహిమ విందులు చేయుటకు ఈ విందు మిమ్ములను బలపర్చునుగాక ఆమేన్.

"ప్రభు సంస్కారపు విందు - ప్రభు సంస్కారపు విందు - పరుగెత్తుకొని రండి ప్రభువే మన విందు = ప్రభువు జతకిదే సందు పాపవ్యాధికి మందు సభలన్నిటి యందు - సంతుష్ఠి పెంపొందు".

# 22వ పాఠము

**దా.కీ. 26: మార్కు 14:12-16; 1కొరింథీ 11:23-34.**

సంస్కార భోజనమునుగూర్చిన బోధ వినుటకు, సంస్కార భోజనము గైకొనుటకు వచ్చిన ప్రియ విశ్వాసులారా! మీకందరకు ఈ రెండు విషయములలో శుభకరమైన ఆహ్వానమందునుగాక! ఆమేన్.

మొదటిది ఉపన్యాసము, రెంవడది ప్రభు భోజనము. ఈరెండు ముఖ్యమైనవే. ఉపన్యాసములు అనేక పర్యాయములు విన్నా ఉపన్యాసమే. సంస్కార భోజనము అనేక పర్యాయములు తిన్నా భోజనమే. ఈ రెండూ అవసరమే అని గుర్తించండి.

భోజనము, భోజనము, భోజనము భోజనములనే భోజనములు నాలుగు రకములు, ఈ నాలుగు భోజనముల విషయములు మనకు తెలిసినవేగాని కొద్దిగా జ్ఞాపకము చేస్తాను.

**మొదటి భోజనము:-** దేవుడు మనకు అనుదినము ఇచ్చే భోజనము. ఏమితిందుమో? ఏమి త్రాగుదుమో, ఏమి ధరింతుమో అని చింతించవద్దు అని ప్రభువు చెప్పెను. గనుక ఆయన అనుదిన ఆహారమిచ్చేవాడు. పక్షులకే ఇచ్చుచుండగా వాటికంటే శ్రేష్ఠమైన స్థితిలోనున్న మనకెందుకు ఇవ్వడు.

మనము ప్రతిదినము భోజనము తినేటప్పుడు ప్రార్థించాలి, స్తుతించాలి. "స్తుతించి మనలను సంతోషపెట్టిన తండ్రిని మనము సంతోషపెట్టాలి". దేవుడు మనకు అనుదినము ఇస్తున్న ఆహారము ముఖ్యమైనదే. ఈ ఆహారమువలన 1) ఆరోగ్యము 2) రోగనివారణ 3) ఆయుష్షు 4) దేవుని కళ. ఈ నాలుగు పై భోజనము వలన మనకు

కలుగుచున్నవి. గాన ఆ ఆహారము ఎంతో ముఖ్యము. ఈ నాలుగు అక్కరలేనివారుందురా? లేరు. నేలపైగాని, చాపపైగాని, బల్లపైగాని కూర్చుండి ఆకులలోగాని,పళ్ళెములలోగాని తినే ఈ ఆహారము 'వద్దు' అనేవారుందురా? ఉండరు. ప్రతి దినము భోజనము ఏలాగు తప్పదో అలాగే ప్రతిదినము స్తుతి తప్పదు. అట్లు స్తుతించిన తండ్రికి మహిమ మనకు తృప్తి సంతోషము.

**రెండవ భోజనము:–** మొదటి దానికంటే ముఖ్యము. మొదటి భోజనము శరీరములోని ప్రాణానికిని, రక్తానికిని ముఖ్యము. శరీరములోని ఇతర అవయవములన్నిటికిని, చర్మమునకు మాత్రమే ఈ భోజనము అవసరము. అయితే దైవగ్రంథములోని భోజనము గొప్పది. అది శరీరాహారము, ఇది ఆత్మాహారము, ఇది వాక్యాహారము, అది పదార్థ ఆహారము. పదార్థ ఆహారముకంటే వాక్యాహారము చాలా గొప్పది. మొదటి ఆహారము తిన్నప్పుడు ఆకలి తీరినట్లు వాక్యము చదువగా, తృప్తికలిగి ఆకలి తీరాలి. ఒకపాపి దైవగ్రంథము తీసి చదువగా ఆహారము తినునప్పటికంటె, వాక్యము చదువునప్పటి సంతోషము గొప్పదిగా ఉండును.

అందుకనే కొందరు 12 గంటలైనా భోజనానికి పిలిచినా చదువుచూ, వస్తాను అంటారు. గాన ఈ ఆహారము చాలా గొప్పది. దీనిలో గొప్పతనమేమనగా ఈ నాలుగు భోజనములు విషయము ఇందు ఉన్నది గాన గొప్పది. ఇదే లేకపోయిన మొదటి భోజనము తిన్నా దాని విలువ తెలియదు. తక్కిన మూడు భోజన విషయములు తెలియదు. మొదటి భోజనమువలన ఇచ్చుచున్న నాలుగు మేళ్ళు ఈ భోజనము వలనకూడా కలుగును.

ఈ రెండవ భోజనము వలన కలుగుచున్న మేళ్లు ఏవనగా,

1) పాపపరిహారం 2) పాపరోగ పరిహారం 3) ఇది చదువగానే ఎక్కడలేని ఉద్రేకము కలుగును. 4) ఆయుష్కాలము కలుగును. వాక్య భోజనము యొద్ద మొదటి భోజనములో లేని పదార్థములు ఉన్నవి. దేవుని వాక్కువలన పాపహరణ, ఆరోగ్యమార్గం, ఆయుష్కాల మార్గము, సంతుష్టి మార్గము ఉన్నది.

**మూడవ భోజనము:–** సంస్కార భోజనము : ఇది శరీరానికి ఆత్మకు రెంటికి సంబంధించినదే. మొదటి భోజనము ఎక్కువగా శరీరానికే. సంస్కారము ఎక్కువగా ఆత్మకు. పై రెండు భోజనములలో ఉన్న నాలుగు లక్షణములు ఈ భోజనములోకూడా నున్నవి. అంతేగాక ఈ భోజనమువలన ఆత్మకు కళ కలుగుచున్నది.

మొదటి భోజనములో అన్నము, కూర, నీళ్లు, పాలు, పండ్లు ఉన్నవి. రెండవ భోజనములో మొదటిదానిలో లేని పదార్థములు ఉన్నవి. మూడవ భోజనములో ఏకముగా ప్రభుని శరీర రక్తములే యున్నవి.

**మొదటి భోజనముకంటే మిగతా రెండు:** 1) శ్రేష్టమైనవి 2) గొప్పవి. ఇవి ఇలాంటివి అని చెప్ప వీలులేదు. ఒకదానికంటే మరొకటి గొప్పగా చేసిన తండ్రి ఎంత గొప్పవాడో.

మొదటి భోజనము సృష్టిలోని భోజనమే, రెండవ భోజనము వాక్కులో ఉన్న భోజనమే అయితే మొదటిది, రెండవది కలుగజేసిన ఆయనే మూడవ భోజనమైయున్నాడు. “అది అనుభవించుట మన పని”.

ఏదికూడ అయోగ్యముగా పుచ్చుకొనకూడదుగాని, దేవుడు అయోగ్యులకు మొదటి భోజనము, రెండవ భోజనము, మూడవ భోజనము ఇచ్చుచునే యున్నాడు. ఈ మూడవ భోజనముయొద్దకు అయోగ్యముగా వస్తే రావద్దు అని దేవుడు చెప్పవలసినదిగాని ఆయన అలాగు అనుటలేదు.

జీర్ణమో, అజీర్ణమోగాని మొదటి భోజనముయొద్దకు వచ్చి తినవచ్చును. వచ్చి తినుటకు శక్తి ఉన్నది. అలాగే రెండవ భోజనము యొద్దకును గ్రంథ భోజనము వద్దకును రాగలరు. అలాగే క్రైస్తవులు ఈ సంస్కార భోజనము యొద్దకు కాళ్ళతో నడిచి వస్తారు. అయోగ్యులను "పుచుకొనవద్దు" అని దేవుడు చెప్పడు గాని అయోగ్యముగా రావద్దు అని ముందే వ్రాసినారు గనుక మనము అయోగ్యముగా భోజనము యొద్దకు వెళ్ళకూడదు.

ఆయన నావద్దకు వచ్చువానిని నేనెంతమాత్రము త్రోసివేయను అన్నారు గాన త్రోసివేయడు గాని ఫలితము తరువాత ఉన్నది. మొదటిది, రెండవది, మూడవది సాధారణ భోజనములే.

**నాలుగవ భోజనము:–** పరలోకములో "రేపు" అనగా త్వరగా అని అర్థము, పెండ్లి విందు పరలోకములో జరుగనైయున్నది. మొదటి భోజనమువలెగాదు, రెండవ భోజనమువలెగాదు, మూడవ భోజనమువలెగాదు. వీటిని అయోగ్యముగా తీసికొన్నట్లు ఈ విందు తీసికొనలేము. ఎందుకనగా ఇది పరలోకములో జరుగుచున్న విందు. ఈ విందుయొద్దకు అయోగ్యుడా నీవు రావద్దు అని ప్రభువు చెప్పరుగాని పరలోక ప్రవేశార్హత లేనందున ఈ మనిషి వెళ్ళలేడు. ఎందుకు? మొదటి మూడు భోజనాలు భోజనాలేగాని ఇది 'విందు' అని బైబిలులో వ్రాయబడియున్నది. ఈ విందు ఎందులో ఎక్కువ అంటే 1) రావద్దు

అని చెప్పదు. కాని మనిషిరాలేదు ఎందుకని అది ఎక్కువ. 2) యోగ్యులే వెళ్ళాలి. 3) ఇంకొక దానిలో మహా ఎక్కువ. పెండ్లివిందువంటి విందు. అందుకని ఎక్కువ. 4) దేవుని లక్షణాలేవో అవి స్పష్టముగా చూస్తు ఆనందిస్తూ ఉంటాము. ఆ లక్షణాలు చూస్తు అనుభవిస్తూ ఉంటాము. ఇక్కడే దేవుని లక్షణములు తెలుసుకొంటాము. అక్కడ ఇంకా తెలుసుకొంటాము, అనుభవిస్తాము.

దేవుని లక్షణములు మొదటి మూడు భోజనములయొద్ద అనుభవిస్తాము కాని ఇక్కడ ఇంకా అనుభవిస్తాము. దాని పేరే విందు. దేవదాసు అయ్యగారు కొద్ది అనుభవించినారు. గాని వర్ణింపలేరు. నాలుగవది గొప్పది. మొదటి మూడూ సరిగా అనుభవించనిదే ఇది దొరుకదు. ఇదెప్పుడు దొరుకుననగా మొదటి మూడు భోజనములలో ఉన్న అయోగ్యత తీసివేసుకున్ననాడే.

ఈ విందు ఎవరిది?

1) పరలోకవిందు, పెండ్లికుమార్తె సంఘ విందు 2) పెండ్లి కుమారుడని బిరుదుపొందిన యేసుక్రీస్తువిందు. 3) తండ్రి సిద్ధపరచిన విందు 4) పరిశుద్ధాత్మ తండ్రి భూలోకములో ఎవరిని పెండ్లికుమార్తెగా సిద్ధపరచునో వారిదే ఆ విందు 5) ముగ్గురు (త్రిత్వము) ఉన్న విందు గాన గొప్ప విందు. ముగ్గురు కన్పించుచుందురు. 6) ఆ విందు నీకు కావాలనినా గొప్పగా సిద్ధపడుము. ఆ విందు గొప్పతనము వివరించిన ఆ విందులో కూర్చోవాలని భ్రమ కలుగును.

ఉదా:- ఒక పళ్లెములో పండ్లు, ఒక పళ్ళెములో మిఠాయి, ఒకదానిలో "రూపాయలు" పెట్టిన మొదటి రెండు చూడక మూడవ దానికొరకు చెయ్యిచాపును. అతనికి దొరకదుగాని భ్రమ, అలాగే పరలోక

విందు కావాలన్నా వారు తమ 'అయోగ్యత' తీసివేసికొనిన ఈ విందు అందును. పరలోకమునకు వెళ్ళేవారు పెండ్లికుమార్తె ఒక్కరే. అలాగే గొప్ప అంతస్థుకు సిద్ధపడిన వారే అందులో ఉందురు. వారే పెండ్లికుమార్తె. 1కొరింథీ 15 అధ్యాయము. ప్రకటనలో, మత్తయి 13 అధ్యాయములో పెండ్లికుమార్తెనుగూర్చి ఉన్నది. అయితే పెండ్లికుమార్తె పరలోకమునకు వెళ్ళి విందులో కూర్చుని పెండ్లికుమార్తె వరుసలో లేని భక్తులను ఈమె పిలుచుకొనును. వారు రక్షణలోని వారే అనేక స్థలాలనుండి పంక్తులు, పంక్తులుగా వచ్చి 7 సం॥లు భోజనము చేయుదురు. తరువాత వారు తమ స్థలములకు వెళతారు. పెండ్లికుమార్తె శాశ్వతకాలముండును. ఈమె ఉండు ప్రదేశము వేరు. మహిమవేరు. రక్షితులు ఆ స్థలములో శాశ్వతకాలముండరు. అర్హతలేదు. కాబట్టి మీ ప్రవర్తన, మీ సిద్ధపాటు, మీయోగ్యతా, మీ స్తుతి, మీ ప్రార్థననుబట్టి పెండ్లికుమార్తెగా సిద్ధపడండి.

మీ అయోగ్యతను వెనుక విడిచిపెట్టి ప్రభువిచ్చు శరీర రక్తములు పుచ్చుకొని ఆయనను సంతోషపెట్టి మేలుపొందండి. లోతు భార్యవలె వెనుకకు తిరిగి మీ అయోగ్యతవైపు చూడక బల్లయొద్దకు రండి. ఈ కొద్ది మాటలు మీకు మేలుగా అందునుగాక! ఆమేన్.

# 23వ పాఠము

**దా.కీ. 23:1-6; మత్తయి 26:26-30; 1కొరింథీ 11:23,24.**

ప్రార్థన:- యేసుప్రభువా! మమ్ములను నీ సంఘములోనికి పిలిచినావు. నీ రాజ్యములోనికి పిలిచినావు. అలాగే మమ్ములను నీ బల్లయొద్దకు పిలుచుచున్న పిలుపును నేడు ధ్యానించబోవుచున్నాము. కాబట్టి నీకు వందనములు. ఈ విందు తరువాత పరలోకమునకు పిలువనైయున్నావు. ఈ నివాసములో నుండి నీ సహవాసము చేయునట్లు ఆత్మ సహాయ మిమ్మని యేసు నామమున వేడుకొంటున్నాము ఆమేన్.

ప్రియులారా! ఈ ఉదయకాలమున ప్రభువుయొద్దకు వచ్చిన మనము మొదటి ఆజ్ఞలో రెండున్నవి 1) నేను నీ దేవుడనైన యెహోవాను అనగా నేను నీ దేవుడను నీవు నా మనిషివనే గొప్ప సహవాస భాగ్యమున్నది. 2) ఇతర దేవతలను పూజింపకూడదు. అనగా ఇతర దేవతలకును మీకు నెడబాపు గల్గి యే సహవాసము లేకుండవలెనని, 3) దేవుడు మానవునిలో యుండేటందుకు ఆ దేవుడు తరుణమును కల్పించినాడు.

దేవుడు నీ దేవుడనన్నాడు. గాని ఈ మనిషి ఆ సహవాసమును కల్పించుకొనలేదు. నేడు బల్ల సహవాసమునకు మనము రావలెను. అలాగే రాకడ పెండ్లివిందులో పాల్గొనవలెను. ఆయన సహవాసములోనికి మనలను పిలుచుచున్నాడు. ఈ భోజనము సంతోషము, సహవాసము మరియు ఈ అనంతములోనికి తనను నమ్మిన శిష్యులను పిలుచుచున్నాడు. మన పాపముల నుండి యెడబాపు కలిగి ప్రభువు పిలిచె ఈ సహవాసములోనికి రావలెను.

బలవంతముగానైన ఈ యెడబాపును కలిగించుకొనవలెను. ఎ) తన సహవాసము బి) తన నిత్యజీవితమునకు సి) తన సంఘములోనికి డి) తన వాక్యములోనికి ఇ) తన సంతోషములోనికి ఎఫ్) తన బల్లయొద్దకు ప్రభువు మనలను పిలుచుచున్నాడు గాన దానిలో స్థిరముగా నుండేటందుకు మనము ప్రార్థించవలెను. మొదటి ఆరు జాబితా కాక మరి మూడు విందులను గూర్చి తెలిసికొనవలెను.

1) రక్షణ విందు, 2) ప్రభు రాత్రి భోజన విందు, 3) పరలోకపు పెండ్లి విందు. ఈ మూడు విందులుకూడ విశ్వాసికొరకు ఏర్పాటుచేయబడినవి. గాన ధ్యానించండి. రక్షణవిందు మానవుడు తన పాప జీవితములోనుండి రక్షణ విందులోనికి, సంస్కార విందులో నుండి పెండ్లివిందులోనికి రావలెను. ప్రయాసపడి భారము మోసికొని పోవుచున్న సమస్త జనులారా! నాయొద్దకు రండి. మత్తయి 11:28 ప్రయాసమున్నది, భారము మోయుచున్నది గనుక వీటిని విడచి రక్షణ విందునకు రావలెననియున్నది.

ఈ మూడు మూడురీతులుగా యున్నవి. ఒక వరుసలో నున్నవైన కాలములను బట్టి వేరుగా నుండును. పాప జాబితాలోనున్న మనిషికి శుభవార్త రావలెను. విందు, అనగా భోజనము కంటె విలువైనది రక్షణ. అనగా మనిషి తన చెడు నైజము విడిచి రక్షణానందమును పొందుటకు రావలెను. ఎప్పటికిని మనిషి తనలోని చెడునైజము తనంతటతాను తీసివేసికొనలేడు. ఒకవేళ తీసివేసికొనిన తల్లిదండ్రుల పాపనైజము గనుక అది పోదు. తల్లిదండ్రులు భక్తులైనయెడల తాత ముత్తాతలు పాపులైతే అట్టివారికి రక్షణభాగ్యమనుగ్రహించుట దుర్లభము. ఒకవేళ దేవా! నేను పాపిని నా నైజము చెడు నైజమని చెప్పగలముగాని దానిని తీసివేసికోలేము. ఇది ఒప్పుదల. ఈలాగుచేస్తే పాపస్థితి నుండి

ఒక అడుగు ముందునకు వచ్చి రక్షణ మార్గములో పడినాడందుము. చెడు నైజమును తీసివేసికొనలేరు రెండవ పర్యాయము తండ్రి నాలో చెడు నైజమున్నది. విసర్జించుట అసహ్యంచుకొనుట ఇష్టమని చెప్తే మంచిదే దారిలోపడ్డాడు గాని నైజము వానిలోనుండి పోలేదు అది ప్రభువు తీసివేయవలెను.

ఉదా:- రోగియున్నాడు. తన స్థితి అంతయు డాక్టరుగారితో చెప్పగలడు గాని తనంతటతాను రోగము తీసివేసికోగలడా? లేదు. అది డాక్టరుగారి పని అలాగే ఓ పాపి! పాపములన్నీ ఒప్పుకొనుట నీ పని పాపమును తీసివేయుట ప్రభువు పని. ప్రభువు నూతన సృష్టియనుకున్నాడు అది ఆయనివ్వగలడు. రక్షణవాదనకు రావచ్చునుగాని వారికి శక్తిలేదు. నన్నుబట్టి తల్లిదండ్రులు, తాతముత్తాతలు, ఆదాము అవ్వలదికూడ వారిలో దురితనైజము తీసివేసికొంటేనే గాని రక్షణ విందునకు సహాయపడదు. ప్రభువుయొద్దకు పాపిరాగానే కౌగలించుకొనును ఎలాగనగా తండ్రి తన కుమారుడు తప్పిపోయినప్పుడు కౌగలించు కొనలేదా? ఆ పాపిని ముద్దు పెట్టు కొనలేదా? ఆయనను శుభ్రముచేసి ఆయనకు పాద రక్షకులను తొడిగించి నూతన వస్త్రములను ధరింపజేసి ఉంగరములనుబెట్టి తన యింటిలోనికి తన కౌగిటలోనికి చేర్చుకొనలేదా? అదే అసలైన రక్షణ విందు. 1) తప్పిపోయిన తన కుమారునెదుర్కొనుట 2) బట్టలను వేయుట, 3) స్నానము చేయించుట 4) బట్టలను వేయుట 5) పదిమందిలో గౌరవించుట 6) పాద రక్షలనుచేయుట 7) ఉంగరమును పెట్టుట 8) వాయిద్యములను వాయించుట అంతయు రక్షణ విందు అనబడును.

అంత ఉచితము సంతర్పణకు వచ్చిన వాడిదగ్గరేమియు పుచ్చుకొనినట్లే అలాగే ఉచితముగా తన తండ్రి తన కుమారునికిచ్చెను.

అలాగుననే చేయక తన కుమారుని గద్దించిన యెడల తండ్రి సమ్ముఖము నుండి పారిపోయేవాడు. అలాగున తండ్రి చేయలేదు. నా తండ్రి పని వారలతోపాటు సమానముగా కూర్చుండబెట్టి భోజనము పెట్టుననుకున్నాడు. లూకా 15:17లో యింత ఆధిక్యత తనకు లభించుననుకొనలేదు. సమస్తమైన వారలారా రక్షణ విందు ఆయన యిస్తే ప్రభువు రాత్రి భోజనపు విందనుభవించగలరు.

పాపముల జాబితాను విడువకపోతే రక్షణ విందులోనికి రాలేము. వారికి యీ అనుభవము తెలియదు. అనుభవించిన వారికర్థమగును. అప్పుడే రుచి, అనుభవము తెలియును. యీ పాపి పాపము చేసినందువలన యితడెంత విందులోనికి వెళ్ళిన తాను విడచిన దుష్ట గుణములు, తనదగ్గరనె తిరుగుచుండును. ఈ విందులో నుండి బయటకు వెళ్ళిన యెడల అవి అతనిని చేరుకొనును. రక్షణ విందులో స్థిరముగనుండె ఆత్మీయమైన భోజనము కలిగి ఆత్మీయానందములో నుండే సంస్కార బహిరంగ విందులోనికి రాగలము. ఇది ప్రభువు ఏర్పాటు చేసిన విందు. గొప్ప ఆనందము విశ్వాసికి కలుగును.

ఈ ఆనందము ఆత్మీయముగా నుండును. ఈ విందు కంటికి కనబడదుగాని కంటికి కనబడునట్లు విందు ననుభవించుచున్నారు. అనగా వీరు తప్పిపోయిన కుమారుని జాబితాలోనివారు రక్షణవిందులో రక్షింపబడుచున్నారు. వారు విడచిన పాపములు, పందులు, పొట్టు, ఎరుకులవానియొద్దనున్న మనిషి (బురద), దుర్గంధము దరిద్రత వస్త్రహీనత నుండి రక్షింపబడినాడు. గాన రక్షణ విందు అనుభవించగలిగినాడు. సంస్కారపు విందులో ప్రభువు తన రక్తముననగా జీవముగల తన శరీరము నిచ్చుచున్నాడు.

మరియు తెల్లని వస్త్రములు, విందు, పాద రక్షలు, స్నానము, వస్త్రములు, భోజనము తప్పిపోయిన కుమారునికి తండ్రి ఉచితముగా ఇచ్చినట్లు, తండ్రి తన రక్తమును, శరీరమును ప్రాణము తన బిడ్డలకు ఉచితముగా ఇచ్చుచున్నాడు. విందుచేసిన ప్రభువు ముఖము కనబడకపోయిన మనకు ఏమి సంబరము (సంతోషము). అలాగే ప్రభువు యిచ్చిన రక్షణ విందు సహవాసము ఆయన అంతరంగము బహిరంగముగా దొరుకును. సంస్కారపు విందును ఆయావిధములుగా పుచ్చుకొందురు. కొందరికి మూడు నెలలకొక పర్యాయము పాదిరిగారిద్వారా దొరుకుచుండును.

మరి కొందరు నెలకొక పర్యాయము. అలాగే మరికొందరు వారమునకొక పర్యాయము. విశ్వాసులైతే అనుదినము పుచ్చుకొందురు. అంతరంగ, బహిరంగ సంస్కారపు భోజనము ప్రభువు ఇచ్చును. సాధుసుందర్‌సింగుగారు అన్నారు రోజూ ఇచ్చు గురువులుంటే రోజు సంస్కారము పుచ్చుకొంటానన్నారు. ఈ విధముగా సంస్కారపు భోజనమున కలవాటుబడిన, పరలోకపు పెండ్లి విందునకు అలవాటుపడుదురు. రెండవ రాకడలో ఎత్తబడినవారు ఏడేండ్లు విందు అనుభవించెదరు. అట్టి మహాభాగ్యము మీకు అనుగ్రహింపబడునుగాక!

# 24వ పాఠము

**దానియేలు 1:8-13; 1పేతురు 2:16 దేవునిదాసుడు**

ప్రియమైన పెండ్లికుమార్తె సంఘమా! ఈ విందుద్వారా కలుగవలసిన మేళ్ళను దేవుడు మీకు అనుగ్రహించునుగాక!

దానియేలు గ్రంథములో దాసుడు అని చెప్పుకొనుచున్న (1:13) దానియేలు దేవుని దాసుల ఆహారమేమిటో, భూలోకపు రాజుగారి ఆహారమేమిటో తెలియజేయుచున్నారు. దానియేలు దాసుడుగా ఉన్నారు. అయితే దాసునిగా ఉన్న ఇతనిని ఇతని స్నేహితులను రాజు ఎంచుకొని, రాజు భోజనము పెట్టవలెనని తలంచినాడు. ఆ రాజ భోజనములోకూడా మాంసము, రొట్టె, ద్రాక్షరసము ఉన్నాయి. కాని దాసుడైన దానియేలు ఈ భూలోకపు రాజు విందును తిరస్కరించుచున్నారు. అందుకు కారణము అది అపవిత్రమైన బల్ల 1కొరింథీ 10:21. దీనినిబట్టి చూడగా సాతాను అపవిత్రపు బల్లనుకూడా పవిత్రమైన బల్లవలె ఉంచుటకు ప్రయత్నము చేయును. 1) రాజుగారు వేసినబల్ల, 2) దాసుడైన దానియేలు కోరుకున్న బల్ల.

**1. రాజుగారి బల్ల:–** ఈ రాజుగారి బల్లమీద అతిశయమనే మసాలా ఉన్నది. బహిరంగ ఆకర్షణ అనే బంగారపు తీగలు ఉన్నవి. ఈ రాజుగారి బల్లలోని బహిరంగ రాజరికములో, అంతరంగ పాపదాస్యము దాగియున్నది.

**2. దాసుడైన దానియేలు కోరుకొన్న బల్ల:–** ఈ బల్లపై దాసుడు కోరుకున్న దాసుని ఆహారమున్నది. దాసుని భోజనములో అంతరంగ రాజరికము దాగియున్నది. పైకి గొప్పగా లేకపోయినా సరళీకృత ఆత్మీయ పౌష్టికాహారము దాగియున్నది.

అందుచేతనే రాజుయొద్ద శిక్షణ పొందిన బాలురులో రాజ భోజనము తీసుకున్నవారు "రాజులుగా" ఎంచబడలేదు గాని, దాసుల భోజనము తీసుకున్న దానియేలు మాత్రము "రాజుగా" ఎంచబడ్డారు. గనుక "బహిరంగ మెరుపులు" కలిగినది రాజ భోజనము. అంతరంగ మెరుపులు కలిగినది దాసుల భోజనము. అపో॥ పౌలు ఈ రాజ భోజనమును తిరస్కరించుచు (భూలోక భాగ్యములను) తిరస్కరించుచు, సమస్తమును పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను అని చెప్పుచున్నారు.

3. రాజుగారి ఆహారము కావాలా? దాసునియొక్క భోజనము కావాలా? ఆలోచించుకొనండి. బహిరంగ మెరుపులు కావాలా? అంతరంగ మెరుపులు కావాలా? పరలోకపు రాజరికము కావలెననుకుంటే భూలోకములో నున్న రాజరికమును పెంటతో సమానముగా ఎంచుకొనండి. Deny the World.

**4. దేవునియొక్క దాసుని రూపము:-** నీ ప్రియుడైయున్న యేసుక్రీస్తు ప్రభువు రాజే. పరలోకపు రాజు. కాని భూలోకములో దాసుని స్వరూపము ధరించుకొని అని వ్రాయబడియున్నది (ఫిలిప్పీ 2:1). ఆయన దాసునిగానే భూలోకములో మనకొరకు శ్రమలను అనుభవించెను. ఈయన అలుపు ఎరుగని కూలివాడు. "నక్కలకు బొరియలుండే, ఆకాశ పక్షులకు గూళ్లుండెను" మనుష్య కుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదు. తలవాల్చుకొనక విశ్రాంతిలేక జీవితకాలమంతయు ప్రతి క్షణము శ్రమించిన దాసుడు ఈయన. కష్టపడిన దాసుని శరీరములో, రక్తములో బలముండునుగాని కష్టపడనివాని శరీర రక్తములో ఏమి బలముండును. దేవునియొక్క గొర్రెలారా! మీరు దాసునియొక్క ఆహారమందు ఆనందించుచున్నారా!

**షరా:- దేవదాసు అయ్యగారియొక్క అభిప్రాయము:-** కొంతమంది దేవదాసు అయ్యగారిని మీరు ఎందుకు బైబిలుమిషనుకు అధికారిగా ఉండరు? అని అడిగితే నాపేరు దేవదాసు, నేను దేవునియొక్క దాసుని మాత్రమే. "దాసుడు, దాసునిగా ఉండవలెను" అని చెప్పిరి. అటువంటి దైవ దాసత్వపు జీరగలిగియున్న దైవజనుని బిడ్డలమైన మనము అట్టి దాసుని జీరకలిగి ఉండవద్దా?

33 1/2 సం॥లు కష్టపడిన కూలివాని శరీర రక్తములు నీ ప్రభునివి. తండ్రి కుమారునికి నియమించిన పని: కుమారుడు తన వధువును సంపాదించుకొనుటకు చేయవలసిన పని: ఈ రెండు పనులు కష్టపడి పూర్తిచేసిన కూలివాడు నీ వరుడు బాగా కష్టము చేసిన, వానిలో నుండి కండరములు ఏలాగు ఉప్పొంగుచూ ఉండునో అలాగే బాగా కష్టపడిన ఈ దాసుని యొక్క శరీర రక్తములు నీకొరకు ఉప్పొంగుచూ, నీ నోటిని తాకవలెనని వచ్చుచున్నవి. నిన్ను తృప్తిపరచవలెనని, నిన్ను ఆనందపర్చవలెనని ఈ శరీర, రక్తములు ఆశపడుచున్నవి. పెండ్లి కుమారుని శ్రమ, పెండ్లికుమార్తె కోసమేగదా! యాకోబు శ్రమ రాహేలు కోసమేగదా! యాకోబు రాహేలు కొరకు ఉవ్విళ్ళూరుచున్నట్లు నీ ప్రాణ ప్రియుని శరీర రక్తములు నీ కొరకము ఉవ్విళ్ళూరుచున్నవి. అలాగే ఈ యేసుక్రీస్తు యొక్క శరీర, రక్తములు ఈ శ్రమకాలములో నీకొరకు ఉవ్విళ్ళూరుచున్నవి.

**5. దాసునియొక్క స్థితి:-** దాసులు అనగా యజమానులు చెప్పినది చెప్పినట్లు చేసేవారు. సేవకులు సేవచేయువారు మాత్రమే. 24గురు పెద్దలుకూడా మేము "దాసులమే" అని తమ కిరీటములు తీసి తలలువంచి సాష్టాంగపడుచున్నారు. మన పెండ్లికుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు తండ్రి చిత్తమును నెరవేర్చుటకును, మన భారములన్నీ

మోయుటకును సంపూర్ణముగా దాసుడైనాడు. అట్టి దాసుని శరీర రక్తములు పుచ్చుకొనుచున్న మనము దాసుని నైజము కలిగి ఉండవలెను. గనుక మీ పెండ్లికుమారుని ప్రేమకు దాసులైయుండుడి. ఆయన చిత్తమునకు దాసులైయుండుడి. ఆయనమాటకు దాసులైయుండుడి.

**ఎ) దాసుని కళ్ళు:-** సహజముగా దాసుని కళ్ళు, దాసుని కడుపు పెద్దవే. దాసుడు తన కళ్ళతో ఎక్కువ ఆశ కలిగియుండును. అలాగే తన కడుపులో ఎక్కువ ఆకలి కలిగియుండును. అలాగే మన నిజమైన దాసుడైన యేసుక్రీస్తు ప్రభువే తన కళ్ళలో సమస్తమైనవారు తనయొద్దకు రావలెనని ఆశించుచున్నారు. "ప్రయాసపడి... సమస్తమైన (మత్తయి 11:28) వారలారా నాయొద్దకు రండి." ఇది ఆయన ఆశ. భూలోకములో భారము వహించనివారెవరు? సమస్తమైన వారు భారము వహించుచున్నారుగదా! అందుకే ఆయన అలాగు ఆశిస్తున్నారు. అలాగే తండ్రి చిత్తమును సంపూర్ణముగా నెరవేర్చుటకు సంపూర్ణమైన ఆకలి కలిగియున్నారు. అదే ఆయన ఆహారము యోహాను 4:34. అలాగే మన ఆత్మీయ జనకులైన దేవదాసు అయ్యగారుకూడా ఇదే ఆశ. ఇదే ఆకలి కలిగియున్నారు. ఈ దాసుని కడుపులోనుండి వచ్చిన పాటే "అంతయు మనదేగదా" లోకమంతటిని మార్చుమని ప్రార్థన చేసిన దైవజనులారా మనలో అదేస్థితి ఉండవద్దా? (దాసుని కళ్ళు, కడుపు) మీరుకూడా ఈ నూతన సం॥లో "దేవదాసులు" అవ్వాలేమో? ఎవరికి తెలియును. గనుక సంపూర్ణమైన ఆశ, ఆకలి గలిగి ఈ సంస్కార భోజనమును తీసికొనండి.

ప్రియమైన పెండ్లికుమార్తె సంఘమా! దేవుని దాసునిగా మారి, శ్రమించి నీకు సరిపడు ఆహారమును వడ్డించుచున్నారు. గనుక దాసుని స్థితిలేకుండా నీవు భుజిస్తే అది నామకార్ధమే.

**6. దాసునియెదుట దాసునిగా ఉండుట:–** నీవు దాసునియెదుట దాసునిగా నున్నావా? లేక రాజుగా నున్నావా? నీవు ఏలాగున్నావు? ఎక్కడ కూర్చున్నావు? దాసుడు దాసునికి మాత్రమే స్వేచ్ఛగా వడ్డించగలడుగాని తనకంటె పైనున్న రాజునకు స్వేచ్ఛగా వడ్డించలేడు. చనువు ఉండదు. "నా పాపి విందునకు నడచి రాకున్నా నా తాపమెంతో చెప్పదగునా అనుచున్నారు". అను పాటలో "తాపమెందుకు" దాసునియొద్దకు దాసునివలె వినయముగా రాకపోతే ఆయనకు తాపముకాదా? నీవు నీ ఇహలోక అతిశయములతో రాజు సింహాసనముపై కూర్చుంటే ఆయనకు నీకు చనువుగా వడ్డించలేరు. అప్పుడు నీవు తీసికొనే సంస్కారము నామకార్థమే. నీవు ఎక్కడ ఉంటున్నావో ఒక్కసారి ఆలోచించు. ఏలాగు తీసుకొనుచున్నావో, ఒక్కసారి ఆలోచించుకొనుము.

అంత దేవుడు దాసుడైపోతే మట్టివారమైన మనము ఆయన సన్నిధిలో ఇంకా ఎంతగా దాసులమవ్వాలి? మన శరీరమును, ఆత్మను, ప్రాణమును చుట్టచుట్టి సంపూర్ణముగా ముద్దగా చేసుకొని ఆయనయొద్దకు వెళ్ళవలెను. "నాయిష్ట మిదిగో యిది నీ యిష్టముగా చేయ నా యిష్టమిక కాదది" కనుక ఈలాగున ముద్దగా మారి ఆయన దగ్గరకు వెళ్ళలేకపోతే ఆ రక్తపు ముద్దలోనుండి ఏమీ పొందలేము. గనుక ఈ దినమున ఈ దాసుని రక్తము, శరీరము, నైజము మనల్ని కప్పి ఉంటే తగ్గింపు అంటే ఏమిటో మనకు తెలుస్తుంది. అందుకొరకే ఈదాసుడు తన రూపమును మనకు అద్ది, తన నైజమును మనకు కప్పి ఈ విందును వడ్డించుచున్నారు. ఈలాగు మనలను దాసులుగా మార్చుకొనుటలో ఆయన చేయు చాకిరీ మనకు అర్థముకాదు.

**7. దాసుడును, రాజునైన యేసుక్రీస్తుయొద్ద విందు పుచ్చుకొను విధానము:–** పరలోక స్థితినిబట్టి ఈయన రాజు. భూలోకపు స్థితినిబట్టి కూలివాడు దాసుడు. "రాజు భోజనకర్త". ఈ దినమున మనకు భోజనము వడ్డిస్తున్నారు. గనుక దాసుని స్వరూపము ధరించుకొనిన ఈ నిజమైన దాసుని యొద్ద, దైవదాసులమైన మనము చనువుగా భోజనము తీసికొందాము. దాసునికి, దాసునికి మధ్య చనువు ఉండునుగదా! గనుక ఇది చనువు విందు. ఒక దాసుడు మరియొక దాసునియొద్దకు వచ్చినప్పుడు తన పై కండువా తీసి క్రింద దులిపి కూర్చోబెట్టుకొనును గదా! అలాగే మీ కన్నీటి కండువా తీసి క్రింద దులిపి ఈ నిజమైన దాసుని ఈ దినమున మీతో కూర్చుండబెట్టుకొని ఆయనయొద్ద విందును తీసుకొనండి. గనుకనే ఇది చనువుల విందు. రెండవదిగా ఈయన రాజే గనుక రాజు యొద్దకు దాసుడు వెళ్ళునప్పుడు వినయముగా వెళ్ళునుగదా! ఈ దినమున పరలోకపు రాజు విందును వడ్డించుటకు వచ్చియున్నారు. గనుక దైవదాసులమైన మనము వినయముగా ఆయన యొద్దనుండి విందును తీసికొనవలెను. గనుక వినయ చనువుల విందే ఈ సంస్కారపు విందు. ఈ విధముగా సంస్కారపు విందులో పాల్గొనుచున్నారా? భూలోక స్థితినిబట్టి చనువు, పరలోక స్థితినిబట్టి వినయము.

**8. యేసుక్రీస్తు రాజు రూపము, దాసుని రూపములు ఏలాగు యిమిడి యున్నవి:–** నీ ప్రాణ ప్రియుని దాసుని స్వరూపములో, రారాజు స్వరూపము ఇమిడి యున్నది. అలాగే నీ ప్రాణ ప్రియుని చనువులో మీ వినయము ఇముడ్చుకొని భుజించండి. శరీరము చనువును కనబరుస్తుంది. ఆత్మ వినయమును కనబరుస్తుంది. శరీరమునుబట్టి చూడగా మానవ శరీరమును ధరించుకొన్నవాడేగాని ఆత్మనుబట్టి చూడగా ఆయన దైవాత్మ.

నీ ప్రాణప్రియుని శరీరములో దాసత్వము, రాజరికము పెనవేసుకొనియున్నవి. రాజరికము దాస్యతము పెనవేసికొనుట ఏలాగు? దాసత్వములో ఇమిడిపోయే స్వభావమున్నది. దాసుడు ఏలాగైనా ఇమిడిపోగలడు. అలాగే రాజరికములో ఆక్రమించుకొనే గుణమున్నది. ఈలాగున దాస్యము రాజరికములో ఇమిడిపోగా, రాజరికము ఆవరించుకొనగా ఈ రెండు లక్షణములు పెనవేసుకొని జీవించిన జీవితము నీ ప్రాణప్రియుని జీవితము. దాసుని స్వరూపమును బట్టి నీ ప్రాణప్రియుడు నీలో ఇమిడిపోవుచున్నారు. రాజరికమును బట్టి నిన్ను తనలో ఇముడ్చుకొనుచున్నారు.

నా శరీరములో శరీరము, నా రక్తములో రక్తము అని తన శరీర రక్తములను ఇచ్చి ఈ దాసుడు నీలో ఇమిడిపోవుచున్నారు. తన రాజరికమునుబట్టి "ఇది నాది" అని అనుచున్నారు. రాజరికమునుబట్టి స్వంతము చేసికొనుట. కనుక ఈలాగు ఏకమైపోవుటే వివాహము.

దాసుని విందు కళావిహీనముగా కనబడుచున్నదని నెట్టివేయవద్దు. ఇది అంతరంగ కళ కలిగినదే. ఆయనకు కళలేకకాదు. మనకొరకు ఆయన కళావిహీనముగా మారినారు. కళావిహీనముగా కనబడుచున్న ఈ దాసుని స్వీకరించగలిగిన యెడల కళ నిచ్చేది ఈ విందే. భూలోకములో ఉన్నంతకాలము దాసునిగానే ఉండు. అది నీ నైజమైయుండాలి. అది నీ బలమైయుండాలి. నేను దాసునిదాసుడనే అనే స్మరణ నీలో ఉండాలి. ఈ దైవ దాసత్వమును కాదంటే లోకపు రాజరికములు నిన్ను చుట్టుముడతాయి.

నిత్యము దైవదాసులుగా ఉండగలిగే నైజము ఈ విందుద్వారా దేవుడు మీకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# 25వ పాఠము

ప్రభువునందు ప్రియులారా!

ప్రభువుయొక్క శరీరము = ప్రభువుయొక్క రక్తము, రొట్టె = ద్రాక్షరసము, మన శరీరము = మన ఆత్మ, మన శరీర జీవితము = మన ఆత్మీయ జీవనము.

రాత్రి భోజనము విశ్వాసులకే ప్రభువు ఏర్పరచినారు. విశ్వాసులు పైని చూడవలెను. క్రీస్తు ప్రభువు రెండు మాటలను చెప్పెను. (1) రొట్టె ఇచ్చుచు నా శరీరమనెను (2) ద్రాక్షారసము ఇచ్చుచు ఇది నా రక్తమని చెప్పెను. రొట్టె పట్టుకొని ఇది రొట్టె అనలేదు. ద్రాక్షారసము పట్టుకొని ఇది ద్రాక్షారసమనలేదు. అది రొట్టె ద్రాక్షారసమని వారికి తెలియును. గనుక అట్లు చెప్పక ఇది నా శరీరమని రక్తమని చెప్పెను. వారు వెంటనే ఇది రొట్టెకదా ఎందుకు శరీరమనుచున్నావు. ఇది ద్రాక్షారసముకదా ఎందుకు శరరమనుచున్నావు. ఇది ద్రాక్షారసముకదా ఎందుకు రక్తమనుచున్నావని అడుగవలసినది. అట్లు అడుగుటకు ప్రభువు వారికి సందివ్వలేదు. వారు నమ్మి మాట్లాడక ఊరుకున్నారు. ప్రభువు చెప్పినది వినుటయే వారి పని వారికి ప్రభువునందు యెక్కువ గౌరవము, విశ్వాసము గనుక వారట్లడుగలేదు. ఇప్పుడు మనకు రొట్టెయని తెలుసు గనుక నమ్మనక్కరలేదు. గాని శరీరమని తెలియదు గనుక అది నమ్మవలెను. అలాగే ద్రాక్షారసమని తెలుసు గనుక నమ్మనవసరములేదు గాని ఇది రక్తమని తెలియదు గనుక అది నమ్మవలెను.

ఉదా:– గ్లాసులో నీళ్ళుపోసి అడిగినవారికి ఇస్తాము. ఆయన పుచ్చుకొన్నాడు. ఆయన గ్లాసు తీసికొన్నాడా, మంచినీరు తీసికొన్నాడా వచ్చిన ఆయన గ్లాసు ఇచ్చినాడా, నీళ్లు ఇచ్చినాడా? అడిగిన ఆయన నీళ్ళు అడిగినాడు గాని గ్లాసు అడుగలేదు. గాని రెండు ఇవ్వడము నిజమే. అలాగే రొట్టె ఇచ్చుట నిజమే. దాని మూలముగా శరీరము ఇచ్చుటకూడ నిజమే ద్రాక్షరసము ఇచ్చుట నిజమే. దానిమూలముగా ప్రభువు రక్తమిచ్చుటకూడ నిజమే. గ్లాసు, మంచినీళ్ళు రెండు ఆయన తీసికొనెనుగదా! అలాగే ప్రభువు రొట్టె ద్రాక్షరసములతో, తన శరీర రక్తములనుకూడ ఇచ్చెను. ఇప్పుడుకూడ ఇచ్చుచున్నాడు. విశ్వాసులు మాత్రము తీసికొందురు. వారు తీసికొనినప్పుడు రొట్టె ద్రాక్షరసములను అందుకొనుట ఎంత నిశ్చయమో ప్రభువుయొక్క శరీర రక్తములు అందుకొందురు. ప్రతిష్ఠిత లేక ముందుగా పిల్లలు ఆ రొట్టె తినిన ఆ ద్రాక్షరసము త్రాగిన అది వట్టి ద్రాక్షరసము మాత్రమే. ఆరాధన అయిపోయిన తర్వాత మిగిలిన రొట్టె, వట్టి ద్రాక్షరసమే. గాని సంస్కారమున తీసికొన్నప్పుడు వాటితోపాటు విశ్వాసి ప్రభువు శరీర రక్తములను అందుకొనును.

అవిశ్వాసి వచ్చి అందరు తీసికొనుచున్నారు. నేను తీసికొందునని నామకార్థముగ ఆచారమునుబట్టి రెండు తీసికొనును. అప్పుడు క్రీస్తుప్రభువుయొక్క శరీరము, రక్తము అతనికి అందునా? రొట్టె, ద్రాక్షారసము అందునుగాని, ప్రభువు శరీర రక్తములు అందవు (1కొరింథీ 11:29). శిక్షావిధి కలుగుటకే తిని ద్రాగుచున్నాడని గలదు. విశ్వాసి ఉపయోగముకొరకును, మేలు కొరకును తీసికొనుచున్నాడు. అవిశ్వాసి శిక్షకొరకు తీసికొనుచున్నాడు. విశ్వాసి ఇవి వట్టి రొట్టె, వట్టి

ద్రాక్షారసము కాదు. అవి బజారులో నుండును. అయితే ఈ బల్లమీద నున్నవి క్రీస్తు శరీరము రక్తము అని విశ్వసించి తీసికొనును. అవిశ్వాసికి ఇవన్నియు ఉండవు. ఆచార ప్రకారముచేసి క్రీస్తు శరీర రక్తమువలన కీడు కలిగించుకొని అపరాధియాయెను. గనుక శిక్షార్హుడైనాడు. రొట్టె తీసికొనునప్పుడు ప్రభువు శరీరమే. ద్రాక్షారసము తీసికొననప్పుడు ప్రభువు రక్తమే అని అనుకొనుచు బల్లయొద్దకు రండి అది మాకేలాగు తెలియును అని అడుగవచ్చును. అది క్రీస్తుప్రభువే చెప్పెను. ఆయన చెప్పినదే నిజము. మనకు తెలియనక్కరలేదు. ప్రభువు చెప్పినది అర్థమైన కాకపోయిన నమ్ముటయే విశ్వాసియొక్క పని.

# 26వ పాఠము

**"గొర్రెపిల్ల పెండ్లివిందుకు పిలువబడినవారు ధన్యులు" ప్రక 19:19.**

ప్రార్థన:- యేసుప్రభువా! నీవు మాకు భూలోకములోను, పరలోకములోను సిద్ధపరచుచున్న విందు నిమిత్తమై నీకు వందనములు. భూలోకములో సంస్కార భోజనము పరలోకములో నీ సహవాస భాగ్యమను గ్రహించుచున్నందుకు వందనములు. మాకు సంస్కార భోజనమందించుమని త్వరగా రానైయున్న ప్రభువు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

సంస్కార భోజన విశ్వాసులారా! ప్రభువు రాత్రి భోజనమును గూర్చి ధ్యానించుకొందము. ఈ దినము ప్రభువు రాత్రి భోజనము స్థాపించిన దినము గనుక సంఘములో సంస్కార భోజనము ఆచరించుచున్నాము.

**పస్కా గొర్రెప్లిల విందు:-** నిర్గమ 12 అధ్యాయము. ఇశ్రాయేలీయులు 43 సం॥లు అన్యులమధ్య ఐగుప్తీయుల మధ్యనున్నారు. ఐగుప్తీయులు శత్రువులు. వీరిద్వారా శ్రమలు, శోధనలు, కష్టములు కల్గినవి. అయినను ప్రభువు వారితోనే యున్నారు. గొర్రెపిల్ల రక్తము అన్యులను, ఇశ్రాయేలీయులను వేరుపరచినది అనగా ప్రత్యేకింపబడినారు. గొర్రెపిల్ల రక్తమువలన ఐగుప్తు దాస్యమునుండి విమోచింపబడినారు. అలాగే దేవుని గొర్రెపిల్ల రక్తముద్వారా భూలోక దాస్యమునుండి విమోచింపబడినాము. ఐగుప్తీయుల శక్తికంటె ఇశ్రాయేలీయుల శక్తి గొప్పదని ఐగుప్తీయులు సాక్ష్యమిచ్చిరి నిర్గమ 8:19. వారికి దైవశక్తినిచ్చి మరణము లేకుండా చేసియున్నావు. ఇశ్రాయేలీయుల ప్రత్యేకత ఐగుప్తీయులకర్థము కానట్లు యేసునందున్న వారి ప్రత్యేకత లోకమునకర్థముగాదు.

**2. శరీరాహారము:-** యోహాను 6:54 ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నుండి కానానుకు వెళ్ళిపోయె సమయము వచ్చినది (పస్కావిందు). అలాగే లోకమునుండి సంఘము పరలోకమునకు వెళ్లిపోవును గనుక ప్రభువు శరీర రక్తముల విందు. గొర్రెపిల్ల రక్తము వారిని మరణములేకుండ రక్షించిన రీతిగానే ప్రభువు మనలను మరణము లేకుండ మోక్షమునకు నడిపించును. 1) శరీరాహారము తినకపోయిన యెడల చనిపోవుదము 2) వాక్యాహారము లేకపోయిన ఆత్మ నశించిపోవును. 3) సంస్కార భోజనమును పుచ్చుకొనకపోతే పరలోక రాజ్యములో ప్రవేశింపలేము. ఆహారము మానివేస్తే ఆరోగ్యముండదు, ఆయుష్కాలముండదు, జ్ఞానముండదు. గనుక దేవుని వాక్యమును నేర్చుకొనవలెను. ఆరోగ్యముంటేనే వాక్యాహారము. ఇల్లు, బట్ట, శుద్ధి అవి శరీరమునకు ఆహారము సంబంధించినవి. ఇవన్నియుంటేనేగాని సుఖముగా గుడికి వెళ్ళము. అప్పుడు మనకు దిగులుండదు. ఇది లేకపోతే అదియుండదు అది లేకపోతే ఇది యుండదు.

**3. వాక్యాహారము:-** దా.కీ. 19:10; 1పేతురు 2:3. పాపముపోయిన తరువాత బలమును పొందవలెను. బోధన అనగా వాక్యోపదేశమును వినడమే తినడముతో సమానము. వాక్యాహారము తిని బలమును పొందవలెను. వాక్యము అనుదిన దీపము, ఆహారము. శక్తి, బలము, ఆశీర్వాదము. మరియు (వాక్యాహారము తిననియెడల బలమాత్మకు లభించుటెట్లు) ఆకలి వేసినపుడు ఆహారమునకు తొందరపడినట్లు వాక్యాహారము కొరకు తొందరపడుచున్నామా? ఈవేళంతా పనులు పనులు, ఉదయమునుండి పరుండబోయే వరకు పనులు. ఈవేళ బైబిలు చదవలేదు, చూడలేదనుకుంటారు. ఎన్ని

పనులున్న, కునుకుపాట్లు వచ్చిన ఆశతీర బైబిలు అనుదినము చదువవలెను. అనుదినము ఎవరు బైబిలు చదివెదరో వారు వాక్యానుభవముగలవారగుదురు. అట్టివారు ప్రభువు బల్లయొద్దకు రాగలరు. ఎవరు బోధలను శ్రద్ధతో విందురో వారే బల్లయొద్దకు రాగలరు. వాక్యము చదవనివారు, వాక్యార్థము తెలియనివారు ఏ ముఖము పెట్టుకొని తగుదునాయని బల్లయొద్దకు రాగలరు. ఇటువంటి ప్రశ్నలు మరియొకరు మనకు వేయకుండగానే సిద్ధపడి బల్లయొద్దకు రావలెను.

**4. సంస్కారాహారము:-** 1కొరింథీ 11:24 సృష్టికర్తను ఆహారముగా అనుభవించుట అనగా సృష్టిలో నుండుటకాదుగాని సృష్టికర్తలోనే లీనమైపోవుట అనగా ఏక శరీరము (ఏకత్వము) యేసులో మనము అలాగే మనలో ప్రభువు ఏకమయ్యే విందు (కుమారుని విందు). తండ్రి అరణ్యములో చేసిన విందుకంటె కుమారుని స్వరక్తముల విందు అద్భుతకరమైన విందు. ప్రభువు భోజనము అనగా ప్రభువుయొక్క శరీర రక్తము ఆయన నోటనుండి బయలుదేరినది. దీనివలన ఆయననే మనము కలిగియుందుము. గనుక ఈవేళ వచ్చి రొట్టెను యే ప్రకారముగ తిందుమో ద్రాక్షరసము త్రాగుదుమో ఆ విధముగానే ఆయన శరీరమును తిని ఆయన రక్తమును త్రాగుదుము. ఇట్టి అనుభవస్థితిలేని యెడల పరలోకమునకు ఆయన పిలిచినపుడు వెళ్ళలేము. అయోగ్యముగా పుచ్చుకొనుటకంటె మానివేయడము చాలమంచిది. ఆకలిగల్గియుంటేనే పుచ్చుకొనుటకు రండి. ఆయన శరీరము రక్తము కావలెననెడి ఆత్రుత ఆశ లేకపోతే రావద్దుగాని నేను తీసికొనవలెననెడి వేగిరబాటుండవలెను. అప్పుడు ఆయన శరీర రక్తములు మన అనుభవములోనికి వచ్చును.

**5. జీవాహారము:–** యోహాను 6:51. లోకమునుండి సంఘము ప్రత్యేకింపబడి మేఘములోనికి వెళ్ళును. సజీవముగా మేఘములోనికి అనగా రెండవ రాకడ తలంపు కలిగినవారు మాత్రమే వెళ్ళగలరు. లోకములో ఎవరికిని లేని ఇవ్వని మహిమ భోజనము నరులకివ్వబడినది. ఇది పరిశుద్ధాత్మ తండ్రి విందు. శ్రమలలో విమోచింపబడినవారే వెళ్ళగలరు. పరలోకపు విందు ఏడేండ్ల విందు. భూలోకములో ఏడేండ్లు శ్రమల విందు అనగా ఎత్తబడిన వారికి పప్పులు. ఎత్తబడని వారికి తిప్పలు. కాబట్టి పెండ్లికుమార్తె సంఘముగా నుండవలెను. ఎవరైతే సంస్కార భోజనము పొందెదరో మరియు కృతజ్ఞతతో పైవన్నీ చేస్తారో కృతజ్ఞతతో ఎవరు సిద్ధపడగలరో వారు లవొదికయ సంఘ తరగతికి తయారగుదురో వారికి ఆ విందు భాగ్యము దొరుకును. ఈ లోకములో మరణము మనకు రాకముందె మనము సిద్ధపడవలెను. మరణము మన దగ్గరకు వచ్చిన తరువాత నిరుకు చెప్పలేము. జీవాహారమును పుచ్చుకొని మరణము లేకుండ మోక్షమునకెళ్ళగలము.

**6. పెండ్లి విందు:–** ప్రకటన 19:9. పెండ్లికుమార్తె పెండ్లి కుమారునికి కలిగిన సమస్తము ననుభవించుటకు హక్కు గలదు. పెండ్లి సమయమందు పెండ్లి కుమారునినే పెండ్లికుమార్తె అనుభవించును. పెండ్లికుమారునికి కలిగిన సమస్తమును పెండ్లికుమార్తె పెండ్లి సమయమందు సంపాదించుకొనును. అలాగే రేపు మహిమలో క్రీస్తును క్రీస్తునకు కలిగిన సమస్తమును సంఘము అందుకొని అనుభవించును. అందుకే పెండ్లివిందైనది. మరి గొర్రెపిల్లయని ఎందుకన్నారు. ప్రభువు పెండ్లి విందుయని యెందుకు లేదు. పస్కా విందప్పుడు గొర్రెపిల్ల లేకపోతే విమోచన లేదు. మన్నా లేదు. అలాగే

భూమిమీద లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల లేకపోతే మానవునికి గతిలేదు. అనగా దేవుడులేడు. దేవుడిచ్చు స్వాస్థ్యములేదు. ఈ గొర్రెపిల్ల దేవునిని దేవుడిచ్చు స్వాస్థ్యమును సంపాదించినది. గనుకనే ఆ గొర్రెపిల్లకు ఈ పేరు. వధింపబడడానికి ఒప్పుకొనదు. గనుక ఆ గొర్రెపిల్లకు ఘనత ప్రభావము. అందుచేత ఆ గొర్రెపిల్ల పెండ్లివిందు అని వ్రాసినారు. ఈ గొర్రెపిల్లయే ఆ దేవుని గొర్రెపిల్ల.

**7. పిలువబడినవారి విందు:-** మత్తయి 11:28. గొర్రెపిల్ల లేకపోతే విమోచనలేదు. మన్నాలేదు. సాధువైన గొర్రెపిల్ల సింహాసనము దగ్గర లవొదికయ సంఘము పెండ్లికుమార్తెను పెండ్లికుమారుడైన ప్రభువు పిలుచును. ఈ విందునకు పిలువబడినవారే పెండ్లికుమార్తె. పెండ్లికుమార్తె రక్షితులను పిలుచును. ప్రభువు 70 మంది సువార్తికులను సేవకొరకు పంపించెను. లూకా 10:1. వారు తిరిగి వచ్చినపుడు వారి సేవా రిపోర్టును విని మీ పేర్లు పరలోక జీవ గ్రంథమందు ఉన్నవని వ్రాయబడియున్నవని చెప్పెను. లూకా 10:20. అలాగే ప్రభువు కొరకు పరిచర్య చేసిన వారిపేర్లు జీవగ్రంథమందు ఉన్నవని పౌలు చెప్పెను ఫిలిప్పీ 4:3 జీవగ్రంథమందు పేర్లు కలిగినవారె పరలోక విందునకు అర్హులు. ఎవరైతే ప్రతిదినము ఒకగంట దైవసన్నిధిలోయుందురో వారికి రెండవ రాకడ సూచన కనబడును. బైబిలు చదువుట, ప్రవర్తన, బోధ వీటన్నిటి సహాయమున్నదిగాని దైవసన్నిధిలోనుంటే సమస్తము సరియగును. అప్పుడు రెండవ రాకడకు సిద్ధపడుదుము. భూలోకములో ఆయన శరీర రక్తములలో పాల్గొనినరీతిగానే ఏడేండ్ల విందునకు అనగా పెండ్లివిందునకు సిద్ధపడగలము. దేవుడు ఈకొద్ది మాటలను దీవించునుగాక!

# 27వ పాఠము

**కీర్తన 23:5 నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు.**

1) ప్రభు భోజనము 2) రాత్రి భోజనము 3) సంస్కార భోజనము. ప్రభువు స్థాపించినందున ప్రభురాత్రి భోజనమన్నారు. భయంకరమైన రాత్రి సమయమున దీనిని ఆచరించినారు. గనుక రాత్రి భోజనమన్నారు. ఈ భోజనము వలన మామూలు భోజనము చేసినప్పుడు కడుపునిండునట్లు నిండదు. ఇది మతసంబంధమైన ఆచారము గనుక సంస్కార భోజనము కృతజ్ఞత వెల్లడిచేయుట. గనుక దీనిని యాకిరిస్టు అనికూడ అందురు. శరీర భోజనము వలన ఎంత ఉపకారము కలుగుచున్నదో అంతకన్న ఎక్కువ ఉపకారము ఈ ప్రభు భోజనము వలన కలుగుచున్నది.

శత్రువులు చూచుచుండగా ప్రభువు భోజనపు బల్లను మనకు ఏర్పాటు చేసియున్నాడు. మనము భోజనము చేయచుండగ శత్రువులు వస్తారు. మనము భోజనము చేయుదుమా, పారిపోవుదుమా గొర్రెల దగ్గర కాపరి ఉన్నాడు. కుక్కకూడ గలదు. కొంచెము దూరముగా తోడేలు ఉన్నది. గొర్రెపిల్లలు ఉండునా పారిపోవునా? మేతమేయునా? మనకు ముఖ్య శత్రువు పాపనైజము. ఇది తోడేలుకన్న భయంకరమైనది. మన రెండవ శత్రువు లోకము. మనలను నిరుత్సాహపరచు వారున్నారు. ఆత్మీయ జీవనము సాగిపోవుట కష్టముగా నుండును. మరియు కొంచెము దూరములో మూడవ శత్రువు సైతాను గలడు. వెలిగింపబడినది ఆర్పివేయుటకు చూచుచుండును. మనకు దుర్బుద్ధులు గలవు. దుష్టనైజము గలదు. చెడ్డచూపు, చెడ్డ తలంపులుగలవు. ఇవన్నీ

మనశత్రువులే. ఇంతమంది శత్రువులుండగా ఏలాగు భోజనము చేయుట. మన ఇంటిలోనే స్నేహితులైన శత్రువు, లోకముగలదు. సైతాను, అతని సైన్యము, దయ్యములు ఇవన్నియు శత్రువులు. –పది ఆజ్ఞల ప్రకారము మనలోని లోపములను దిద్దుకొని ఈ భోజనము పుచ్చుకొనవలెను. కళంకముతో తీసికొనరాదు. ఉదరశుద్ధి లేకుండ భుజించిన ఎట్లు జబ్బు చేయునో అలాగే కళంకము గలిగి ఈ భోజనము పుచ్చుకొనినయెడల కష్టములు కలుగును. అందుచేతనే పౌలు వ్రాయుచున్నాడు. నీలో అనేకులు నిద్రించుచున్నారు. యేసుప్రభువు రొట్టె చేత పుచ్చుకొని ఇది నా శరీరమనిరి. రొట్టె ఆయన శరీరము, ఇది గుర్తు మాత్రము కాదు నిజమైన వృత్తాంతము. ప్రభు భోజనమువల్ల కలుగు గొప్ప దానములు జీవము, మోక్షము పాపపరిహారము, మనకు ప్రభువుయొక్క సహవాసము కలుగును. ఎవరైనా మనలను భోజనమునకు పిలిచిన వెళ్ళిన తరువాత మనకు పరిచయము కలుగును. అలాగే ఈ భోజనము వలన ప్రభువుతో సహవాసము కలుగును. శరీరాహారము రక్తముగా మారి దేహమునకు బలమిచ్చునట్లు ఈ ఆహారము లోకమును పాపమును జయించుటకు బలమిచ్చును. ఈ భోజన సమయములో ప్రభువు పరలోకపు విందునుగూర్చి కూడ చెప్పెను. గనుక రాబోవు ఆ విందునుకూడ మనము జ్ఞాపకముంచుకొనవలెను. ఈ భోజనమువలన మీకు ఆత్మీయ బలము కలుగును గాక!

# 28వ పాఠము

**రాజు విందుకు కూర్చుండియుండగా నా పరిమళ తైలపు సువాసన వ్యాపించెను ప॥గీ॥ 1:12.**

ఈ వచనమునందు పెండ్లి సంఘము రాజైన క్రీస్తుప్రభువు తన కొరకు విందు చేయించెననియు, విందులో ప్రభువుయొక్క పరిమళ తైలపు సువాసన వ్యాపించెనని పలుకుచున్నది.

**1) రాజు:-** అసలు అదృశ్యదేవుడు కొలసి 1:15. అయితే శరీరధారిగా వచ్చినందున ఈయనకు అనేక బిరుదులు కలిగినవి. (ఎ) పాతనిబంధన కాలమందు ఇశ్రాయేలీయులు నిరీక్షించిన నామము మెస్సియా. అనగా అభిషిక్తుడైన క్రీస్తు యోహాను 1:14. (బి) మనుష్య కుమారుడు:- ప్రభువు సిలువ మరణము నొందుటకు శరీరధారిగా వచ్చినందున ఈయన మనుష్య కుమారుడు యోహాను 5:27. (సి) దేవుని కుమారుడు. సర్వజనుల దోషము ఆయనమీద వేసికొని చనిపోయి లేచినందున ఈయన దేవుని కుమారుడు మత్తయి 14:33. పెండ్లికుమారుడు. ఈయన రెండవమారు మేఘముమీద మధ్యాకాశము లోనికి వచ్చి వధువు సంఘమును ఆకర్షించి నూతన యెరూషలేమునకు తీసికొనివెళ్ళి 7 సం॥లు పెండ్లి విందు చేయనైయున్నారు. గనుకనే పెండ్లికుమారుడు లూకా 5:35; మత్తయి 9:15. (ఇ) రాజు వధువు సంఘముతో భూమిమీదికి వచ్చి ఆయన సిలువవేయబడిన యెరూషలేమునందు వెయ్యి ఏండ్లు రాజ్యపాలన చేయనైయున్నారు గనుక రాజు 1తిమోతి 6:15; ప్రకటన 19:16.

**2) విందు:-** అనగా ఇతరులకొరకు చేయునది. ప్రత్యేకమైన కార్యార్ధమై చేయునది. ప్రతిదినము భోజన సమయమందు సిద్ధపరచబడు

పదార్ధములకంటె ఎక్కువ పదార్ధములు, విలువైనవి చేయబడును. ఇందు భుజించు ఆహారము, త్రాగు పానమును ఉండును. విందుకు పిలువబడినవారు తామంతటతాామే అలంకరించుకొని సిద్ధపడి వచ్చెదరు. విందులు (1) సర్వసృష్టికొరకైన విందు. దేవుడు సర్వజీవుల కొరకు సృష్టాదినుండి అంతము వరకు ఇచ్చుచున్న విందు. (2) ఏర్పాటు జనమైన ఇశ్రాయేలీయులకు 40 సం॥లు పైనుండి దేవుడు ఇచ్చిన ఆహారము మన్నా. 30 లక్షల ప్రజలకు బండలోనుండి నీళ్ళనిచ్చెను. (3) క్రీస్తుప్రభువు అరణ్యములో 5 వేలమందికి కావించిన అద్భుత ఆహారము. (4) జీతనాతములు, నిలువ సొమ్ము, నిరుకు రాబడి లేకపోయినను, క్రీస్తుప్రభువునందు విశ్వాసముద్వారా జీవించువారి జీవితము ఒక విందు. పైన చెప్పబడినవన్నియు భూలోకపు విందులు. (5) వాక్యవిందు : ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన జనులారా! క్రీస్తు ప్రభువు నొద్దకు రండి. ఆయన మీ పాపములను క్షమించి, మిమ్ములను రక్షించి, మోక్షమునకు కొనిపోవును అని వినబడుచున్న వాక్యవిందు. (6) ప్రతి ఆదివారము ఆలయములో జరుగు ఆరాధన విందు. (7) ప్రభు భోజన సంస్కారపు విందు. క్రీస్తు ప్రభువుయొక్క శరీరము రక్తము విశ్వాసి అందుకొని, క్రీస్తునందు విశ్వాసి, విశ్వాసియందు క్రీస్తు నివసించు విందు. (8) భూమిమీద నివసించుచు మోక్ష సంబంధమైన అనుభవమును ప్రతి దినము కలిగివుండే సన్నిధి విందు. ఇవి భూలోకములో నున్న క్రైస్తవ సంఘములోని విందులు. (9) పెండ్లివిందు: వరుడైన క్రీస్తుప్రభువు మేఘూసీనుడై మధ్యాకాశమునకు వచ్చి భూమిపైనున్న వధువు సంఘమును ఆకర్షించుకొని పైనున్న నూతన యెరూషలేమునకు తీసికొనివెళ్ళి వధువు చెంతనే ఉండి 7 సంవత్సరములు చేయు విందు. వధువు సంఘము భూమిపై క్రీస్తు ప్రభువునకు చేసిన సేవకు, పడిన

శ్రమకు తగిన బహుమానము పొందును. వధువు సంఘము చేసిన ప్రతి చిన్న కార్యమునకు బహుమానము కలుగును. (10) పరమందు తండ్రియందు కుమారుడును, కుమారునియందు తండ్రియు. క్రీస్తునందు సంఘమును, సంఘమందు క్రీస్తుప్రభువును ఏకమై ఉందురు యోహాను 14:20. ఇదే విందు తండ్రిని, కుమారుని, కుమారుని సంఘమును ఏకము చేయునది పరిశుద్ధాత్ముడే. (11) త్రిత్వదేవునియందుగల పావన లక్షణములను వధువు సంఘము యుగయుగములు అనుభవించుచు, మహిమనుండి అధిక మహిమకు వెళ్లుచుండును 2కొరింథీ 3:18. ఇది నిత్య విందు. (12) వెయ్యేండ్ల పాలనలోని విందు. క్రీస్తుప్రభువు పైనున్న యెరూషలేమునకు తీసికొని వెళ్ళిన పెండ్లి సంఘముతో భూమిపైకి దిగివచ్చి వెయ్యేండ్లు రాజ్యపరిపాలన చేయును. అప్పుడు భూమ్యాకాశములు మార్చబడి ఆదాము హవ్వలు పాప ప్రవేశమునకు ముందు ఉన్న పరిశుద్ధ భూమ్యాకాశముల వలె నుండును. పాపములేదు, సాతాను, పిశాచములు ఉండవు. ప్రజలకు పని ప్రయాస ఉండదు. వ్యాధి, బాధ, కరువు, కష్టము, నష్టములుండవు. దుమ్ము, ధూళి, ముండ్ల తుప్పలు ఉండవు. మృగములలో క్రూరత్వము ఉండదు. పాములలో విషము ఉండదు. సృష్టియంతట సౌఖ్యము ఉండును. ప్రభువే రారాజై పరిపాలన చేయును. ప్రధాన యాజకుడై ఆరాధన చేయును. పరిశుద్ధులు సర్వసృష్టికి సువార్తను ప్రకటింతురు. ప్రభువు పరలోకపు పరిశుద్ధులు, దూతలు, అందరికి కనబడి మాట్లాడుదురు. శరీరాహారమునకు, ఆత్మీయాహారమునకు వెలితిలేని మహా గొప్ప విందు.

**3) కూర్చుండియుండగా:-** ప్రభువు అంతరంగ సంఘములోను, బహిరంగ సంఘములోను ఉండి సంఘముచేయు కార్యములు సరిగా ఉన్నచో లేవో చూచుటకు కూర్చొని ఉన్నారు.

వడ్డించునవి సరిగా నున్నవో లేవో చూచుటకున్ను, వడ్డించువారు సరిగా వడ్డించుచున్నారో లేదో చూచుటకు కూర్చుండెను. ఆయన ప్రతి సంఘమును దర్శించును. మనము గ్రహించని రీతిగా బోధకులను ఏర్పాటుచేయుట, సంఘస్థాపన చేయుట, సంఘాచారములు జరిగించుట, బోధకులు సంఘస్తులను దర్శించుట మొదలగునవన్నియు ఆయన చేయించుచున్నారు. గనుక ఇదికూడ కూర్చుండుటలో చేరినది. వాటిని మానక, వీటిని చేయవలసియుండెను మత్తయి. 28:23. అనగా పై ఆచారములను జరిగించుచు అంతరంగ స్థితికొరకు చేయవలసినవి చేయవలెనని ప్రభువు చెప్పెను గాన బహిరంగ అంతరంగ ఆచారములను సరిచేయుటకై ప్రభువు కూర్చునియున్నాడు. ప్రభువు భూలోకములో ఉన్నపుడు 5వేల మందికి అద్భుతాహారము గావించినప్పుడు ప్రభువు వడ్డించలేదు గాని శిష్యులు వడ్డించుచుండగా ప్రభువు కూర్చుండి యుండెనని తెలియుచున్నది మత్తయి 14:19. క్రీస్తుప్రభువు యెరూషలేము దేవాలయములో వేదాంతుల మధ్య కూర్చుండి బోధించెను లూకా. 2:46. క్రీస్తు ప్రభువు పరమందు పెండ్లివిందులో వధువు సంఘము చెంత కూర్చొని ఉండెను. వధువు పొందు బహుమానములను చూచుచుండును. నేడును దైవ సన్నిధి కూటములయందు కూర్చుండి బోధించుచున్నారు.

**4) నా పరిమళ తైలపు సువాసన వ్యాపించెను:-** ఈ గీతమునందు దుఃఖమునుగూర్చి లేదుగాని పెండ్లికుమార్తె ప్రభువుయొక్క సహవాసమును కోరి ఆయనతో నడచి రాజనగురులోనికి, ఉద్యానవనములోనికి వెళ్ళుట ఉన్నది. ప్రభువు సంఘమునకు అలంకారములు, పరిమళ తైలములు, వస్త్రములు అనుగ్రహించినందున తన్నుగూర్చి తానే నా పరిమళ తైలపు సువాసన వ్యాపించెనని

పలుకుచున్నది. ఓ ప్రభువా! నేను శుద్ధియై ఉన్నాను నాలో ఏ పాపములేదు. నేను నీతి వస్త్రములు ధరించుకొనుచున్నాను. నేను నీ నివాస గృహములో ఉన్నాను. నీ సన్నిధిలోనే ఉన్నాను. గనుక పరిమళ తైలపు సువాసన చూడుము అని పెండ్లికుమార్తె భూమిమీద ఉండగనే పలుకుట నేర్చుకొనవలెను. అయితే మహాపరిశుద్ధత ఉంటేనేగాని ఈ మాట పలుకకూడదు యోబు. 13:5.

**5) పరిమళ తైలములు:-** (1) ప్రేమ:- ఒక స్త్రీ ప్రభువు పాదములను కన్నీటితో కడిగి, తలవెంట్రుకలతో తుడిచి ముద్దుపెట్టుకొని అత్తరు పూసెను. ప్రభువును ఆ స్త్రీ విస్తారముగా ప్రేమించినందున ఆమె విస్తార పాపములు క్షమింపబడినవి లూకా. 7:38-47. ప్రభువుకు పూసిన అత్తరు సువాసన అందరికి వ్యాపించినది. పాపపరిహారము నొందిన స్త్రీ ప్రభువును ప్రేమించిన ప్రేమయొక్క సువాసన ప్రభువునకు వ్యాపించినది (2) కృతజ్ఞత:- ఓడలో నుండి నోవహు దిగిన తరువాత దేవునికి దహలబలి నర్పించెను. అప్పుడు యెహోవా ఇంపైన సువాసన ఆఘ్రాణించెను ఆది. 8:20,21. జలప్రళయము నుండి తప్పించిన దేవునికి నోవహు కనబరచిన కృతజ్ఞత దేవుడు సువాసనగా నంగీకరించెను. (3) సువార్త:- సువార్తను ప్రకటించు అపోస్తలులు దేవునికి క్రీస్తు సువాసనయైయున్నారు 2కొరింథీ 2:14-6. (4) సజీవయాగము:- రోమా 12:1. బ్రతికియుండి క్రీస్తుప్రభువుయొక్క ఇష్టప్రకారము జీవించుట. ఇదియును పరిమళ సువాసనే (5) విశ్వాసయాగము:- ఫిలిప్పీ 2:17. షడ్రక్కు, మెషక్కు, అబెద్నెగోలు అగ్నిగుండమునకు భయపడక దేవునియందే విశ్వాసముంచిరి. దేవుడు మమ్మును తప్పించి రక్షించుటకు సమర్థుడు ఇది విశ్వాసము. ఒకవేళ ఆయన రక్షింపకపోయినను, రాజా! నీ దేవతలను మేము

పూజింపమనియు, నమస్కరింపమనియు తెలిసికొనుమని పలికిన పలుకు విశ్వాసమునకు పైన ఉన్న ఉన్నత విశ్వాసపు పలుకు దాని. 3:18. వీరు శ్రమలో చూపిన విశ్వాసము కనబడని దేవుని వారు చూచుటకు మాత్రమే కాక చూడలేని ఇతరులకును చూపించిరి. ఈ విశ్వాసము దేవునికి సువాసనయైయున్నది. (6) స్తుతియాగము:- హెబ్రీ. 13:5. వీరు స్తుతినే బలివలె నర్పించిరి. స్తుతినుండి బయలు వెడలిన స్తోత్ర పరిమళ సువాసన దేవుని వద్దకు చేరినది. బిడ్డలందరు ఒక్కమారే చనిపోయిన వార్త విని యోబు నేలమీద సాష్టాంగపడి, నమస్కారము చేసి, యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొనిపోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక! అనెను యోబు. 1:20,21. యోబు చేసిన స్తుతి ఆనంద పరిమళముగా పరమునకు వ్యాపించెను. అందువల్ల అపవాదికి అవమానము కలిగెను. యోబుయొక్క ఉన్నత స్థితి బయటపడెను. (7) పరిశుద్ధత:- 1పేతురు 2:5; కీర్తన 4:5. క్రీస్తుప్రభువు విశ్వాసికి అనుగ్రహించిన పరిశుద్ధత ఉన్నతమైనది. విశ్వాసియొక్క పరిశుద్ధతయే ప్రభువును ఆకర్షించునది. పరిశుద్ధతయే గొప్ప పరిమళము. (8) కానుక:- ఫిలిప్పీ 4:18. మనోహర సువాసనయు దేవునికి ప్రీతికరమును, ఇష్టకరమైన యాగమునైయున్నది. అన్నియు దేవుడే మనకు ఇచ్చుచున్నాడు. ఇక్కడ దేవునికే మనము కానుకనిచ్చుట మనోహర సువాసనయై ఉన్నది. ప్రభువు చేసిన ఉపకారము వలన పైన చెప్పబడిన పరిమళములన్నియు కలిగియున్నదని పలుకుచున్నది. ఆ పరిమళముల సువాసన వ్యాపించుచున్నదనియు వధువు పెండ్లివిందులో చెప్పుకొనుచున్నది.

చదువరులారా! రారాజైన క్రీస్తుప్రభువు చేసిన విందులో చేరుదురుగాక! చేరిన మీరు ప్రభువు వలన సంపాదించిన అనుభవ

తైలపు సువాసన విందులో వ్యాపించెనని వధువు పలికెను. ఈ వచనమునందు ప్రియుడైన క్రీస్తుప్రభువు ప్రియురాలైన వధువు సంఘముయొక్క రొమ్మున నుండు గోపరసమంత సువాసనగలవాడని పలుకుచున్నది ప॥గీ॥ 1:13.

**1) నా ప్రియుడు:–** సంఘము ప్రభువు నా ప్రియుడని అనేక మారులు సంబోధించుచున్నది. మిగతా విశ్వాసులు ప్రభువును ప్రియుడని పలికిన పలుకునకును, ఈ వధువు సంఘము పలికిన పలుకునకును, చాల వ్యత్యాసమున్నది. నా ప్రియుడు అని ఒకమారు పలికిన పలుకునకును, మరొకమారు పలికిన పలుకునకును వ్యత్యాసమున్నది. క్రీస్తుప్రభువును వెంబడించిన అపొస్తలుల ప్రారంభ స్థితికిని, చివరిస్థితికిని అనేకరెట్లు తేడా ఉన్నది. వధువు స్థితి సంపూర్ణమైన స్థితి గనుక నా ప్రియుడని అనుటలో గొప్ప విలువ, గొప్ప స్థితి కనబడుచున్నది. ప్రభువు నన్ను వెంబడించుమని ఆయన శిష్యులతో చెప్పినపుడు వారు తమ దోనెలను, వలను విడిచి ప్రభువును వెంబడించిరి. మత్తయి 4:19,20. వారికి కలిగి ఉన్న సమస్తముకంటె ప్రభువు పలుకు ప్రీతికరముగా ఉన్నవని తెలియుచున్నది. ఇప్పుడు ప్రభువు వారికి ప్రియుడే, వారు ప్రభువును వెంబడించిన తరువాత ఆయన చేసిన క్రియలనుబట్టి ఆయన వారికి ఇంకా ప్రియుడై ఉన్నాడు. ప్రభువుతో వారికి కలిగిన సహవాసమునుబట్టి రూపాంతర సమయమందు ప్రభువుయొక్క నిజరూపమును చూచిరి. ఇట్టి అనుభవ స్థితినిబట్టి ప్రభువు వారికి మరీ ప్రియుడై ఉన్నాడు. ఆయన సిలువ, మరణ, పునరుత్థాన, ఆరోహణ సమయమందు కనబరచిన ఆయన దైవత్వమును చూచి మహానందము పొందినవారైనందున ఆయన వారికి మరింత ప్రియుడైయున్నాడు. ఆయన పావన నామము ఎంత ఉ

న్నతమైనదో వారి అనుభవములోను, బోధలోను, శ్రమలోను కనుగొనగలము. గనుక ఆయన నామము వారికి ఎంత ప్రీతికరమైనదో తెలియుచున్నది. వారికి అనేక శ్రమలు కలిగినను ప్రభువును తమ హృదయములో ప్రతిష్ఠించుకొని హతసాక్షులైరి. ఆయన కొరకు వారు హతసాక్షులగుటనుబట్టి ఆయన వారికి ఎట్టి ప్రియుడై ఉన్నాడో తెలియుచున్నది. ఈ రీతిని వధువు సంఘము ప్రభువుయొక్క సహవాసములో పెరుగుకొలది నా ప్రియుడని పలుకుటలో ఉన్నతస్థితి కనబడుచున్నది. ఇక్కడ నా ప్రియుడు నా రొమ్మునందు గోపరసమంత సువాసనగలవాడని పలుకుచున్న పలుకు ఉన్నతమైనది.

2) నా రొమ్మునందు, ప్రభువు వధువు సంఘముయొక్క అంతరంగములో ఉన్నట్లు తెలియుచున్నది 1పేతు. 3:16. (ఎ) తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడైన క్రీస్తుప్రభువు (యోహాను 1:18). మరియు గర్భమందు ప్రవేశించి దేవత్వముగల దేవుని కుమారుడు మానవత్వముగల మనిషి కుమారుడయ్యెను. దేవమానవుడుగా లోకమందు సంచరించి దైవత్వమును, మానవత్వమును కనబరచి మనుష్యుడుగా మనుష్యులమధ్య జీవించుచు, దేవునిలో ఏకమై దైవత్వమును లోకమునకు బయలుపరచెను (యోహాను 12:44,45). మహిమగల కార్యములెన్నో చేసి మనిషిగా ఉండి మనుష్యుల కొరకు మరణమునొంది, జీవముగల దేవునిగా మరణమునుండి లేచి జీవించి, నిత్యమరణ పాత్రులను నిత్యజీవ పాత్రులనుగా చేసెను. అనగా మనుష్య కుమారులను దేవకుమారులుగా చేసెను. ఇట్లు చేయుటకే మానవ హృదయాంతరంగ వాసి ఆయెను. (బి) దేవుడు సృష్టిలో నరుని ఉంచి, నరునిలో దేవుడు ఉండుటచే నరుని చేసెను. గాని నరుడు దేవుని ఆజ్ఞను మీరి దేవునిని తనలో

లేకుండా చేసికొనెను. అందుకే నక్కలకు బొరియలు, ఆకాశ పక్షులకు గూళ్లున్నవిగాని మనుష్య కుమారుడు తల వాల్చుటకైనను స్థలములేదని ప్రభువు పలికెను. అనగా సాతానుయొక్క కార్యములకును, లోకపు కుయుక్తులకును, మానవుని అంతరంగములో స్థలమున్నది. గాని దేవుని నివాసమునకు స్థలములేదు. ప్రభువు మానవునిలో ప్రవేశించి శుద్ధిచేసి, అందు నివసించుటకే మానవ హృదయ కవాటమును తట్టుచున్నాడు (ప॥గీ॥ 5:22; ప్రక. 3:20). మనిషి హృదయ తలుపు తీసినయెడల అందు ప్రవేశించును. అందుకే ప్రభువు నా కుమారుడా! నీ హృదయము నాకిమ్ము అని పలుకుచున్నాడు సామె. 23:26. ప్రభువు మనిషి గనుక మానవుల మధ్య నివసింపగలడు. దేవుడు గనుక మనిషియొక్క హృదయ నివాసి కాగలడు. ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయన శిష్యులు తలుపులు వేసికొని గదిలో ఉన్నపుడు ఆయన వారి మధ్యకు రాగలిగెను. తలుపులు వేసినను వారి మధ్యకు రాగలిగిన దేవుడు గనుకనే మానవునియొక్క హృదయములోనికి రాగలడు. దేవుని రొమ్మున నున్న క్రీస్తుప్రభువు సంఘముయొక్క రొమ్మున నుండుటకే మరియ రొమ్మున నుండెను. (సి) మానవుడు దైవవాక్యమున క్రీస్తుప్రభువు మానవ పాపపరిహారకుడని విశ్వాసము కలిగి ఉన్నాడు. ప్రభువును ఆశ్రయించి మానవుని అంతరంగములో పాపములన్నీ ఒప్పుకొని, ఆయన రక్తము ద్వారా శుద్ధినొంది (1యోహాను 1:7). క్రీస్తునందు బాప్తిస్మము పొందుటద్వారా క్రీస్తును ధరించుకొనుచున్నాడు (గలతీ. 3:27). పరిశుద్ధాత్మని నింపుదల వలన క్రీస్తు ప్రభువును హృదయములో ప్రతిష్ఠించుకొని (గలతీ 4:16) ఆయనతో సహవాసము గలిగి ఆయన స్వరూపమునకు మార్చబడుచున్నాడు (ఫిలిప్పీ 3:21) జీవించునది నేనుకాదు క్రీస్తే నాయందు జీవించును. ఈ రీతిగా క్రీస్తును కలిగినవారును, లేనివారును సంఘములో ఉన్నారు.

సాధుసుందర్‌సింగు అను భక్తుడు ప్రభువు తనకు ప్రత్యక్షము కాగానే తన హృదయములోనికి చేర్చుకొనెను. ఆ దినము నుండి నేటివరకు క్రీస్తుప్రభువు సాధుసుందర్‌సింగుగారిలో నిలిచిపోయెను. ఆహారము భుజించినపుడు ఆ ఆహారము పైకి కనబడకపోయినను కడుపు నిండినట్లు ఎట్లు తెలియుచున్నదో అట్లే సుందరసింగుగారి హృదయములో ప్రభువు నిండియున్నట్లు ఆయనకు తెలిసినది. ఇట్టి అనుభవము గలవారే నా ప్రియుడు నా రొమ్మునందు గోపరసమంత సువాసనగలవాడు అని పలుకగలరు.

**3) గోపరసమంత సువాసనగలవాడు:–** పరిశుద్ధ తైలమునందు వాడబడు వస్తువులలో ఒకటి. రాజగృహములలో వాడునది. వారు వస్త్రములపై, పడకలపై వేసికొనునది. గొప్ప పరిమళ వాసనగలది కీర్తన. 45:8. ప్రభువే పరిమళ వాసనయై యున్నారు. అనగా అపోస్తులులే సువాసనయైయున్నారు 2కొరింథీ 2:15.

ప్రభువునుగూర్చి విని ఆయనను తెలిసికొనుట, ఆయనతో సహవాసము కలిగియుండుట ఒక స్థితి. అపొస్తులులవలె ప్రభువును చూచుట ఒక స్థితి 1యోహాను 1:1. ఆయనను రుచి చూచి తెలిసికొనుట మరొక స్థితి 1పేతురు 2:1. ఆయన పరిమళ వాసనగలవాడని తెలిసికొనుట ఇంకొకస్థితి వారు పరిమళవాసనగా మార్చబడుట మరొక స్థితి చిన్న పిల్లలకు రంగు, వాసన తెలియవు. పెద్దవారికి తెలియును. అట్లే అంతరంగ స్థితిలో ఉన్నత అనుభవము గలవారికే ప్రభువుయొక్క గోపరసవాసన తెలియును గాన సామాన్యులకు తెలియదు. పరమగీతము ఉన్నత అంతస్థుగలవారికేగాని సామాన్యులకు కాదు.

ప్రభువుయొక్క జన్మము, ఆయన బోధ, సేవ, పరిచర్య, జీవితము, ఆయన శ్రమ, మరణ, పునరుత్థాన, ఆరోహణము ఆయన రెండవరాకడ,

వెయ్యేండ్ల పాలన, అనంతజీవితము, పరిశీలనము చేసినయెడల ప్రభువుయొక్క ప్రేమ, జీవము, శక్తి, జ్ఞానము, పరిశుద్ధత, సర్వవ్యాపకత్వము, న్యాయము, స్వతంత్రత, అనాది, అనంతము అను పావన లక్షణముల గోపరస వాసనను కనుగొనగలము. మరియ గర్భమందు పావన రక్షకుడైన క్రీస్తు జన్మించుననెడి వార్తను ఆమె విని ఎలిసబెత్తును దర్శింప వచ్చి వందనము చేయగానే మరియగర్భమందున్న శిశువైన క్రీస్తుప్రభువుయొక్క జ్ఞానమును గోపరస వాసన ఎలిసబెత్తు కనుగొని నా ప్రభువు తల్లి నా వద్దకు వచ్చుట ఎలాగు ప్రాప్తించెను? అని పలికెను. అంతట ఎలిసబెత్తు గర్భములోనే శిశువు ఆనందముతో గంతులు వేసెను. లూకా 1:41-44. సమరయ స్త్రీని ప్రభువు పావన పరచినందున ఆ పరిశుద్ధ పరిమళము సుకారను గ్రామమంతయు వ్యాపించినది. ఆ గ్రామస్తులు వచ్చి గోపరస వాసనయైన యేసును కనుగొని ఈయన లోకరక్షకుడని మేము తెలిసికొని ఉన్నామని పలికిరి. అనగా లోకమంతటికి ఈయనే రక్షణ పరిమళమని వారి మాటవల్ల తెలియుచున్నది. ప్రభువు గెరాసేనుల దేశములోను సమాధులలోనున్న అపవిత్రాత్మ పట్టినవానిని బాగుచేయుటకు వచ్చుచుండగా, ఆ భూత పీడితుడు యేసును దూరమున ఉండగానే చూచి నమస్కారము చేసెను మార్కు 5:6. గనుక దీనినిబట్టి చూడగా ప్రభువేమియు మాట్లాడకపోయినను ప్రభువులోని శక్తిగల పరిమళవాసన భూత పీడితునికి అర్థమైనట్లు తెలియుచున్నది. ప్రభువు లాజరును బ్రతికించుటకు సమాధియొద్దకు వచ్చి సమాధిపైనున్న రాతిని తీసివేయుమని పలుకగా మార్త ప్రభువా! అతడు చనిపోయి నాలుగు దినములైనది గనుక ఇప్పటికి వాసన కొట్టునని ఆయనతో చెప్పెను. అందుకు ప్రభువు నీవు నమ్మినయెడల దేవుని మహిమ చూతునని చెప్పి, వారు రాయి తీసిన తరువాత లాజరూ! బయటికి రమ్మని చెప్పగా అతడు బయటికి వచ్చెను. అయితే ఇక్కడ మరణపు వాసన రావలసినదేగాని

జీవపు వాసనయైయున్న క్రీస్తు ఉన్నందున మరణపు వాసన రాలేదు. ఈలోకములోని పాపము, వ్యాధి, మరణమువల్ల కలిగిన వాసనంతయు ఈ ప్రేమ పరిమళ వాసనయై యున్న క్రీస్తుప్రభువు వలన పరిహారమగును. ప్రభువు సమాధిలోయున్నను ఆయన శరీరము కుళ్ళుపట్టలేదు. మానవ శరీరమును మహిమ పరిమళ శరీరముగా మార్చగల ప్రభువు శరీరమెట్లు కుళ్ళు పట్టగలదు? ఈదినములలో ప్రభువు సన్నిది యందుండు వారికి ప్రభువుయొక్క పరిమళ వాసన వారి గదిలోనికి వ్యాపించు చున్నది. 1) బేరి యేసమ్మ అను ఆమె హిమాలయములలో ప్రభువు చెప్పగా మృగములుండు ఒక గుహయందు ప్రార్ధించుటకు వెళ్లినది. అక్కడ దుర్వాసన, పురుగులు ఉన్నందున సహించలేక ప్రభువా! ఈ వాసన తీసివేయుమని ప్రార్ధించగా అప్పుడు ఆ గుహలోనికి మూడు దినములు మంచి పరిమళ వాసన వ్యాపించినది. పురుగులు కూడ పోయినవి. 2) రెవ. వి. సుజీవరాజు ప్రభువు చెప్పగా మధ్యప్రదేశ్‌లో గల బాగ్‌లౌడు అను స్థలములో (పులుల గుహ) తొంబది దినములు ఉపవాస ప్రార్ధన చేసెను. అందు మృగములు ఉన్నందున దుర్వాసనతో నిండియున్నది. ప్రార్ధించినందున 90 దినములు పరిమళ వాసన ఆ గుహయందు కలిగినది. ఈ రెండువేల సంవత్సరములలో లోకములోని క్రీస్తు సంఘమునందు ప్రభువు ఉండి ఎన్నో మహిమగల మహోపకార్యములను చేయుచున్నారు. అవి లెక్కకు మించియున్నవి. క్రీస్తుప్రభుని యొక్క పావన లక్షణముల పరిమళమును వెయ్యేండ్ల పరిపాలన కాలములో సర్వసృష్టి సమస్త మానవులు పరిపూర్ణముగా అనుభవింపగలరు.

ప్రియ చదువరులారా! మీ హృదయమునందు ప్రభువు నివాసముండి మీ జీవితముద్వారా ఆయనయొక్క మహిమ పరిమళము అనేకులకు వ్యాపించును గాక!

Bible Mission HQ Guntur

# 29వ పాఠము

**నాకు నా ప్రియుడు ఏన్గెది ద్రాక్షావనములోని కర్పూరపు పూగుత్తులతో సమానుడు. ప॥గీ॥ 1:14.**

పై వచనములో ప్రియుడైన యేసుప్రభువు యొక్కయు వధువు సంఘము యొక్కయు పరిమళ సువాసన కలవారని వింటిమి. ఇక్కడ ప్రియుడు కర్పూరపు పూగుత్తులతో సమానుడని వధువు పలుకుచున్నది. ప్రియుని లోకములో ఉన్న విలువైన వాటికిని, పరిమళమైన వాటికిని పోల్చుచున్నది. సృష్టికర్తయైన ప్రభువు నుండి సమస్తము కలిగినది గనుక ఆయన స్వరూపమును చూచుచు సృష్టిలోని వాటికి ఆయనను పోల్చి చెప్పుచున్నది. పరమునకు వెళ్లిన తరువాత అక్కడ స్థితి వేరుగా ఉండును. గనుక ఆ స్థితిని బట్టి అక్కడ వర్ణించును. ప్రభువుకూడ సంఘము ఇక్కడ ఉన్నంతవరకు సృష్టిలో ఉన్నవాటిని ఎత్తి, సృష్టిలోని వధువు రూపమును వర్ణించును. పరమునకు వెళ్లిన తరువాత అక్కడ ఉన్న స్థితినిబట్టి వర్ణించుచునే ఉండును.

## పాలెస్తీన

I

1) క్షమాపణ–ఏన్గెది (యెహోషువా 15:61–63; 1సమూ. 2:23–29. 24:1–7; 2దిన. 20:2; యెహెజ్కేలు 47:10).

I

2) ప్రేమ – ద్రాక్షావనము – యూదా జనాంగము (కీర్త. 80:8–14; యెషయా 5:1–7; మత్తయి 21:33; యోహాను 15:1).

I

3) చేదు – కర్పూరపు వృక్షము – క్రీస్తుప్రభువు జీవితము (హెబ్రీ. 5:7).

## పూగుత్తులు – ఫలితములు

I

నాకు నా ప్రియుడు నా కొరకు సర్వమును కలుగజేసి నా కొరకే నరుడుగా లోకమునకు వచ్చి సిలువ మరణము పొంది పునరుత్థానుడై పరమునకు వెళ్లి అక్కడ నా కొరకు స్థలమును సిద్ధపరచి రెండవమారు వచ్చి నన్ను తీసికొని వెళ్ళి ఆయనలో నేనును, నాలో ఆయనయు యుగయుగములు జీవించుదుము. ఇవన్నియు నా కొరకు చేసెను గనుక నాకు నా ప్రియుడు.

పాలెస్తీన దేశము దైవవాగ్ధాన జనమైన ఇశ్రాయేలీయుల దేశము. ఈ దేశము సర్వలోకమునకు మధ్య నున్నది. సర్వలోక రక్షకుడైన క్రీస్తుప్రభువు ఈ దేశమునందు జన్మించెను.

**2) ఏన్గెది:–** ఈ పాలెస్తీన దేశమందు హసన్‌తామార్ అను ఏన్గెదీ స్థలమున్నది. ఇది మృత సముద్రమునకు సమీపమున కలదు. 2దిన. 20:2. దావీదు సౌలుచేత తరుమబడి ఏన్గెదీ కొండ స్థలములలో నివాసము చేయుచుండెను 1సమూ. 23:29. దావీదు ఏన్గెదీ అరణ్యమందున్నాడని సౌలు తెలిసికొని దావీదును వెదకుటకు వచ్చెను. సౌలు దావీదు ఉన్న గుహలోనికి శంకనివర్తికై వెళ్ళెను (మల విసర్జనకై) ఆ గుహలో దావీదు ఆయన సైన్యము ఉన్నారు. ఆ గుహలో దావీదు చేతికి సౌలు చిక్కినను చంపక విడిచిపెట్టి వస్త్రపు చెంగు కోసెను. దానికై దావీదు యెహోవాచేత అభిషేకము నొందిన నా ప్రభువైన సౌలునకు ఈ కార్యము చేయననెను 1సమూ. 24:1-6. శత్రువైన

సౌలు దావీదు చేతికి దొరికినను చంపక క్షమించి విడిచిపెట్టెను. ఈ స్థలము చంపుచున్న శత్రువులను క్షమించు స్థితిని కనబరచుచున్నది.

3) ద్రాక్షావనము - యూదాజనాంగమునకు పోల్చబడియున్నది. ఐగుప్తు నుండి ఒక ద్రాక్షవల్లిని తెచ్చి పాలెస్తీనాలో నాటెను. అది అన్ని స్థలములకు వ్యాపించెను కీర్తన 86:8-14. సత్తువ భూమిగల కొండమీద నా ప్రియునికొక ద్రాక్షతోట ఉండెను. యెషయా 5:1. ఈ ద్రాక్షతోట ఇశ్రాయేలీయుల వంశము. సైన్యములకు అధిపతియగు యెహోవా ద్రాక్షాతోట యెషయా 5:7. ప్రభువు ద్రాక్షతోటను యూదులకు పోల్చిచెప్పెను మత్తయి 21:33-45. ఈ జనాంగమే సర్వజనులకు రక్షణ తెచ్చిన రక్షకుడు జన్మించిన జనాంగము. దేవుని అంతరంగములోని ఆయన కార్యక్రమమును, లోకమునకు బయలుపరచిన బైబిలు గ్రంథ జనము. సర్వలోకమునకు సువార్తను ప్రకటించుచు రక్షణ, మోక్షప్రవేశము కలదని అనుభవములో కనబరచుచు, లోకమునకు ఉపయోగకరమైన అనేక ఉపకారములను చేయుచు పారమార్థికమైన జ్ఞానమును, ఇహలోక జ్ఞానమును, లోకమునకందించిన క్రైస్తవ సంఘ స్థాపనజనము. నిరంతరము స్తోత్రార్హుడైన దేవుడు శరీరధారిగా యేసుక్రీస్తను నామమున ఈ జనాంగమునందే జన్మించెను రోమా 9:5. ఈ క్రీస్తే ద్రాక్ష తోటయైన యూదా జనాంగము నుండి వచ్చిన ద్రాక్షవల్లి యోహాను 15:1. ఈ ద్రాక్షవల్లినుండి ద్రాక్షరసము వచ్చెను అనగా ఆయన పావన రక్తమే మత్తయి 26:26-30. ఈ ద్రాక్షారసము ప్రభువుయొక్క ప్రేమను సూచించుచున్నది ప॥గీ॥ 1:2.

ఏన్గెది అను స్థలమునందు దావీదు క్రీస్తుప్రభువు పాపులను క్షమించిన క్షమాపణ రూపమును కనబరచెను. అందుకు క్రీస్తుప్రభువు

దావీదు కుమారుడుగా ఎంచబడెను. ద్రాక్షవనము క్రీస్తుప్రభువు యొక్క ప్రేమను ఈ రెండింటిని క్రీస్తుప్రభువు సిలువలో కనబరచెను. ప్రభువు పాపులను సిలువలో క్షమించుటద్వారా ప్రేమను చూపెను. ప్రేమనుబట్టియే క్షమించెను.

**4) కర్పూర వృక్షము-** ఇది చేదుకు గుర్తు. అట్లే క్రీస్తు ప్రభువుయొక్క శ్రమ చరిత్ర కర్పూరముకన్నా చేదు. ఆయన జన్మము మొదలు ఆరోహణము వరకుగల జీవితములో ఇట్టి చేదువంటి శ్రమను చూడగలము హెబ్రీ. 5:7. పరిశుద్ధుడైన దేవుడు పాపియైన నరరూపమందు జన్మించుట చేదువంటి శ్రమయై యున్నది. దేవుని అంతరంగ వాసియైన ప్రభువు జన్మించినప్పుడు స్థలము లేక పశువుల తొట్టెలో పరుండబెట్టుటయే శ్రమ. ఆయన కలుగజేసిన మరియ యోసేపులను తల్లి, తండ్రి అని పిలుచుటయే శ్రమ. పాపి మానవునివలె ఆయన కలుగజేసిన యోహానువద్ద బాప్తిస్మము పొందుటయే శ్రమ. సర్వశక్తిగల దేవకుమారుడు అపవాదిచేత శోధింపబడుటయే శ్రమ. మానవునివలె పరిశుద్ధాత్మను పొందుటయే శ్రమ. ఈయన బోధను విని ఈయన మరియమ్మ కుమారుడు కాదా! అని హీనముగా మాట్లాడబడుటయే శ్రమ. పక్షవాతరోగి పాపములను ప్రభువు క్షమింపగా పాపములు క్షమించు అధికారము ఈయనకెక్కడిది అని వారు పలుకుటయే శ్రమ. సేన దయ్యములను వెళ్ళగొట్టినప్పుడు ఆ ప్రాంతవాసులు మా ప్రాంతమును విడిచి పొమ్మనుటయె శ్రమ. దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలు వలన ఆయన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడనుటయే శ్రమ. నాలుగు దినములు సమాధిలో ఉన్న లాజరును ప్రభువు బ్రతికించినప్పుడు ఆయనను లాజరును చంప నాలోచించుటయే శ్రమ. తుఫాను సమయమప్పుడు

శిష్యులు ప్రభువు వారితో ఉన్నను భయపడి ప్రభువా! నశించిపోవుచున్నాము. నీకు చింతలేదా? అని పలుకుటయే శ్రమ. క్రీస్తుప్రభువు కడవరి రాత్రి శిష్యుల పాదములు కడుగుటయే శ్రమ. ఆయన శిష్యులలో ఒక్కడైన ఇస్కరియోతు యూదా ప్రభువును విడిచిపెట్టి పారిపోవుటయే శ్రమ. గెత్సేమనె తోటలో శ్రమపడుట, ఆయనను పట్టుకొని నేరస్తునివలె సంకెళ్లు వేయుట, తీర్పుచేయుట ముండ్ల కిరీటము పెట్టుట, కొరడాతో కొట్టుట, అవమాన పరచుట, నేరములు మోపుట సిలువవేయుట, సిలువ మోయబడుట, దాహముగొన్నప్పుడు చేదుచిరకను ఇచ్చుట. ఇట్టివి అనేకములు, ఆయనకు చేదువంటి శ్రమలే. వీటన్నిటికన్నా సిలువలో ఉండి ఆయనను చంపుచున్న శత్రువులను క్షమించుమని తండ్రిని వేడుకొనుటయే ఎక్కువైన చేదు. ఆయన దాహము తీరుటకు శత్రువులు చేదు చిరకనిచ్చిరి. దానిని త్రాగుటకు ప్రభువు ఇష్టపడలేదు గాని పాపుల రక్షణ మహిమ కొరకు ఎంతటి చేదు శ్రమనైనను అనుభవించెను. కర్పూరము వలన క్రిములు నశించును. అట్లే ఈ కర్పూర వృక్షమైన క్రీస్తుప్రభువు శ్రమ మరణ పునరుత్థానము వలన కలిగిన ఫలితములే సాతానుయొక్క క్రియలను లయపరచెను 1పేతురు 2:24; 1యోహాను 3:8.

**కర్పూరపు పూగుత్తులు:-** క్రీస్తుప్రభువు శ్రమవలన కలిగిన ఆనందకరమైన ఫలితములే. ఈ పూగుత్తులు ఎ) క్రీస్తుప్రభువుయొక్క జన్మము మొదలుకొని ఆరోహణము వరకున్న ఆయన జీవితమంతటిలో మానవులకు ఇహపర సంబంధమైన ఉపయోగకరముగా నుండి వారి అంతరంగములను ఆయన తట్టు ఆకర్షించుకునే ఈ పూగుత్తులు బి) ఆయన శ్రమలోచూచిన సహనరూపమే. లోకమునకు పరిమళమిచ్చు వివిధములైన పూగుత్తులవంటివి. సి) ఆయన శరీరమునుండి కారిన

ప్రతి రక్తపు బొట్టు వలన శుద్ధీకరింపబడిన విశ్వాసులే వివిధ పరిమళములు గల పుష్పగుత్తులైయున్నారు. ఆ రక్తపు ధార వలన సర్వసృష్టికి కలిగిన ఫలములే ఈ పూగుత్తులు రోమా. 8:19-22. డి) సిలువలో ఆయన పలికిన పలుకులే అన్ని కాలములలో అన్ని లోకములలోను యుగాంతముల వరకును అన్ని వివిధములైన పరిమళమును వెదజల్లు పుష్ప సముదాయములై ఉన్నవి.

ప్రియ చదువరీ ప్రభువు శ్రమల వలన పుష్పమువంటి ఆనందకరమైన ఫలములు కలిగినట్లు మీ జీవితములలో కలిగిన శ్రమలవలన కూడ మీకును, ఇతరులకును ఆనందకరమైన అనుభవములు కలుగును గాక!

# 30వ పాఠము

**మత్త 26:26-29; మార్కు 14:22-25; లూకా 22:14-20; 1కొరింథీ 11:23-25**

ఈ సంస్కారము ఏర్పాటుచేసిన వారెవరు? సంస్కారము తీసికొన్న వారెవరు? (1) ఆయనే పాతనిబంధనలోని భక్తులందరు కనిపెట్టిన మెస్సియా వారు ఆ పాతనిబంధనలోని భక్తులయొక్క సంతతివారై, మెస్సియా జీవించిన కాలములోనివారు. ఆ 11మంది మెస్సియాయొక్క శిష్యులకు మధ్య ప్రభు భోజనమున్నది. మా పూర్వీకులు చూడవలసిన మెస్సియాను ఇన్నాళ్ళకు మేము చూచినామని వారి సంతోషము. మొదట ఆయనను కలిసికొన్నప్పుడు మేము మెస్సియాను చూచినామని ఒకరితో నొకరు చెప్పుకొనిరి. సంస్కార భోజనములో మేము మెస్సియాను కనుకొన్నాము అని చెప్పినవారు (2) ఆయనెవరు? ఆయన బోధకుడు. నా శరీరము నా రక్తము అనుభవించినవాడే శాశ్వత జీవి అని బోధించిన గొప్ప బోధకుడు. నా శరీరము నా రక్తము అనుభవించినవాడే శాశ్వత జీవి అని బోధించిన గొప్ప బోధకుడు (యోహాను 6వ అధ్యాయము). శరీర రక్తములు అన్నపానములుగ ఇచ్చిన బోధకుడు, ఆ శరీర రక్తములను గురించి పూర్తిగా బోధించిన బోధకుడు. వీరు ఆ సంగతి నేర్చుకొన్న విద్యార్థులు, వారే శిష్యులు. (3) లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల అని ఎవరినిగూర్చి చెప్పబడెనో ఆయనే ఈ మెస్సియా. ఎవరి పాపములు ఆయన మోసికొని వెళ్లెనో ఆ పాపాత్ములందరు పవిత్రులే. ఆయన దేవుని గొర్రెపిల్ల. వీరు సంస్కార సమయములో పరిశుద్ధులు. (4) ఆయన ఎవరు? నేను గొర్రెలకు మంచి కాపరిని అని చెప్పిన కాపరి. పైన ఆయన దేవుని గొర్రెపిల్ల. ఇక్కడ ఆయనకాపరి. వీరు ఆయన మేపే, నడిపించే గొర్రెలు. శాంతజలములయొద్దకు ఆయన

నడిపింపబడవలసిన గొర్రెలు. ఆయన కాపరియైయుండగా, వారు గొర్రెలైయుండగా వారికేమికొదువ. “నాకేమి కొదువ నాధుడుండ”. (5) ఆయన విందులో వడ్డించే ప్రధాని. కానానులోని వివాహములో ఒక పెండ్లి ప్రధాని ఉన్నాడు. ఆయనకు ద్రాక్షరసము అందినది. ప్రభు భోజన సంస్కార విందులో ప్రభువు వడ్డించే వడ్డనకర్త. ఆయన వడ్డించే వాడైన వీరెవరు? వీరు భుజించువారు. ఈ విందునకు ముందు 5వేల మందికి ఆయన వడ్డించక శిష్యులచేతికిచ్చి వడ్డింపచేసెను. 12మంది అక్కడ వడ్డనకర్తలుగా నున్నారు. ఈ విందులో మీరు కూర్చొనండి. నేను వడ్డించెదనని ప్రభువు చెప్పెను. శిష్యులకెంత సంతోషము - ఆయన మెస్సియా - వారు మెస్సియాను కనుగొన్నవారు, ఆయన బోధకుడు, వీరు నేర్చుకొన్నవారు; ఆయన పాపపరిహారకుడు - వీరు పరిశుద్ధులైనవారు : వీరు విందు భుజించువారు. ఒక గొప్పవారు విందుచేసి, పదార్థములను వడ్డించుమని ఇతరులకు అప్పగించి తాను మొదటి పంక్తిలోనివారికి మాత్రము వడ్డించిన ఆ పంక్తిలోనివారికి ఎంత సంతోషము. ఆలాగే యేసుప్రభువు ఇతరులైన శిష్యులనేకులు గలిలయలోను, యూదయలోను ఉండగా ఆ 11 మందికే వడ్డించెను. వారు ఆయనకు మూలచుట్టములు (ప్రత్యేక బంధువులు) అయినారు. బేతనియలో, కపెర్నహూములో, కానానులో, నజరేతులోను శిష్యులున్నారు. వారందరికన్న ఆ 11మంది ప్రత్యేక బంధువులైరి. ఆయన అతిధి అయినారు.

(7) ఈ ప్రభు రాత్రి భోజనమునకు సమభాక్త్యము అని పేరుకూడ ఉన్నది. ఎవరి ఇంటిలో వారు భోజనముచేసిన అది సమభాక్త్యమనబడదు. అన్ని ఇండ్లలోని వారు ఒకచోట కూర్చొని భోజనముచేసిన సమభాక్త్యము అనబడును. శిష్యులు వేర్వేరు గ్రామములవారు. ప్రభువు సముద్రము దగ్గర నున్నవారిని, సుంకపు

మెట్టుదగ్గర నున్నవారిని, అంజూరపు చెట్టుక్రింద నున్న వారిని పిలిచి వరుసగా కూర్చుండపెట్టి విందుచేసెను గనుక సమభాక్త్వము. గనుక ఆయన సమభాక్త్వ దానకర్త. వారు సమభాక్త్వ బాగులు అనగా పాలుపొందినవారు. యేసుప్రభువు గార్ధభాసీనుడై యెరూషలేమునకు వెళ్ళినప్పుడు ఈయన ఎవరు అని ప్రశ్నించిరి. ఈ రాత్రి భోజన సమయములో నేను "ఈయన ఎవరు? అని విచారించుచున్నాను. (8) ఆయన 3 సం॥లు వారితో కలిసి మెలిసి ఉన్న ఆయనయొక్క బాటమీద నడిచిరి. ఒకే దోనె ఎక్కిరి, ఒకే పంక్తిలో ఉండిరి. పాపులతో, సుంకరులతో భోజనముచేసి బసచేసిరి. ఈయన ఎవరనగా గొప్ప సహవాసి కూడ, ఉండి వెళ్ళిన చోట్లకెల్ల వారిని త్రిప్పిన సహవాసి. ఆ సహవాసి ఈ విందులో వడ్డించే సహవాసి అయినాడు. వారు ఆయన జట్టులోని సహవాసులు. గనుక ఆయన సహవాసులు. (9) ఆయన అసలైన మానవుడు. మనుష్యులు పరిశుద్ధులైనను ఒకప్పుడు పాపులే, పరిశుద్ధులగుచున్న పాపులు. ఆయన పాపికాదు, పరిశుద్ధుడగు పరిశుద్ధుడుకాదు, ఒకరివల్ల పరిశుద్ధుడుగా మార్చబడువాడుకాదు, అసలైన పరిశుద్ధుడు. వారు పాపులుగాని పరిశుద్ధులగుచున్నారు. కొంతకాలమునకు ఆయన రూపలావణ్యములు వారికి వచ్చుననిగలదు. ఆయన నరరూపి. వారు పరిశుద్ధులు కావలసిన నరరూపులు. ఆదిలో తన రూపము ఇచ్చిన నరరూపులుగాన తిరిగి ఆయన రూపము లోనికి వచ్చుటకు వారిని మేపుచున్నాడు (ఆహారమిచ్చుచున్నాడు) అదే ఈ విందు. (10) యెషయా 9:6లో మనకొరకు శిశువుపుట్టెను. ఆయన బలమైన శిశువు. అనగా మన తండ్రియైయున్న దేవుడు. ఆయన తండ్రి. వీరు తండ్రియొక్క బిడ్డలు. నేను ఆ 11 మందిలో ఉంటేనా! అప్పుడు లేకపోయినా పోనీలెండి ఈ సంస్కార భోజనములో, ఇప్పుడు ఉంటే చాలును. కృప తోడైయుండునుగాక!

# 31వ పాఠము

**దా.కీర్తన 103:1; మత్తయి 28:16-20; 1కొరింథీ 11:23-31**

యేసుప్రభువా! నాడు నీవు భూలోకములోనున్న నీ సంఘమునకు అనుగ్రహించిన గొప్ప విందు వర్తమానము ఇప్పుడును అనుగ్రహించుమని వేడుకొనుచు వందనములు చెప్పుచున్నాను.

మానవునికి లోకములో పుట్టుట ఒక్కసారే గాని మనము అనేకసార్లు పుట్టము, గాని జీవితకాలములో భోజనము మాత్రము అనేకసార్లు చేస్తాము. బాప్తిస్మము పుట్టుకతో సమానము. అన్యులైనవారు బాప్తిస్మముద్వారా తిరిగి జన్మించినవారై క్రైస్తవులుగా మార్చబడుచున్నారు. ముసలివాడైన నికోదేము తల్లి గర్భములో తిరిగి జన్మిస్తే, మనముకూడా తిరిగి రెండవసారి బాప్తిస్మము పొందవచ్చు.

పసిబిడ్డ జన్మించకముందు తల్లిలోని ఆహారమును, రక్తము, ఊపిరి, గుణములు, ప్రాణము అందుకొంటున్నది. తల్లిలోని రక్తము, గుణములు, రూపము, శరీరము అందుకొంటున్నది. తల్లికి ప్రసవము రాగానే బిడ్డను శుభ్రముచేసి, పరుండబెట్టి అచ్చం తల్లి, తండ్రి రూపముతోనే బిడ్డ ఉన్నదని చెప్పుకొందురు. అలాగే ప్రభు భోజనములో రొట్టె, శరీరము, ద్రాక్షారసము, రక్తము ఈ రెండు అందుకొన్నప్పుడు ఆయన గుణాలు, పరిశుద్ధత, మంచితనము, దైవత్వము అందుకొంటున్నది. తల్లిగర్భములోనే బిడ్డ అందుకొన్నట్లు ఇక్కడను అందుకొనుచున్నాము. బిడ్డ ఎదుగునప్పుడు తన తల్లి ఎంత పొడుగుగా ఉన్నదో అంత పొడుగుగా ఎదుగుచున్నది. అలాగే మనమును ప్రభువువలెనె ఎదగవలెను.

తల్లి గర్భములోనున్న బిడ్డకు తాను స్వయముగా తన తల్లియొక్క శరీర రక్తములు అందుకొన్నట్లు ఆ బిడ్డకు తెలియదు. అలాగే గర్భములోని బిడ్డ ఆహారము అందుకొన్నట్లు మనమును రొట్టె, ద్రాక్షారసముతో ఆయనను అందుకొనుచున్నాము. గర్భములోనున్న బిడ్డ తల్లినే అందుకొనుచున్నట్లు బిడ్డకే తెలియకపోయినా అందుకొనుచున్నది. తెలియడము వేరు, అందుకొనడము వేరు. అట్లే తెలియకపోయినా మనమును సంస్కార విందులో ప్రభుని శరీరమును, రొట్టెలో అందుకొంటున్నాము. ఆయన రక్తమును ద్రాక్షరసములో అందుకొంటున్నాము. గర్భములో ఉన్న బిడ్డ తన తల్లినే అందుకొనుచున్నది. మనము ప్రభు సంస్కారపు విందులో ప్రభువునే అందుకొంటున్నాము. ఏనాడో అదృష్టము చేసికొన్నందు వలన ఇవి దొరుకుచున్నవి గనుక వాటిని వద్దనకూడదు. ఈ విందులో ప్రభువే వడ్డించువారై యున్నారు. ఈ విందు బియ్యముతో భోజనము తయారుచేసి, వడ్డించులాంటి విందుకాదు. ఇది ప్రభువు అన్నీ తనలోనున్నవే తీసి తానే వడ్డించియున్నారు. ఈ విందు భోజనశాలనుండి గాని, హోటల్‌నుండిగాని తెచ్చిందిగాదు, మరియు వంటగది భోజనము, ఇంటిలోని భోజనముకాదు, దేవాలయములో ప్రభువు తానే ఇచ్చే భోజనము.

గుడిలో పాదిరిగారిచ్చేది రొట్టె, ద్రాక్షారసముకాదుగాని, దానితో ప్రభువు శరీరము, రక్తము ఇస్తున్నారు. కనబడే రొట్టె, ద్రాక్షారసమును మొదటిసారిగా ప్రభువు ఇచ్చేటప్పుడు తన శిష్యులకు కనబడని శరీర, రక్తములను గురించి వివరించెను. శిష్యులేమి అర్ధముచేసికొన్నారు ప్రభువుకు తెలియదు. గాని తాను వచ్చు పర్యంతము ఈ క్రమమును బోధకులను ఆచరించమనెను. బిడ్డ తొమ్మిది నెలలు గర్భములోనుండి

జన్మించాకకూడ తన తల్లే కావలెను అన్నది. అన్నము తినిపించిన, క్రిందపడినా తనతల్లే లేవదీసి తినిపించెను. అట్లే ప్రభువు తనే ఆహారముగా మనకు తినిపించును.

గురువారము రాత్రి 11మంది శిష్యులకు ప్రభువు తననితాను తినిపించెను. అక్కడ బోధయేమి చేయలేదు. ఇది విని సంస్కారముగురించి అన్యులైనవారు శిష్యులైనవారు ఆయనను ఎలాగు తిన్నారు? అని అడుగవచ్చు. అది వట్టిమాట అని అన్నట్లయితే, మనము వారిని ఈరీతిగా ప్రశ్నించవలెను. నీవు ఏలాగు తల్లిగర్భములో ఉండి తల్లి రక్తము త్రాగినావని? అనవలెను. ప్రయాసపడి భారము...... నాయొద్దకు రండి అని ప్రభువు పిలుచుచున్నట్లు ఒకరాజుగారు విందు చేయించి అంతా సిద్ధముగానున్నది. సందు, గొందులలో ఉన్నవారలారా రండి అని పిలిచెను. అట్లే ప్రభువు సమస్తము సిద్ధముగానున్నది. నేను మీలోనికి రావటానికి సిద్ధముగానున్నాను. రండి అనుచున్నారు.

బిడ్డ ఆహారము తింటున్నా చిక్కిపోతుండును గనుక వెంటనే వైద్యునికి చెప్పి ఏదో ఒక ఔషదము ఇవ్వాలి. అప్పుడు తల్లి బిడ్డలోనికి రావడానికి పాలిచ్చి బలపర్చును. అలాగే సంస్కారము తీసికొన్న మనముకూడ చిక్కకూడదుగాని, మనుష్యులముగాన చిక్కిపోతాము. గనుక మరలా మరలా పుచ్చుకొనవలెను. ఈ చిన్న వర్తమానమువలె చిన్నరొట్టె, కొంచెమే ద్రాక్షరసము పుచ్చుకొని అనుభవించి బలముపొందండి. ప్రభువు మిమ్ములను తన వాక్యముద్వారా, శరీరముద్వారా, రక్తముద్వారా దీవించి బలపరచునుగాక! ఆమేన్.

# 32వ పాఠము

**నిర్గమ. 16వ అధ్యా॥; యోహాను 6:52-58**

1. ప్రభువు సంస్కార విందు అందుకొన్నయెడల జీవముగలవారము అగుదుము. అందుకే ఈ విందు అందుకొనవలెను. 2. అంత్య దినమున లేచుటకు ఈ విందు భోజనము తినవలెను 3. నిజమైన ఆహారము, నిజమైన రక్తములో పాలుపొందుటయే ఈ విందుయొక్క పని.
4. ప్రభువుతో మనము ఏకమగుటకు ఈ విందు అవసరము. 5. మనము ఎల్లప్పుడు జీవించుటకు ఈ విందు పుచ్చుకొనవలెను.

**1కొరింథీ 10:2-4**

**1. జీవముగలవారికి ఈ విందు :-**

పాతనింబంధనలో ఒక విందు చూచినాము. తండ్రియైన దేవుడు పొడుగైన విందు 40సం॥లు చేసారు. పాతనిబంధన సంఘము ప్రయాణములో నున్న సంఘము, ఈ ప్రయాణము చేయుచున్న సంఘమునకు విందు 40 సం॥లు. మన విందులన్ని ఈ భూలోకమునుండి వచ్చినవే కాని ఈ విందు పరలోకమునుండి వచ్చినది. ఏడేండ్లు విందు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె చేసికొనే విందు. 7సం॥లు వారికి ప్రభువు మహిమే. శక్తియే అక్కడ విందు. అక్కడ మన ఏడేండ్లవిందు. వీరిద్దరు అనగా పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె తినే విందు. దాని మహిమను గ్రహించలేము. **ఈ భూలోకములో నుండి వెళ్లిన పెండ్లి కుమార్తెకు ఏడేండ్లు విందు లేకున్న బలము చాలదు. నూతన యెరూషలేము చేరుటకు ఏడేండ్లు విందులో** ఉండుట పెండ్లికుమార్తెయొక్క భాగ్యము. ఈ భాగ్యము పెండ్లి కుమార్తెకు ఇవ్వబడినది. ఈ విందు బలము వలన 1000సం॥లు పరిపాలన చేస్తారు. ఏడేండ్ల విందు మహిమను

రుచి చూచుటకు ప్రభువు మనలను ఆయత్త పరచునుగాక! పాతనిబంధన విందు మన్నా, ఏడేండ్ల ఈ విందుకు పెండ్లివిందు అని పేరు. పెండ్లికుమార్తె విందు మహిమగలది.

**2. అంత్య దినమున లేచుటకు ఈ విందు తినవలెను :-**

ప్రయాణములో నున్నవారికి ఇవ్వబడిన విందు. ఈ బల్లమీద నున్న విందు తీసికొనే మనము కూడా ప్రయాణములో నున్నాము. మన ఇంటి ప్రయాణములో నున్నాము. మనము నడిచి మన ఇంటికే వెళ్లుచున్నాము. మన తండ్రి మనకు సిద్ధపరచిన నివాసములకు వెళ్లుచున్నాము. యోహాను 14:2 ఆయన ఎక్కడ ఉంటాడో మనము అక్కడనే ఉంటాము. హెబ్రీ. 11:10 ఈ మహిమ సౌధములు ప్రభువే కట్టుచున్నారు. ఎవరు ప్రభువులోనికి వచ్చి విశ్వాసము కలిగి జీవించుచున్నారో వారందరికి పునాదులు పరమందు వేయబడినవి. 'నా భవనము నాకు చూపించు నాయనా' అనండి. ఆదామును సొంత చేతులతో చేసికొన్నాడు. ఆలాగే తన సొంత చేతులతోనే మనకు ఇల్లు ప్రభువే కట్టుచున్నారు.

నీటిమీద పునాదివేసి భూలోకమంతటిని నిర్మించిన ఆయనే మన బిల్డింగ్ కట్టుతున్నారు. ప్రభువే ఫలానా వారి బిల్డింగ్ చూపిస్తాను రా! అబ్బాయి అని చూపించారు. నేను చూచాను. పెద్ద, పెద్ద మంచు గడ్డలతోనే ఉన్నది. గృహములే నిర్మించటానికి వీలుగ ఉన్నంతకాలము నేను కడుతూనే ఉంటాను. అని ప్రభువు అన్నారు. కొంతమంది కట్టిన బిల్డింగులే పడగొట్టుకొంటున్నారు అని ప్రభువు వేదనచెందారు. పాట:- మహిమ లోకంబునకు మళ్ళినావా.....

**3. నిజమైన ఆహారము, నిజమైన రక్తములో పాలుపొందుటయే ఈ విందుయొక్క పని:-** పరలోక భవనముల కొరకు ఎదురు చూచుచున్న మనము. ఆ భవనముల వద్దకు సాగివెళ్లుటకు ఆయన ఇచ్చిన శరీరము

ఆయన ఇచ్చిన రక్తము తీసికొనవలెను. సంస్కారపు విందులో పాలుపొందు భాగ్యము నిత్యము జీవించుటకు, ఆయన శరీరమునుబట్టి ప్రభువా ప్రయాణములోనున్న నన్ను నీ శరీరముతో, నీ రక్తముతో పోషించి బలపరచుము. ఈ విందుద్వారా బలహీనత, నీరసము, నిస్సత్తువ రాకుండా 90 సం॥లు వచ్చినా పెండ్లి కళ తగ్గదు. పావురమా! నీ ముఖము నాకు కనబడనిమ్ము, నీ స్వరము నాకు వినబడనిమ్ము అని పెండ్లికుమారుడు పలుకుచున్నాడు.

కైలాస మహర్షిగారికి, ఏలియాగారికి, హనోకుగారికి వయస్సులేదు. భూలోకములో నున్న వృద్ధ పెండ్లికుమార్తె, కైలాస మహాఋషిగారు 400 సం॥లు దాటిపోయినది. కైలాస మహాఋషిగారు ఆయనతో నున్న 7000 మంది ఋషులనే ఆ పెండ్లికుమార్తె కన్నులు నిప్పు కణాలులాగ ఎర్రగా ఉంటాయి. సెకండులో ఎక్కడికైనా వెళ్లిపోగలరు. వారికి పెండ్లికళ తగ్గదు. ప్రతి ఆదివారము 7 వేల మంది ఋషులు కైలాస మహాఋషిగారి దగ్గరకు వస్తారు. నెలకొక్కసారి చెట్టు బెరడు తీసికొని వారికి సంస్కారమిస్తారు. హిమాలయ పర్వతములలో మహిమ ఉంటుంది. ఒక చెట్టు కొమ్మ తీసికొని ముక్కు దగ్గర పెట్టుకుంటే చనిపోరు. లేకపోతే చనిపోతారు. సృష్టిలో ఎంత మహిమ ఉన్నదో చూడండి. గ్రహించండి.

**4. ప్రభువుతో మనము ఏకమగుటకు ఈ విందు అవసరము:–** సంస్కార భోజనము పై నుండి మనకు వస్తుంది. ఈ ఆహారము పై నుండి వచ్చినది. మనలను పైకి తీసికొని వెళ్లుటకు ప్రభువే మనకు అందించారు. ఇశ్రాయేలు వారు దానిని చూచి ఇది ఏమిటో అని అన్నారు. ప్రభువు శరీర, రక్తము ఆంతర్యము నాకు తెలుసు అని అన్నవారు ఎవరైనా ఉన్నారా? శరీర రక్తములు విలువ మనకు తెలియదు. విశ్వాసముతో గ్రహించి ఈ బల్ల దగ్గరకు వస్తున్నాము. విశ్వాసముతో

ప్రభువునే తీసికొనుచున్నాము. ఆయన రక్తమును త్రాగుచున్నాము ఆయన శరీరమును తినుచున్నాము.

**మర్మమైన విందు:–** మన్నా కావాలంటే వంగి పోగు చేసుకోవాలి, రూతు పరిగ ఏరాలంటే, వంగి ఏరాలి. గనుక అతిశయముగా నిలబడి ఉన్నారా? వంగి తగ్గించుకొని వస్తున్నారా? మోకాళ్లమీద ఉండుట, తగ్గించుకొనుటకు ఎంత ముఖ్యమో గ్రహించండి. తగ్గించుకోలేకపోతే ఆయన ఆహారాన్ని అందుకోలేరు. బహు దీనత్వములో పనికిరాని వాడను, నీచుడను నీ విందు దగ్గరకు రావడానికి నాకు యోగ్యత లేదు అని వినయముతో రండి. ఆయనను అందుకొనుటకు దీనత్వము ఎంత అవసరమో గ్రహించండి.

మన్నా చిన్నది కొత్తిమీర గింజంత చిన్నది. మన్నా చిన్నది ఎలాగైనదో మనకొరుకు ప్రభువు అతి చిన్నవాడైనాడు. సురూపము సొగసులేని వాడుగా అయిపోయినాడు. యెషయా 53:2. ఆయన ఎంతగా తగ్గించుకొన్నాడో చూడండి. మన్నా చిన్నది. గుండ్రముగా నున్నది. అనగా సంపూర్ణమైనది. మన్నా యేసుప్రభువుని సూచించును. ఆయన తగ్గించుకొన్నాడు గనుకనే మనకు ఆహారమైపోయాడు. మనము ఎంతగా తగ్గించుకొని ఈ విందు దగ్గరకు రాగలమో! ముందుగానే మనము ప్రభుని చూస్తూ అన్ని విషయాలలో తగ్గించుకొని పెండ్లికుమార్తెగ సిద్ధపడండి. ఈ మన్నాను ఇశ్రాయేలీయులు భుజించారు. పరలోకము నుండి వచ్చినదే మన్నాను భుజించినా, వారియొక్క అవిధేయత తిరుగుబాటు గొణుగుడు వలన మరణించారు. ఈ మూడు పాపములు మీ దగ్గరకు రానీయకండి. పెద్దవాడైన మోషేలో కలిగిన పాపము సణుగుడు, అందుకే మహిమను, కిరీటమును, చావులేకుండా వెళ్ళే అంతస్థును పోగొట్టుకొన్నాడు. ఈ చిన్న, చిన్న పాపముల వలననే మన ఆత్మీయ

జీవితము తగ్గిపోతుంది. జాగ్రత్త! యేసే మనకు భోజనమైయున్నాడు. మనకు సంపూర్ణమైన భోజనము. ఈ భోజనము తిన్నవారు నిత్యజీవము గలవారు. వంగి, తగ్గించుకొని రండి. ఈ విందు భాగ్యములన్నీ పొందండి. ఈ విశ్వాస యాత్రలో బలము కళ పొందగలము, ప్రభువువద్ద వంగి ఆయన ఇచ్చు ఆహారము తీసికొని మహిమ మేఘమునకు సిద్ధపడుదముగాక! ఆమేన్.

**5. మనము ఎల్లప్పుడు జీవించుటకు ఈ విందు పుచ్చుకొనవలెను :-** జీవమిచ్చు రొట్టెను అందుకొనుటకు సంసిద్ధముగా రండి, నేనే జీవాహారమును (జీవపు రొట్టె). ఈ జీవపు రొట్టెను అందుకొనుటకు సిద్ధపడి రండి. ఆహ్వానించేవారు, వడ్డించేవారు, పదార్థముకూడా ఆయనే అనగా ప్రభువే. ప్రభువు బల్ల మనము ఎక్కవలసిన మహిమకొండ. ఈ మహిమ కొండ జాగ్రత్తగా మనము సమీపించవలెను. పరిశుద్ధతతో సమీపించవలెను.

ఆయన శరీరము అందుకొనే కొండ - మహిమ కొండ. ఆయన రక్తము అందుకొనే కొండ - మహిమకొండ. రూపాంతరపు కొండ ఎక్కిన శిష్యులు మోషేను, ఏలియాను చూచారు మరియు అసలైన దైవత్వమును చూచారు. ఈ మహిమ కొండ దగ్గరకు ఎవరు తగ్గించుకొని, దీనత్వముగా వస్తారో వారు దైవత్వమును అందుకొంటారు. పేతురు, యోహానుగారు వారిలో దైవశక్తి ఇముడ్చుకున్నారు. పేతురు నీడలోనికి గూడ దైవత్వము వచ్చింది. ఈ మహిమకొండ ఎక్కువారు పేతురువలె మహిమను వెదజల్ల గలరు. పంచిపెట్టగలరు.

ప్రభువే ఈ మహిమ కొండను ఎక్కుటకు అవసరమైన అర్హతనిచ్చునుగాక! ఆమేన్.

Bible Mission HQ Guntur

# ప్రభు సంస్కారపు విందు

## వర్తమానములు

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

**గుంటూరు - 2024** **చందా : 30.00**

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1999 | ప్రతులు | 5000 |
| రెండవ | ముద్రణ | 2013 | ప్రతులు | 3000 |
| మూడవ | ముద్రణ | 2021 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |


ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ


ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.


Bible Mission HQ Guntur

# ప్రశంస

దేవుడు తన స్వరూపమందు, తన పోలిక చొప్పున ఆదాము హవ్వలను కలుగజేసినారు. పరిశుద్ధులుగా కలుగజేయబడిన వీరు ఆజ్ఞాతి క్రమమునుబట్టి పాపులైనారు. పాపవిమోచనకు రక్తమే సాధనము గనుక ఏదెను తోటలోనే ప్రథమముగా దేవుడు ఒక గొఱ్ఱెపిల్లను వధించినాడు. తరువాత మోషేగారి కాలములో పస్కావిందు పేరిట గొఱ్ఱెపిల్లను వధించు క్రమమును దేవుడు ఏర్పరచినాడు. ఈ పస్కా గొఱ్ఱెపిల్లయే రాబోయే లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు ప్రభువునకు ముంగుర్తైయున్నది. తరువాత యేసుప్రభువే ఈ లోకమునకు వచ్చి బలియైనారు. క్రొత్త నిబంధన ఏర్పరచినారు. ఆ క్రొత్త నిబంధన సారాంశమే **'ఆయన శరీరమును తినుట, ఆయన రక్తమును త్రాగుట'** ప్రభువు ఇంకను సిలువలో బలికాక ముందే యీ మర్మమైన విందును ఏర్పరచినారు. **'నా శరీరమును తిని, నా రక్తము త్రాగువాడే నిత్యజీవము గలవాడు'** అని చెప్పిన ప్రభువు మాట సరిగా నుండి ఈ విందును ఆచరించువారు తమ జీవితములో అనుభవించగలరు. ఈ కడవరి కాలములో బైబిలు మిషను జనకులైన యం. దేవదాసు అయ్యగారు, ప్రభు సంస్కారపు విందును గూర్చి ఎన్నో మర్మమైన సంగతులు ఉపదేశించిరి వాటిని పత్రికలలో ప్రచురించిరి. నేడు వీటినన్నిటిని సమకూర్చి **'ప్రభు సంస్కారపు విందు'** అను పుస్తక రూపమున ప్రచురించి యున్నాము.

చదువరులు ఈ పుస్తకము ద్వారా ఆత్మీయాభివృద్ధి, వధువు రూపమును పొందు కృప, మహిమ మేఘమెక్కు భాగ్యము విందు ప్రధానియైన క్రీస్తుప్రభువు ద్వారా పొందుదురు గాక! ఆమేన్.


**బేతేలుగృహము,** **పెండ్లికుమారుడుగా రానైయున్న ప్రభువునందలి**

**రైలుపేట,** **రెవ. జె. శామ్యేల్ కిరణ్**

**గుంటూరు - 2024.** **ప్రెసిడెంట్, బైబిలుమిషను.**